ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

నల్లగొండ

fb.com/vaartha Digital

Published from Nalgonda, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Tadepalligudem, Srikakulam

27-4-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 86 పేజీలు: 8+16 వెల: 6.50

రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు 3

రష్యా ఎరువులప్లాంట్‌పై ఉక్రెయిన్ దాడి 5

కల్పాక్కం అణువిద్యుత్ కేంద్రంతో ఆత్మనిర్భర్ భారత్
సౌర, పవన విద్యుత్‌లోనూ మరింత పునరుజ్జీవమే
ఇక డిజిటల్ రూపంలోనే జనగణన 3

టిఎంసి హయాంలో మహిళకు రక్షణ లేదు 7

బెంగాల్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ

భారత్-న్యూజిలాండ్ మధ్య స్వేచ్ఛా వాణిజ్యం 5

నేడు ప్రధాని మోడీ సమక్షంలో ఒప్పందం
ఆగ్రాలో పీయూష్ గోయల్, న్యూజిలాండ్ మంత్రి కీలక భేటీ

జనగణనకు కదలండి

ఆదివారం హైదరాబాద్‌లో సెల్ఫ్ ఎన్యూమరేషన్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న సిఎం రేవంత్

సెల్ఫ్ ఎన్యూమరేషన్ పూర్తి చేసిన సిఎం రేవంత్

రాష్ట్రంలో ప్రారంభమైన తొలి విడత గణన

15 రోజుల పాటు సాగనున్న ప్రక్రియ

గృహ, వసతి, ఆస్తులపై 33 ప్రశ్నలు

ఉదయం 6 గం. నుండి అందుబాటులోకి పోర్టల్

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్26: భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జనగణన 2027లో భాగంగా తెలంగాణలో తొలివిడత జనగణన ప్రారంభమైంది. జనగణనలో భాగంగా ఆదివారం తన నివాసంలో సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పూర్తి చేశారు. అంతకు ముందు సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియకు సంబంధించిన వివరాలను ముఖ్యమంత్రికి సెన్సస్ అధికారులు వివరించారు. వెబ్ సైట్ ద్వారా తన వివరాలను సిఎం నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా జనగణనలో అందరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర ప్రజలకు సిఎం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డైరెక్టరేట్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టర్ భారతి హోళికేరి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వి కర్ణన్, జాయింట్ ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ ప్రియాంక ఆల, ఐ అండ్ పిఆర్ కమిషనర్ సీహెచ్. ప్రియాంక, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.జనగణన 2027లో భాగంగా తెలంగాణలో ఆదివారం నుంచి ఆన్‌లైన్‌లో స్వీయగణన ప్రారంభమైంది. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ), సైబరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్లను కలిపి ఒకే యూనిట్‌గా ఈ జనగణన చేపడుతున్నారు. మే 10 వరకు ప్రజలు స్వచ్ఛందంగా ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవచ్చు. ఈ 15 రోజుల పాటు సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియ కొనసాగుతుంది. పౌరులు వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయి, తమ వివరాలను సమర్పించవచ్చు. ఉదయం 6 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు పోర్టల్ అందుబాటులో ఉంటుంది. ఇందులో గృహ, వసతులు, ఆస్తులకు సంబంధించిన 33 ప్రశ్నలు ఉంటాయి. ఎలాంటి పత్రాలు అవసరం లేదని, 15-20 నిమిషాల్లో ప్రక్రియ పూర్తవుతుందని అధికారులు తెలిపారు. వివరాలు సమర్పించాక వచ్చే సెల్ఫ్ ఎన్యుమరేషన్ ఐడీ (ఎస్ఈఐడీ)ని, వెరిఫికేషన్ కోసం వచ్చే సిబ్బందికి చూపించాల్సి ఉంటుంది. ఇది భారతదేశంలోనే మొట్టమొదటి పూర్తిస్థాయి డిజిటల్ జనగణన కావడం విశేషం. మే 11 నుంచి జూన్ 9 వరకు ఇంటింటికి తిరిగి వివరాలు సేకరించే ప్రక్రియ ఉంటుంది.

ప్రజావాణి సేవలను క్షేత్ర స్థాయికి విస్తరించాలి: సిఎం

రాష్ట్రంలో ప్రజల అర్జీలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పకడ్బందీగా అమలు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజావాణి సేవలను క్షేత్రస్థాయికి విస్తరించాలని సూచించారు. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన మరుసటి రోజే 2023 డిసెంబర్ 8వ తేదీన ప్రజావాణి కార్య క్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. అప్పటి >>2

మన జనాభా.. మన లెక్కింపులో పాల్గొనండి
-గవర్నర్ శివప్రతాప్ శుక్లా 7

సమృద్ధిగా నిల్వలు.. వదంతులు నమ్మకండి

ప్రజలకు పౌరసరఫరాలశాఖ వినతి

హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: తెలంగాణలో పెట్రోల్, డిజిల్, ఎల్‌పిజి గ్యాస్ సరఫరా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ స్పష్టం చేసింది. వినియోగదారులు ఎలాంటి అపోహలకు గురికావొద్దని సూచించింది. రోజుకు 9574 కిలోలీటర్ల పెట్రోల్, 14457 కిలో లీటర్ల డిజిల్ మొత్తం 24వేల కిలో లీటర్లకు పైగా పెట్రోల్, డిజిల్‌ను బంకుల ద్వారా వాహన దారులకు సమకూరుస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈవిషయమై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. వినియోగదారులకు 2లక్షల 22వేలకు పైగా ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్లు డెలివరి చేస్తున్నట్లు తెలిపారు. పెట్రోల్, డిజిల్, గ్యాస్ సరఫరాపై సమస్యలు ఎదురైతే పౌరసరఫరాలశాఖ టోల్ ఫ్రినంబరు 1967కు ఫోన్ చేయాలని కోరారు. తెలంగాణలో పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ అధికా రులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెట్రోల్, డీజిల్ సరఫరాతోపాటు గ్యాస్ పంపిణీలో ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించి, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పౌర సరఫరాలశాఖ హెచ్చరించింది. ఏపీలో చమురు కొరతవార్తల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కూడా అప్రమత్తమైంది. కాగా.. తెలంగాణలో డీజిల్ కొరత తీవ్రతరమవుతోంది. ఇరాన్, అమెరికా యుద్ధం ప్రభావం వల్ల ఉమ్మడి ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో తీవ్ర డీజిల్ కొరత నెలకొంది. ముఖ్యంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సగానికి పైగా పెట్రోల్ బంకుల్లో డీజిల్ నిల్వలు లేవు. జాతీయ ప్రధాన రహదారుల పక్కన ఉన్న అనేక బంకుల్లో డిజిల్ నో స్టాక్ అనే బోర్డులే దర్శనమిస్తున్నాయి. దీంతో వినియోగదారులు డీజిల్ కోసం అల్లాడిపోతున్నారు. డీజిల్ కొరతతో వాహనదారులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా యాసంగి సీజన్‌లో వరి కోతలు ముమ్మరంగా కొనసాగుతున్నవేళ డీజిల్ లభించడకపోవడం రైతులకు పెద్దసవాల్‌గా మారింది.వరికోత యంత్రాలు నిలిచిపోవడంతో కోతలు ఆలస్యమవుతున్నాయి. దీనివల్ల వ్యవసాయ రంగ పనులు నిలిచిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. డీజిల్ కొరతను వెంటనే తీర్చాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. రెండు రోజులపాటు బంకుల్లో పెట్రోల్, >>2

ట్రంప్ విందులో కాల్పుల కలకలం

వాషింగ్టన్ హిల్టన్ హోటల్‌లో అలజడి

సురక్షితంగా బయటపడిన అధ్యక్షుడు

అది రాజ్యాంగంపై జరిగిన దాడి: ట్రంప్

సురక్షిత ప్రాంతానికి తరలింపు

నిందితుడు కాలిఫోర్నియా వాసిగా గుర్తింపు

వాషింగ్టన్, ఏప్రిల్ 26: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాల్గొన్న ఓ కార్యక్రమంలో కాల్పులు జరగడం, ఆ వెంటనే ఇరాన్‌తో కీలకమైన శాంతి చర్చలను ఆయన రద్దు చేయడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. వాషింగ్టన్‌లోని హిల్టన్ హోటల్‌లో శనివారం జరిగిన వైట్‌హౌస్ కరెస్పాండెంట్స్ అసోసియేషన్ వార్షిక విందులో ఈ కాల్పుల ఘటన చోటు చేసుకుంది. ఈ దాడి నుంచి ట్రంప్ సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటన ఇరాన్‌పై యుద్ధంలో విజయం సాధించకుండా తనను ఏమాత్రం ఆపలేదని ట్రంప్ స్పష్టం చేశారు. ఇది ఇరాన్‌తో దాదాపు రెండు నెలలుగా జరుగుతున్న యుద్ధానికి సంబంధించిన ఘటన కాదని తాను భావిస్తున్నట్లు తెలిపారు. 31 ఏళ్ల కోల్ థామస్ అలెన్ అనే వ్యక్తి ఈ దాడికి పాల్పడినట్లు గుర్తించారని, నిందితుడు పలు ఆయుధాలతో భద్రతా పాయింట్ వైపు దూసుకొచ్చాడని ట్రంప్ వివరించారు. ఒక సీక్రెట్ సర్వీస్ ఏజెంట్‌పై కాల్పులు జరపగా, బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్ అతడిని కాపాడిందని తెలిపారు. ఈ ఘటనతో విందును రద్దు చేశారు. మరోవైపు ఇరాన్‌తో శాంతి చర్చల కోసం పాకిస్థాన్‌కు వెళ్లాల్సిన తన రాయబారుల పర్యటనను కూడా ట్రంప్ రద్దు చేశారు. తనపై జరిగిన కాల్పుల సంఘటనను అమెరికా రాజ్యాంగంపై జరిగిన దాడిగా డొనాల్డ్ ట్రంప్ >>2

మూడేళ్లు పూర్తయితే బదలీ

టీచర్లకు మార్గదర్శకాలు జారీ

హైదరాబాద్, ప్రభాతవార్త, ఏప్రిల్ 26: పాఠశాల విద్యా శాఖలో బదలీలకు సంబంధించిన మార్గదర్శకాలను పాఠశాల విద్య డైరక్టర్ జారీ చేశారు. మూడు సంవత్సరాలు ఒకేచోట పనిచేసిన వారు బదలీలకి అర్హులైని పేర్కొన్నారు. 4 సంవత్సరాలు పూర్తయిన వారుతప్పనిసరి బదలీలు కావల్సి ఉంటుంది. మే31, 2027 లోపు పదవీ విరమణ పొందే వ్యక్తులు 4సంవత్సరాలు పూర్తి అయినప్పటికీ బదలీ చేయబడరని పేర్కొన్నారు. ఏ కేడర్‌లోనైనా 40 శాతంకి మించి ఉద్యోగులను బదలీ చేయరాదని మార్గదర్శకాల్లో పాఠశాల విద్య డైరక్టర్ నవీన్ నికోలస్ స్పష్టం చేశారు. బదలీలకు సంబంధించిన వివరాలను కేడర్ల వారీగా పనిచేస్తున్న మొత్తం ఉద్యోగుల వివరాలను తెలియజేయాలి. అన్ని కేడర్లలోనూ, ఒకే కేంద్రంలో 3 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసి బదలీకి అర్హత కలిగిన సిబ్బంది జాబితాను సిద్ధం చేయాలి. అలాగే 4 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసి, తప్పనిసరి బదిలీకి >>2



పగలు సెగలు

44° దాటుతున్న ఉష్ణోగ్రతలు

తెలంగాణలో తీవ్రస్థాయిలో వడగాడ్పులు

వడదెబ్బకు ప్రాణాలు కోల్పోతున్న జనం

ఆరెంజ్ అలర్ట్ జారీచేసిన వాతావరణ కేంద్రం

హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: తెలంగాణలో భానుడి భగ భగలు కొనసాగుతున్నాయి. భానుడి సెగలకు వడగాలులు తోడు కావడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం 8 గంటల నుంచి సూర్యాస్తమయం వరకు ఇంట్లో నుండి కాలు బయట పెట్టాలంటేనే జనం జంకుతున్నారు. భానుడి ప్రచండ ప్రభావానికి జనజీవనం అంతా అస్తవ్యస్తంగా మారిపోయింది. తెలంగాణమంతా నిప్పుల కొలిమిలా మారింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల మార్కును దాటి 42 డిగ్రీల నుంచి 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం నుంచే మండిపోతున్న ఎండకుతోడు మధ్యాహ్న సమయంలో విపరీతంగా వడగాల్పులు వీస్తుండడంతో పరిస్థితి ప్రమాదకరంగా మారుతోంది. రాష్ట్రంలో వేడి తీవ్రత సాధారణం కంటే 3 నుండి 4 డిగ్రీలు అధికంగా నమోదవుతోంది. ఆదివారం ఆసీఫాబాద్, పెద్దపల్లి, నిర్మల్, కెరిమెరి, దస్తూరాబాద్, అక్కినిపల్లి, భద్రాద్రి కొత్తగూడెంలో 44. 3డిగ్రీల గరిష్ట పగటి ఉష్ణోగ్రత నమోదైంది. జగిత్యాల జిల్లా రాయకల్‌లో 44.1 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. వికారాబాద్‌లో 40.8 డిగ్రీల మేర పగటి ఉష్ణోగ్రత నమోదైంది ఇక రాబోయే మూడు రోజులు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. పలు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారిచేసింది. ఉత్తర తెలంగాణ నిప్పుల కొలిమిగా మారనుందని తెలిపింది. ముఖ్యంగా రాబోయే మూడు రోజులపాటు ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్,మంచిర్యాల, నిజామాబాద్, పెద్దపల్లి జిల్లాల్లో ఎండల తీవ్రత గరిష్టంగా ఉండనుందని, ఏకంగా 45 డిగ్రీలను దాటే ప్రమాదం పొంచి ఉందని అంచనా వేసింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ రాజధాని నగరంలో కూడా ఎండలు దంచికొట్టనున్నాయని వాతావరణ కేంద్రం పేర్కొంది. మరోవైపు.. తీవ్రమైన ఎండల కారణంగా వడదెబ్బ ప్రభావంతో నిత్యం ప్రజలు ప్రాణాలు విడుస్తున్నారు. శనివారం ఒక్కరోజునే తెలంగాణ వ్యాప్తంగా నలుగురు వడదెబ్బతో దుర్మరణం చెందారు. ఎండ తీవ్రత దృష్ట్యా మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండలుతీవ్రంగా ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. దాహం వేయకపోయినా తరచుగా మంచినీరు,కొబ్బరినీళ్లు, మజ్జిగ, ఓఆర్ఎస్ వంటిపానీయాలు తీసుకుంటూఉండాలని సూచిస్తున్నారు. అదేవిధంగా వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలని, బయటకు వెళ్లేటప్పుడు గొడుగు, టోపి లేదా కళ్లద్దాలు >>2

అజారుద్దీన్, కోదండరాం నేడు ఎమ్మెల్సీలుగా ప్రమాణం

వారి నియామకంపై గెజిట్ నోటిఫికేషన్ జారీ

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్26: అజారుద్దీన్, కోదండరాంలను ఎమ్మెల్సీలుగా సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి వారి చేత ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. కాగా, గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా అజారుద్దీన్, కోదండరాం నియామకమయ్యారు. గత కొన్నాళ్లుగా పెండింగ్‌లో ఉన్న మంత్రి అజారుద్దీన్, కోదండరాంల ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాలకు ఇటీవల లైన్ క్లియర్ అయింది. ఎమ్మెల్సీ అభ్యర్థిత్వాల ఫైల్‌పై గవర్నర్ సంతకం చేశారు. ఈ నేపథ్యంలో గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీల నియామకంపై ఆదివారం గెజిట్ నోటిఫికేషన్ వెలువడింది. ఇప్పటికి మూడు సంవత్సరాలుగా గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపై వివాదం కొనసాగుతోంది. అయితే ఈ నెల 30లోగా ఎమ్మెల్సీ కాకపోతే అజారుద్దీన్ మంత్రి పదవి కోల్పోయేవారు. కాగా, 2023 మే 27న పదవీకాలం పూర్తి చేసుకున్న మాజీ ఎమ్మెల్సీలు డి.రాజేశ్వర్‌రావు, ఫరూక్ హుస్సేన్ స్థానంలో గవర్నర్ కోటా కింద కోదండరాం,అజారుద్దీన్ భర్తీ చేసినట్లు గవర్నర్ జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

ఉడుకుతున్న భారతం

మూడు రోజులు తీవ్రస్థాయి వడగాడ్పులు

కొన్ని ప్రాంతాలలో ఉష్ణోగ్రత 45° దాటే ప్రమాదం 7

పలు జిల్లాల్లో పట్టుబడుతున్న సీడ్స్
నిషేధిత హెచ్‌టి కాటన్ సీడ్స్‌ను అన్నదాతలకు అంటగడుతున్న వైనం
కోట్లలో సాగుతున్న చీకటి దందా

నకిలీ విత్తనాలపై ఏదీ నియంత్రణ?

రైతులను ముంచేస్తున్న వ్యాపారులు

హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: వానాకాలం సాగుకు సమయం మరో నెల రోజులే ఉండడంతో రాష్ట్రంలోకి పెద్ద ఎత్తున నకిలీ, నిషేదిత విత్తనాలు ప్రవేశిస్తున్నాయి. ఏటా తెలంగాణలో కోట్లాది రూపాయల నకిలీ విత్తనాల దందా కొనసాగుతోంది. వానాకాలం ముందే నకిలి విత్తనాలు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చేరుకుంటున్నాయి. వానాకాలం సాగు కోసం వరి, పత్తి విత్తనాల కోసం రైతులు సిద్ధమవుతున్న క్రమంలో ఏటా మాదిరిగానే ఈసారి కూడా విత్తన మాఫియా పెద్ద ఎత్తున నకిలీ విత్తనాలను అన్నదాతలకు అంటగట్టేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ముఖ్యంగా వరి, పత్తి, మొక్కజొన్న, మిరప, కూరగాయల నకిలీ విత్తనాలను అక్రమార్కులు రాష్ట్రంలోకి తరలిస్తున్నట్లు పెద్ద ఎత్తున పట్టుబడుతున్న నకిలీ >>2

ప్లీనరీ లేదు.. రాష్ట్ర కార్యవర్గ భేటీయే

ప్రతి ఊళ్లో పార్టీ జెండా ఎగురవేయండి: శ్రేణులకు కెటిఆర్ పిలుపు

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 26: బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ప్రతి గ్రామం, పట్టణం, నియోజకవర్గం, జిల్లా కేంద్రాల్లో పార్టీ జెండాలను ఎగురవేయాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు నిచ్చారు. పార్టీ శ్రేణులతో కేటీఆర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ.. సోమవారం (ఏప్రిల్ 27న) తెలంగాణ భవన్‌లో రాష్ట్ర స్థాయి ప్రతినిధుల సమావేశం జరుగుతుందని తెలిపారు. ఇటీవల జగిత్యాలలో భారీ బహిరంగ సభ నిర్వహించిన నేపథ్యంలో, ప్రస్తుత ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని >>2

బెంగళూరులో ఆదివారం జరిగిన టిసిఎస్ వరల్డ్ 10కె మారథాన్‌లో పాల్గొన్న జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా

పగలు సెగలు

>> వాడాలంటున్నారు. వీలైనంత వరకు మధ్యాహ్నం వేళల్లో ప్రయాణాలు,శారీరక శ్రమతో కూడిన పనులు వాయిదా వేసుకోవాలని హెచ్చరిస్తున్నారు. నూనెలో వేయించిన పదార్థాల కంటే చలువ చేసే ఆహార పదార్థాలను తినాలని స్పష్టం చేస్తున్నారు. వృద్ధులు, గర్భిణీలు, చిన్న పిల్లల విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని, అస్వస్థతగా అనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. తెలంగాణలోని ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్న జిల్లాల ప్రజలు మధ్యాహ్నం 12 నుండి 4 గంటల మధ్య ప్రయాణాలు తగ్గించుకోవాలని అధికారులు తెలిపారు.

ఈ నెల 28 నుండి జల్లులు...

మండే ఎండలతో అల్లాడుతున్న ప్రజలకు ఏప్రిల్ 28 నుండి ఊరట లభించనుంది. తొలుత దక్షిణ, పశ్చిమ తెలంగాణలో ప్రారంభమయ్యే ఉరుములతో కూడిన వర్షాలు ఆ తర్వాత హైదరాబాద్‌తో సహా రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాలకు విస్తరించనున్నాయి. ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, ఖమ్మం, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఈ వర్షాలకు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని, ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందని పేర్కొంది. ఈదురుగాలులు, వర్షం పడే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ అధికారులు సూచించారు. కాగా.. ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున కోతకు సిద్ధంగా ఉన్న పంటలను భద్రపరుచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఉరుములు, మెరుపుల సమయంలో చెట్ల కింద ఉండొద్దని, విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

ప్లీనరీ లేదు..
రాష్ట్ర కార్యవర్గ భేటీయే

>> కేసీఆర్ ఆదేశాల మేరకు ఈసారి ప్లీనరీని కేవలం రాష్ట్ర కార్యవర్గ సమావేశానికే పరిమితం చేసినట్లు కేటీఆర్ తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా అధ్యక్షులతో పాటు మాజీ ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లకు మాత్రమే ఆహ్వానం ఉందని పార్టీ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో పరిమిత సంఖ్యలోనే ప్రవేశం ఉంటుందని, ఆహ్వానం ఉన్న వారు మాత్రమే హాజరుకావాలని, మిగిలిన నాయకులు, కార్యకర్తలు తమ తమ నియోజకవర్గాల్లోనే ఉండి వేడుకలను ఘనంగా నిర్వహించాలని కేటీఆర్ కోరారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి గ్రామం, మండలం, పట్టణం, జిల్లా కేంద్రాల్లో పార్టీ జెండాను ఆవిష్కరించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఉదయాన్నే స్థానిక ప్రాంతాల్లో జెండా పండుగ ముగించుకుని, మధ్యాహ్నం 1:30 గంటల కల్లా హైదరాబాద్ చేరుకోవాలని దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రతినిధులకు సూచించారు.

ఫోన్ ట్యాపింగ్‌లో మళ్లీ కదలిక
56 మంది బాధితుల విచారణకు సిట్ నిర్ణయం

హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరోసారి కదలిక వచ్చింది. ఈ కేసు విచారణ దాదా పు పూర్తయి, ఛార్జిషీటు కూడా దాఖలై కోర్టులో తదుపరి దర్యాప్తు మొదలు కావస్తున్న తరుణంలో మరో 56 మంది బాధితులను విచారించాలని సి ట్ నిర్ణయించింది. ఇందులో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానాల మాజీ సభ్యుడు శివకుమార్‌కు ఇప్పటికే నోటీసులు ఇచ్చి ఈ నెల 28వ తేదీ న బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్‌కు విచారణకు రావాలని సిట్ ఆదేశించడం తెలిసిందే. మిగతా వారికి సోమవారం నుంచి నోటీసులు జారీ చేయనున్నారు. వీరిని మే నెల మొదటి వారం నుంచి నెలాఖరు వరకు వరుసగా విచారించేందుకు సిట్ నిర్ణయించింది. 56 మంది ఫోన్ ట్యాపింగ్ బాధితుల్లో ఎక్కువగా సెలబ్రిటీలు, సినీ రంగానికి చెందిన వారు, జుడిషియల్ సిబ్బంది, జర్నలిస్టులు వున్నారని తెలుస్తోంది. బిఆర్ఎస్ హయాంలో అప్పటి ఎస్ఐబి చీఫ్‌గా వున్న ప్రభాకర్ రావు నేతృత్వంలోని ప్రత్యేక బృందం వీరి ఫోన్లను ట్యాపింగ్ చేసి సొంత లాభానికి వాడుకుందని ఈ కేసు ను విచారిస్తున్న సిట్‌కు ఆధారాలు లభించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే వీరి వాంగ్మూలం తీసుకోవాలని సిట్ నిర్ణయించినట్లు తెలిసింది. ఇక ఫోన్ ట్యాపింగ్ కేసు విషయానికి వస్తే రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు అధికారంలో వచ్చాక 2024 మార్చి నెలలో ఇది వెలుగు చూసింది. దీనిపై మొ దట పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదవగా ఆ తరువాత ఈ కేసు విచారణకు హైదరాబాద్ పోలీసు కమిషనర్ స్వీయ పర్యవేక్షణలో, నాటి పశ్చిమ మండల డిసిపి ఆధ్వర్యంలో దర్యాప్తు సాగింది. ఈ కేసుకు సంబంధించి ఎస్ఐబిలో డిఎస్పిగా వున్న దుగ్యాల ప్రణీత్ రావు, అంతకు ముందు నిఘా విభాగంలో పనిచేసిన అదనపు ఎస్పి భుజంగరావు, హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ వింగ్ అదనపు ఎస్పి తిరుపతన్న, టాస్క్‌ఫోర్స్ మాజీ డిసిపి రాధాకిషన్ రావులు అరెస్టయి ఏడు నెలలకు పైగా జైలులో వుండి బెయిలుపై విడుదలయ్యారు. వారిచ్చిన వాంగ్మూలంలో అనేక మంది బిఆర్ ఎస్ నాయకుల పేర్లు ఫోన్ ట్యాపింగ్‌లో వెలుగు చూశాయి. ఈ కేసులో మొదటి నిందితుడుగా వున్న ఎస్ఐబి మాజీ బాస్ ప్రభాకర్ రావు అమెరికా పారిపోతే ఆయనను ఏడాదిన్నర తరువాత వెనక్కు రప్పించి పలుమార్లు విచారించాక, సుప్రీం కోర్టు అనుమతి మేరకు వారం రోజుల పాటు పోలీసు స్టేషన్‌లోనే కస్టడీలో వుంచి మరీ అనేక అంశాలపై ప్రశ్నించారు. ఇదే కేసులో మీడియా అధినేత శ్రవణ్ రావును కూడా పోలీసులు విచారించారు. రె ండేళ్లకు పైగా సాగుతున్న ఈ కేసుకు సంబంధించి సిట్ పోలీసులు నాంపల్లి కోర్టులో ఛార్జిషీట్ కూడా దాఖలు చేశారు. వచ్చే నెల కోర్టులో ట్రయల్స్ మొదలయ్యే తరుణంలో సిట్ అధికారులు అనూహ్యంగా మరో 56 మంది బాధితులను విచారించేందుకు నిర్ణయించడం సంచలనం రేపింది.

పంచాయితీ రాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఎం. దాన కిషోర్ బాధ్యతల స్వీకరణ

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్26: రాష్ట్ర ప్రభుత్వ పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్.డబ్ల్యు.ఎస్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఎం. దాన కిషోర్ నేడు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కూడా అదనపు భాద్యతలలో దాన కిషోర్ కొనసాగుతున్నారు.

పెట్రోలు ఫుల్

>> డిజిల్ ఉండదన్న వదంతులతో ఖమ్మంతోపాటు రాష్ట్రంలోని పలు నగరాల్లో వాహనదారులు పెట్రో బంకుల ముందు క్యూ కట్టారు. రాత్రి నుంచి వాహనదారులు పెట్రోల్ బంకులముందు బారులు తీరారు. కొన్ని బంకులు మూసివేసి ఉండడంతో వాహనదారుల్లో ఆందోళన మొదలైంది. పెట్రోల్, డిజిల్ దొరకదని అపోహలతో కొంత మంది వ్యక్తులు క్యాన్లలో నింపుకు పోతున్న వీడియోలు వైరల్‌గా మారాయి. హైదరాబాద్ నగరంలోనూ కొద్ది రోజుల క్రితం ఇలాంటి ఘటనలే చోటు చేసుకున్నాయి. ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల్లో పెట్రోల్, డీజిల్ కొరతపై ఆయిల్ సరఫరా కంపెనీల ఉన్నతాధికారులతో కేంద్ర పెట్రోల్, సహజ వాయు స్టాండింగ్ కమిటీ సభ్యుడు, బిఆర్ఎస్ ఎంపి వద్దిరాజు రవిచంద్ర మాట్లాడారు. సరఫరా మెరుగు పరిచి పెట్రోల్, డీజీల్ కొరత తీర్చాలని సూచించారు. ఆయిల్ కంపెనీల ప్రతినిధులకు సమస్య తీవ్రతను వివరించారు. సోమవారం కల్లా సమస్యను అధిగామిస్తామని ఎంపికి ఆయిల్ కంపెనిలు బిపిసిఎల్, ఐఒసిఎల్, హెచ్‌పిసిఎల్ కంపెనీల ప్రతినిధులు హామి ఇచ్చారు.

మూడేళ్లు పూర్తయితే బదలీ

>> గుర్తయ్యే వ్యక్తుల జాబితాను కూడా రెడీ చేయాలి. ప్రస్తుతం ఉన్న స్పష్టమైన ఖాళీలు. తప్పనిసరి ఖాళీల జాబితాను ప్రకటించాలి. బదలీలకు అర్హులైన అభ్యర్థులు మే 8 నుంచి 15 వరకు బదలీకి సంబంధించిన తమ ఐచ్ఛికాలను నమోదు చేసేలా వారు తగిన చర్యలు తీసుకోవాలని మార్గదర్శకాల్లో తెలిపారు. బదలీలపై ప్రభుత్వ ఉత్తర్వు(జీవో)లో జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని, బదలీల ప్రక్రియ అంతా సజావుగా, పారదర్శకంగా జరిగేలా చూడాలని ఆదేశించారు.

వారం - వర్జ్యం

27-04-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, శుక్లపక్షం, భరణి కార్తె
ఏకాదశి సా.6.19
పూర్వఫల్గుణి రా.9.21
వర్జ్యం : తె.4.56-ఉ.6.37
దు.మ.12.30-మ.1.21,2)3.02-మ.3.53
శుభసమయం:ఉ.8.30-9.30
రాహుకాలం - ఉ.7.30-9.00

వార్తాఫలం

మేషం : ఆర్థికంగా ఇబ్బంది లేకపోయినా రావలసిన ధనం పూర్తిగా చేతికందదు. ప్రయాణాలు లాభిస్తాయి.

వృషభం: కీలక నిర్ణయాలలో జీవిత భాగస్వామి సలహాలు తీసుకుంటారు. మీలోని ప్రతిభాపాటవాలు వెలుగు చూస్తాయి.

మిథునం: పై అధికారులతో మాట్లాడే టప్పుడు సంయమనం పాటించండి. కుటుంబ సమస్యలు తీరుతాయి.

కర్కాటకం: నిదానమే ప్రధానమన్న సూక్తి, పాటించడం అన్నివిధాలా క్షేమం. వ్యాపారాలలో ఊహించని మార్పులు వుంటాయి.

సింహం: ఆధ్యాత్మికత పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు. మానసికంగా ప్రశాంతతను కలిగిఉంటారు.వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి.

కన్య : వృద్ధులు, శ్రేయోభిలాషులను కలిసి వారి సలహాలను తీసుకుంటారు. కాలం కలిసి వచ్చినట్లుగా వుంటుంది.

తుల : బంధువుల నుండి ముఖ్యమైన సమాచారం అందుకుంటారు. పెండింగ్ కేసుల నుండి బయట పడుతారు.

వృశ్చికం: విద్యార్థినీ, విద్యార్థులకు అవకాశాలు కలిసివస్తాయి. ఆరోగ్యం పట్ల శ్రద్ధవహించండి. బంధువుల కలయిక.

ధనుస్సు: అనాథశరణాలయాలకు మీ వంతు సహాయాన్ని అందిస్తారు, ఉద్యోగులకు స్థాన చలనం ఉంటుంది.

మకరం: సన్నిహితుల సహకారంతో నూతన కార్యక్రమాలకు చేపడతారు. వివాహయత్నాలు ముమ్మరం చేస్తారు.

కుంభం: ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు.

మీనం : భూముల క్రయవిక్రయాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. నూతన ఒప్పందాలు కుదుర్చుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

జనగణనకు కదలండి

>> నుంచి ఇప్పటి వరకు ప్రతి మంగళవారం, శుక్రవారం మహాత్మా జ్యోతిభా పూలే ప్రజా భవన్లో ప్రజావాణి విజయవంతంగా అమలవుతోంది. అన్ని విభాగాలకు చెందిన అధికారులు అక్కడికక్కడే ప్రజలు ఇచ్చే అర్జీలు, దరఖాస్తులను స్వీకరించి వేగవంతంగా వాటిని పరిష్కరించే చర్యలు చేపడుతున్నారు. జిల్లా స్థాయిలోనూ కలెక్టర్ల అధ్వర్యంలో ప్రతి వారం ప్రజా వాణి నిర్వహిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి ప్రజలు హైదరాబాద్‌కు, జిల్లా కేంద్రానికి వచ్చే బదులు ప్రజావాణి సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదివారం ఉదయం ఎంసీహెచ్‌ఆర్‌డీలో జరిగిన సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంవో అధికారులను ఆదేశించారు. వెంటనే రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి ప్రారంభించాలని చెప్పారు. తరువాత దశలో మండల స్థాయికి ప్రజావాణిని విస్తరించాలని సూచించారు. ప్రజా వాణిలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి అన్ని స్థాయిల్లో అధికారులకు పూర్తి అధికారాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రజలు ఇచ్చే ప్రతి ఫిర్యాదును నమోదు చేయాలని, సంబంధిత విభాగాలకు పంపించాలని, పరిష్కార పురోగతిని అర్జీదారునికి తెలియజేయాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదుల పరిష్కారానికి నిర్ణీత గడువులు ఉండాలని, ఆలస్యం జరగకూడదని చెప్పారు. ఫిర్యాదుల నమోదు, ట్రాకింగ్, పరిష్కారానికి ఏకీకృత డిజిటల్ ప్లాట్‌ఫాం అభివృద్ధి చేయాలని ఆదేశించారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రియల్ టైమ్ మానిటరింగ్ ఉండాలని సూచించారు. ప్రతి స్థాయిలో ప్రజావాణికి ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రతి జిల్లాలోనూ, ప్రతి శాఖలో ప్రత్యేక ప్రజావాణి విభాగాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఒకస్థాయిలో పరిష్కారం కాకపోతే, పైస్థాయి అధికారికి అర్జీ అందేలా ఆటో ఎస్కలేషన్ వ్యవస్థను అమలు చేయాలని చెప్పారు. అవసరమైతే అప్పీల్ వ్యవస్థను ప్రవేశపెట్టాలని సూచించారు. పిర్యాదుల పరిష్కార ప్రక్రియలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. పెండింగ్ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. డ్యాష్‌బోర్డ్ ద్వారా పరిష్కార పురోగతి తెలుసుకునే వీలుండాలని, ఎక్కడైనా ఆలస్యం జరిగితే సంబంధిత అధికారులను బాధ్యులను చేయాలని చెప్పారు ప్రజావాణి సేవలను వికేంద్రీకరించటంతో జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో పెండింగ్ అర్జీల సంఖ్య తగ్గుతుందని, కిందిస్థాయిలోనే కొన్ని పరిష్కరించే వీలుంటుందని సీఎం అభిప్రాయపడ్డారు. ప్రజలకు నమ్మకంగా ఉండేలా ప్రజావాణి సేవలు అందించాలని సూచించారు.

బెంగాల్‌లోని హౌరాలో శనివారం బిజెపి, టిఎంసీ కార్యకర్తల మధ్య ఘర్షణ దృశ్యం

చివరి సిక్సర్‌తో రెండుజట్ల స్కోరు సమం!
కెకెఆర్ వర్సెస్ ఎల్ఎస్జీ మ్యాచ్ టై

లక్నో, ఏప్రిల్ 26: ఐపిఎల్ 2026లో భాగంగా లక్నోలో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో కెకెఆర్; ఇటు లక్నో సూపర్‌జైంట్స్ రెండు జట్లు కూడా 155 పరుగులు చెరిసమానం చేయడంతో మ్యాచ్ టై అయింది. ముందు బ్యాటింగ్‌చేపట్టిన కోల్‌కత్తా నైట్‌రైడర్స్ ఏడు వికెట్ల నష్టానికి 155 పరుగులుచేయగా ప్రత్యర్థికి 156 పరుగులు లక్ష్యం విధించింది. తదనంతరం బ్యాటింగ్‌చేపట్టిన లక్నో సూపర్‌జెయింట్స్ 20 ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 155 పరుగులుచేయడంతో మ్యాచ్ టై అయింది. మ్యాచ్ అనూహ్యంగా సూపర్ ఓవర్‌వరకూ వెళ్లింది. లక్ష్యఛేదనలో తడబడుతూ ఆడినా లక్నో జట్టు రిషబ్‌పంత్ 42 పరుగులు, ఇంపాక్ట్ సబ్ హిమ్మత్‌సింగ్ 19 పరుగుల మెరుపులతో కోలుకుంది. కోల్‌కతాను 155కే కట్టడి చేసిన లక్నో ఇన్నింగ్స్ ఆసాంతం తడబడుతూ సాగింది. మిచెల్ మార్ష్(2)ను షార్ట్ పిచ్ బంతితో వైభవ్ అరోరా బోల్తా కొట్టించాడు. క్రీజులో కుదురుకున్న మర్క్‌రమ్(31) గ్రీన్ ఓవర్లో భారీ షాట్ ఆడగా బౌండరీ లైన్ వద్ద రింకూ సింగ్ అద్భుత క్యాచ్‌కు పెవిలియన్ చేరాడు. కాసేపటికే నరైన్ బౌలింగ్‌లో స్వీప్ షాట్ ఆడబోయిన రిషభ్ పంత్(42) వికెట్ కీపర్ సీఫర్ట్ చేతికి చిక్కడంతో లక్నో కష్టాల్లో పడింది. ప్రత్యర్థి జట్టును మరింత కష్టాల్లో పడేస్తూ డేంజరస్ నికోలస్ పూరన్(9)ను పక్కా ఫీల్డింగ్ మార్పులతో వరుణ్ డగౌట్ చేర్చాడు. కీలక వికెట్లు పడిన వేళ ఆయుశ్ బదొని(24), ముకుల్ చౌదరీ(0లు గెలుపు బాధ్యత తీసుకోవాలనుకున్నారు. అనుకుల్ రాయ్ ఓవర్లో సిక్సర్‌కు యత్నించిన ముకుల్ రింకూ చేతికి దొరికాడు. ఇంప్యాక్ట్ సబ్ హిమ్మత్ సింగ్(19) సిక్సర్‌తో ఆశలు రేపగా బదొనిని చక్రవర్తి వెనక్కి పంపాడు. 12 బంతుల్లో 28 రన్స్ అవసరమైన వేళ షమీ, హిమ్మత్ చెరో ఫోర్ కొట్టారు. చివరి ఓవర్లో హిమ్మత్ ఔటైనా ఆఖరి బంతికి షమీ సిక్సర్ కొట్టడంతో స్కోర్లు సమమయ్యాయి.

ట్రంప్ విందులో కాల్పుల కలకలం

>> పేర్కొన్నారు. ఘటన గురించి ట్రంప్, ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్ వివరాలను వెల్లడించారు. నిందితుడి వద్ద అనేక ఆయుధాలు ఉన్నాయని ట్రంప్ చెప్పగా ఘటనా స్థలంలో ఒక లాంగ్ గన్, తుపాకీ షెల్స్ లభ్యమైనట్లు కాష్ పటేల్ ధృవీకరించారు. నిందితుడి వద్ద ఉన్న ఆయుధాల గురించి మరిన్ని వివరాలు ప్రస్తుతం అందుబాటులో లేవని చెప్పారు. ఈ ఘటనపై ట్రంప్ స్పందిస్తూ తాను ఎంతో పదునైన ప్రసంగాన్ని సిద్ధం చేసుకున్నానని, ప్రస్తుత పరిస్థితులవల్ల తదుపరి కార్యక్రమంలో తన ప్రసంగం చాలా ప్రశాంతంగా ఉంటుందని తెలిపారు. తాను ప్రసంగించడానికి సర్వసన్నద్ధంగా ఉన్నానని, కానీ భద్రతాకారణాల దృష్ట్యా వచ్చేసారి చాలా సాదాసీదాగా వ్యవహరిస్తానని ట్రంప్ చెప్పారు. ఈ విపత్కర పరిస్థితులు ఎదురైనప్పటికీ, భవిష్యత్తులో తాము ఒక గొప్ప కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆయన అన్నారు. వైట్ హౌస్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ డిన్నర్ వేదికపైనే ఉండాలని తాను గట్టిగా ప్రయత్నించానని, కానీ భద్రతాబలగాల సూచన మేరకు వెనక్కి తగ్గాల్సి వచ్చిందని చెప్పారు. ఈ కాల్పుల ఘటన ప్రథమ మహిళ మెలానియా ట్రంప్‌ను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని అన్నారు. భద్రతా సిబ్బంది అత్యంత వేగంగా స్పందించిన తీరును ఆయన అభినందించారు. సీక్రెట్ సర్వీస్ అద్భుతంగా స్పందించిందని, కాల్పులు జరిపిన వ్యక్తిని సీక్రెట్ సర్వీస్‌కు చెందిన కొందరు అదుపులోకి తీసుకున్నారని ట్రంప్ వెల్లడించారు. ఘటనలో పారదర్శకత, స్పష్టత కోసం తాను విడుదల చేయమని ఆదేశించిన ఒక టేప్‌ను ఇప్పుడే అధికారులు విడుదల చేశారని తెలిపారు. త్వరలోనే కరస్పాండెంట్స్ డిన్నర్ మీట్‌ను తిరిగి నిర్వహిస్తామని చెప్పారు.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాల్గొన్న వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ డిన్నర్ కార్యక్రమం వద్ద జరిగిన కాల్పుల ఘటన యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘటనకు బాధ్యుడిగా భావిస్తున్న నిందితుడి ఫోటోను, వీడియోను స్వయంగా డొనాల్డ్ ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్ లో విడుదల చేశారు. ఇతడే ఆ మానసిక రోగి అంటూ ట్రంప్ చేసిన పోస్ట్ ఇప్పుడు వైరల్ అవుతోంది. నిందితుడి వివరాలు, దాడి తీరు, సీక్రెట్ సర్వీస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం నిందితుడు బుల్లెట్‌ప్రూఫ్ వెస్ట్ ధరించి, అత్యాధునిక ఆయుధాలతో భద్రతా వలయాన్ని ఛేదించి లోపలికి ప్రవేశించేందుకు ప్రయత్నించాడు. భద్రతా సిబ్బంది అతడిని అడ్డుకునే ప్రయత్నం చేయగా, నిందితుడు కాల్పులకు తెగబడ్డాడు. ఈ క్రమంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక సీక్రెట్ సర్వీస్ అధికారికి ఛాతీపై బుల్లెట్ తగిలింది. అయితే, అతను బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్ ధరించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడని అధికారులు తెలిపారు. దాడికి పాల్పడిన వ్యక్తిని కాలిఫోర్నియాలోని టొరెన్స్‌కు చెందిన కోల్ థామస్ అలెన్ (31)గా గుర్తించారు. సీక్రెట్ సర్వీస్ సిబ్బంది అతడిని అదుపులోకి తీసుకున్నారు. ట్రంప్ విడుదల చేసిన చిత్రాల్లో, నిందితుడు నేలపై పడి ఉండగా, భద్రతా సిబ్బంది అతడిని చుట్టుముట్టి ఉన్న దృశ్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ దాడి వెనుక ఉగ్రవాద కోణం ఉందా లేక వ్యక్తిగత కారణాలున్నాయా అనే దిశగా ఎఫ్‌బీఐ, సీక్రెట్ సర్వీస్ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. తుపాకీ శబ్దాలతో విందు ప్రాంగణం ఒక్కసారిగా భయానకంగా మారింది. ఏం జరుగుతుందో తెలియక జర్నలిస్టులు, అతిథులు భయంతో టేబుళ్ల కింద, కుర్చీల వెనుక దాక్కున్నారు. కొద్దిసేపటికే టాక్టికల్ బృందాలు హోటల్‌ను తమ ఆధీనంలోకి తీసుకుని, అతిథులందరినీ సురక్షితంగా బయటకు పంపించాయి. ఘటన అనంతరం వైట్‌హౌస్‌లో మాట్లాడిన ట్రంప్ తనను, దేశాన్ని రక్షించేందుకు ప్రాణాలకు తెగించి పోరాడిన సీక్రెట్ సర్వీస్ అధికారుల ధైర్యసాహసాలను కొనియాడారు. ఆ అధికారి ఒక హీరో. నేను అతనితో మాట్లాడాను, అతడు క్షేమంగా ఉన్నాడు. మన దేశంలో ఇలాంటి హింసకు తావులేదు. ఇది ఒక మానసిక రోగి చేసిన పిచ్చిపని అని ట్రంప్ వ్యాఖ్యానించారు. రద్దయిన ఈ డిన్నర్‌ను వచ్చే 30 రోజుల్లో మరింత ఘనంగా నిర్వహిస్తామని ఆయన ప్రకటించారు.

ప్రజలంతా సెల్ఫ్ ఎన్యూమరేషన్ చేసుకోవాలి
2047కి వికసిత భారత్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 26 ప్రభాతవార్త: ప్రజాస్వామిక దేశమైన భారతదేశంలో అనేక భాషలు, మతాలు, కులాలు, ప్రాంతాలు కలిసిన సమాజం ఉంది. మన దేశ స్వరూపం, విశిష్టతను మనతో పాటు ప్రపంచానికి తెలియజేసే గొప్ప కార్యక్రమం జనగణన అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. జనగణనలో భాగంగా దిల్ కుషా గెస్ట్ హౌస్‌లో సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రారంభించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడారు. అధికారుల సమక్షంలో సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకున్నారు. ప్రజలంతా సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకోవాలని పిలుపునిచ్చారు. జనగణన ద్వారా దేశంలో ఎన్ని భాషలు ఉన్నాయి, ఎన్ని రకాల జీవన విధానాలు ఉన్నాయి వంటి వివరాలను ప్రపంచ చిత్రపటంలో ఆవిష్కరించే అవకాశం కలుగుతుంది. ఈ గొప్ప అవకాశం జనగణన ద్వారా లభిస్తుందన్నారు. 2027లో జరగబోయే జనగణన ప్రత్యేకమైనదని, స్వాతంత్రం వచ్చిన తర్వాత మొదటిసారిగా బిసి జనాభా గణన ఇందులో భాగమవుతుందని, అదేవిధంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరుగుతున్న మొదటి జనగణన ఇదే అన్నారు. ఇది కేవలం జనాభా, ఇళ్ళ సంఖ్య గణన మాత్రమే కాదు. దేశ ప్రణాళిక, అభివృద్ధి, భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడానికి ఉపయోగపడే అద్భుతమైన ప్రక్రియ అన్నారు. ప్రపంచంలోని అన్ని దేశాల్లో జనగణన ఉన్నప్పటికీ, మనలాంటి విభిన్నతలతో కూడిన పెద్ద ప్రజాస్వామ్యంలో ఇది ఒక పండుగలా జరుగుతుందన్నారు. అందుకే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దీనిని ఒక పండుగలా నిర్వహించాలని, ప్రజలందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇది కేవలం కేంద్ర ప్రభుత్వ కార్యక్రమం కాదు, ఇది మన అందరి కార్యక్రమం అన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో సచ్చందంగా, పండుగ వాతావరణంలో భాగస్వాములు కావాలని కోరుతున్నానని అన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే సమానమైన, సమాంతర అభివృద్ధి అవసరం. అందుకు సరైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించడానికి ఈ జనాభా సేకరణ ఎంతో ఉపయోగపడుతుందని మీరు ఇచ్చే సమాచారం భారత్ దేశానికి, హైదరాబాద్ నగరానికి, తెలంగాణ రాష్ట్రానికి ఉపయోగపడుతుందన్నారు.

నకిలీ విత్తనాలపై ఏదీ నియంత్రణ?

>>విత్తన ఘటనలు రుజువు చేస్తున్నాయి. మంచిర్యాల, కొమరం బీం ఆసిఫాబాద్, నాగర్‌కర్నూలు, హైదరాబాదన నగర శివారులో వ్యవసాయ, రెవెన్యూ,పోలిసుశాఖ (టాస్క్‌ఫోర్స్)ల అధికారులు నిర్వహిస్తున్న దాడుల్లో పెద్ద ఎత్తున నకిలీ విత్తనాలు పట్టుబడుతున్నాయి. ఇప్పటికే ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లో నకిలీ పత్తి విత్తన దంపులు ఏర్పాటు చేసినట్లు సమాచారం. నకిలీ విత్తన దళారులకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విత్తన వ్యాపారులు పూర్తిగా సహకరిస్తున్నారన్న విమర్శలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. వానాకాలం సాగు సీజన్ మొదలయ్యేలోపు డిమాండ్ ఉన్న ప్రాంతాలకు నకిలీ విత్తనాలను తరలించేందుకు, తొలకరి వర్షాలు పడగానే రైతులకు అంటగట్టేందుకు దళారులు, వ్యాపారులు రంగం సిద్ధం చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి గోనెసంచులతో పాటు వివిధ మార్గాల్లో నిషేధిత, నకిలీ విత్తనాలను రాష్ట్రానికి తీసుకొస్తున్నారు. మహారాష్ట్ర సరిహద్దు జిల్లాలైన కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, ఆదిలాబాద్‌కు ప్రతియేటా టన్నుల కొద్దీ నకిలీ పత్తి విత్తనాలు వస్తున్నాయి. కర్ణాటక సరిహద్దులో ఉన్న నారాయణపేట, జోగులాంబ గద్వాల, నాగర్ కర్నూల్, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో నిషేధిత పత్తి విత్తనాల దంపులు ఏర్పాటు చేస్తున్నారు. ఇక హైదరాబాద్ నగర శివారుల్లోని మేడ్చల్, శంషాబాద్, ఘట్ కేసర్, కొంపల్లి తదితర ప్రాంతాల్లో నకిలీ పత్తి విత్తనాల నిల్వలు భారీగా ఉన్నట్లు సమాచారం. అదే సమయంలో నకిలీ విత్తన దళారులు, వ్యాపారులు కలిసి కమిషన్ ప్రాతిపదికన ఊరికో దళారిని నియమించుకుని రైతులతో నకిలి పత్తి, వరి విత్తనాలను కొనుగోలు చేయిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ప్రధానంగా రాష్ట్రంలో వానాకాలంలో 50లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుంటుంది. ప్రస్తుతం రైతులు పత్తి విత్తనాలను సమకూర్చుకునే పనిలో నిమగ్నమయ్యారు. దీంతో ప్రతి ఏటా మాదిరిగానే ఈసారి కూడా గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి హెచ్‌టి (హెర్బిసైడ్ టాలరెంట్) పత్తి విత్తనాలను దిగుమతి చేసుకొని రహస్య ప్రదేశాలకు తరలించటానికి అక్రమార్కులు యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నారు. రాష్ట్రంలో ఏటా 50 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుండడంతో ఇందులో 20 శాతం సాగుకు(10లక్షల ఎకరాలకు) సరిపడేలా నిషేదిత హెచ్‌టి పత్తి విత్తనాలను సరఫరా చేయటమే లక్ష్యంగా అక్రమార్కులు పనిచేస్తున్నారు.

ఉమ్మడి నల్లగొండ, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో మారుమూల ప్రాంతాల్లో హెచ్‌టి కాటన్ విత్తనాలు నిల్వ చేస్తున్నారు. నిషేధిత హెచ్‌టి కాటన్ సిడ్‌ను గ్లైసిల్ పేరుతో విక్రయిస్తున్నారు. గ్లైపొసెట్ అనే గడ్డిమందును కూడా ఈ విత్తనాలు తట్టుకుంటాయని చెబుతుండడంతో రైతులు సైతం కూలీల కొరత , ఖర్చుల భారాన్ని తగ్గించుకునే ఆలోచనతో కొనుగోలు చేస్తున్నారు. తొలకరి వర్షాలు పడగానే పత్తి రైతులకు వీటిని అంటగట్టాలనే లక్ష్యంతో వ్యాపారులు, దళారులు పనిచేస్తున్నారు. వ్యవసాయశాఖ, పోలీసుశాఖ తనిఖీలు లేకపోవటంతో అనుకున్నచోటికి సులువుగా తరలిస్తున్నారు. ఇక నాగర్‌కర్నూలు జిల్లా భూత్పూరులో చాలా కాలంగా పత్తి విత్తనాలను (జిన్నింగ్ విత్తనాలు) తయారు చేసి రైతులకు పెద్ద ఎత్తున అంటగట్టగా ప్రస్తుతం ఈ దందా హైదరాబాద్‌కు మారింది. కంపెని తయారు చేసిన విత్తనాలు 450 గ్రాముల ప్యాకెట్ ధర రూ.900 వరకు అమ్ముతుండగా జిన్నింగ్ విత్తనాలు కూడా బ్రాండెడ్ ప్యాకెట్లలోనే సగం ధరకే విక్రయిస్తుండడంతో చాలా మంది రైతులు మోసపోతున్నారు. ఎపిలోని గుంటూరు, కర్నూలు, ప్రకాశం, నంద్యాల నుంచి తెలంగాణలోకి పెద్ద ఎత్తున నకిలీ పత్తి విత్తనాలు దిగుమతి అవుతున్నాయి. వరి విత్తనాలు సైతం నాసిరకంగా ఉంటున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. జనగామ జిల్లాలో పలు మండలాల రైతులు కొనుగోలు చేసి యాసంగిలో సాగుచేసిన వరి విత్తనాల్లో నాణ్యత లోపించడంతో వరితోపాటు సమానంగా కలుపు మొక్కలు (వరిని పోలి ఉండే కలుపు) పెరుగుతున్నాయని బెంబేలెత్తిపోతున్నారు. రూ.లక్షల పెట్టుబడి పశువుల మేతగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో దొరుకుతున్న నకిలీ విత్తనాల వల్ల పంట సర్వనాశనం అవుతున్నదని ఆందోళన చెందుతున్నారు. వరి పొలాల్లో వరిని పోలిన కలుపు మొక్కలు ఏపుగా పెరుగుతుంటే, విత్తనాల నాణ్యతను తనిఖీ చేయాల్సిన వ్యవసాయశాఖ ఏం చేస్తున్నదని రైతులు ప్రశ్నిస్తున్నారు.

అయితే ప్రభుత్వం సిరియస్‌గా ఆదేశించడంతో పోలిసులు, వ్యవసాయశాఖ అధికారులు నకిలీ విత్తనాల నియంత్రణపై దృష్టిసారించారు. రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలను పెంచారు. దీంతో నకిలీ విత్తన దళారులు, వ్యాపారుల బండారం బట్టబయలవుతోంది.

కొద్ది రోజుల క్రితం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పేట్ బషీరాబాద్ ప్రాంతంలో 30 క్వింటాళ్ల నిషేదిత పత్తి విత్తనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.30లక్షలు ఉంటుందని కుత్బుల్లాపూర్ జోన్ పోలీసు అధికారులు ప్రకటించారు. నకిలీ విత్తనాల బస్తాలపై క్యాబేజీ బస్తాలను వేసి గుట్టుగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు.

ఇక డిజిటల్ రూపంలోనే జనగణన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: దేశవ్యాప్తంగా కొనసాగే జనగణన ప్రక్రియలో ప్రజలు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే సౌలభ్యం ఉందని, ఇప్పటికే 12 మిలియన్ల కుటుంబాల ఇళ్ల జాబితా పూర్తయిందని తెలిపారు. ప్రజలనుంచి సేకరించిన సమాచారాన్ని పూర్తి సురక్షితంగా గోప్యంగా ఉంచుతామని అన్నారు. జనాభా గణన ప్రక్రియ ప్రపంచంలోనే అతిపెద్దదని, 2027 జనాభా లెక్కల వివరాలను డిజిటల్ రూపంలో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. సిబ్బంది మొబైల్‌యాప్‌ద్వారా ప్రజల వివరాలు నమోదుచేస్తారని, ప్రజలు స్వయంగా నమోదుచేసుకునేందుకు కూడా అవకాశం ఉందని మోడీ అన్నారు. ప్రధాని మోడీ తన 133వ మన్ కీ బాత్ ఎపిసోడ్‌లో ఆదివారం దేశాభివృద్ధి, పర్యావరణం, సంస్కృతి, విజ్ఞాన శాస్త్ర రంగాల్లో భారతదేశం సాధిస్తున్న విజయాలను వివరిస్తూ సందేశం ఇచ్చారు. సౌర, పవన శక్తి వినియోగం మన భవిష్యత్తుకు ముఖ్యమని పిలుపునిచ్చారు. తమిళనాడులోని కల్పక్కంలో ఉన్న ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ క్రిటికాలిటీని సాధించడం ద్వారా మన అణు శాస్త్రవేత్తలు చరిత్ర సృష్టించారని మోడీప్రశంసించారు. ఈ అణు రియాక్టర్ పూర్తిగా స్వదేశీ సాంకేతికతతో నిర్మించడం ఆత్మనిర్భర్ భారత్ కృషికి నిదర్శనమని ఆయన ప్రకటించారు. అణు ఇంధన ఉత్పత్తిలోకూడా మరో మైలురాయిని అధిగమించగలిగామని ప్రధాని పేర్కొన్నారు. పవన్ విద్యుత్‌లో కూడా భారత్ నాలుగో స్థానంలో ఉందని, ప్రస్తుతం 56 గిగావాట్లకుపైగా పవనవిద్యుత్ ఉత్పత్తిచేస్తున్నామని గత ఏడాదికంటే ఆరు గిగావాట్ల పవనశక్తి ఎక్కువ ఉత్పత్తి అవుతున్నదన్నారు. భారతదేశ వైవిధ్యం, సాంకేతిక ప్రగతి మరియు పర్యావరణ బాధ్యతలను ప్రతిబిం బించింది. సామాన్యుల విజయగాథల నుంచి అణుశక్తి ప్రయోగాల వరకు అనేక అంశాలను ఆయన ఈ సందర్భంగా స్పృశించారు .ప్రధాని మోడీ ప్రకృతి సమతుల్యత గురించి మాట్లాడుతూ, ఉత్తరప్రదేశ్‌లోని టెరాయ్ ప్రాంతంలో పంట కోత సమయంలో ఏనుగులు గ్రామాల దరికి చేరడం వల్ల తలెత్తే ఘర్షణలపై ఆందోళన వ్యక్తం చేశారు. అదే సమయంలో, ఛత్తీస్‌గఢ్‌లో కృష్ణజింకలు తిరిగి కనిపించడం శుభపరిణామమని కొనియాడారు. ఒకప్పుడు ఎడారి ప్రాంతాలకు చిహ్నంగా ఉండి, అంతరించిపోయే దశకు చేరుకున్న గ్రేట్ ఇండియన్ బస్టర్డ్ పక్షి సంరక్షణ ఆవశ్యకతను ఆయన గుర్తు చేశారు. సిలిగురికి చెందిన 9వ తరగతి విద్యార్థి చందన్ మాలిక్ గీసిన చిత్రాన్ని ప్రధాని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఆ బాలుడికి వ్యక్తిగత లేఖ రాసి ప్రోత్సహించడం ద్వారా యువ కళాకారులలో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. బ్రెజిల్‌లో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో రెండు భారతీయ చీజ్ బ్రాండ్‌లు అవార్డులు గెలుచుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తూ, భారతీయ పాల ఉత్పత్తుల వైవిధ్యాన్ని కొనియాడారు. గౌతమ బుద్ధుని బోధనలు నేటి సంఘర్షణల ప్రపంచానికి అత్యంత అవసరమని ప్రధాని పేర్కొన్నారు. శాంతి మనతోనే మొదలవుతుంది అన్న బుద్ధుని సందేశాన్ని చిలీ దేశంలో లడఖ్‌కు చెందిన ద్రుబ్‌పోన్ ఓట్జర్ రిన్‌పోచే ప్రచారం చేయడం గర్వకారణమన్నారు. 2017లో వెదురును చెట్టు కేటగిరీనుండి తొలగించడం వల్ల ఈశాన్య రాష్ట్రాల్లో వెదురు రంగం విప్లవాత్మక మార్పులు సాధించిందని ప్రధాని అన్నారు. ఈశాన్య భారతాన్ని అష్టలక్ష్మిగా అభివర్ణిస్తూ అక్కడి అభివృద్ధిని ప్రశంసించారు. డిజిటల్ రంగంలో జాతీయ ఆర్కైవ్స్ 20 కోట్లకు పైగా పత్రాలను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెచ్చిందని వెల్లడించారు. ఫ్రాన్స్‌లో జరిగిన గణిత ఒలింపియాడ్‌లో భారతీయ బాలికలు కనబరిచిన అద్భుత ప్రతిభను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

కల్పాక్కం అణువిద్యుత్ కేంద్రంతో ఆత్మనిర్భర్ భారత్

సౌర, పవన విద్యుత్‌లోనూ మరింత పునరుజ్జీవమే

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, చిత్రంలో బండి సంజయ్, చింతల రామచంద్రారెడ్డి తదితరులు

10న తెలంగాణలో ప్రధాని మోడీ పర్యటన

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఏప్రిల్ 26, ప్రభాతవార్త: సోమాజిగూడ జయ గార్డెన్స్‌లో నిర్వహించిన మన్ కీ బాత్ 133వ ఎపిసోడ్ కార్యక్రమాన్ని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే చింతల రామ చంద్రారెడ్డి, బీజేపీ నేత గౌతం రావు తదితరులతో కలిసి వీక్షి ంచారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటనపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టత ఇచ్చారు. వచ్చే నెల 10న ప్రధాని మోడీ తెలంగాణకు రానున్నట్లు తెలిపారు. మూడోసారి దేశ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఇదే ఆయన తొలి తెలంగాణ పర్యటన అన్నారు. ఈ పర్యటనలో భాగంగా రాష్ట్రంలో పలు కీలక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారన్నారు. ముఖ్యంగా పలు రైల్వే స్టేషన్లను జాతికి అంకితం చేయడంతో పాటు, జాతీయ రహదారుల నిర్మాణ పనులకు శంకు స్థాపనలు చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్య క్రమాలకు ఈ పర్యటన మరింత ఊతమిస్తుందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. అదేవిధంగా, హైదరా బాద్‌లోని పెరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే భారీ ప్రజాసభలో ప్రధాని మోడీ పాల్గొననున్నారని, ఈ సభకు నగర ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఖజానాకు ఓవర్ డ్రాఫ్ట్, అడ్వాన్సులే ఆధారం

నిత్యం ఉండాల్సిన మినిమమ్ బేలన్స్ రూ.1.38 కోట్లు

బ్యాంకుల్లో అమలుచేయని కనీస రోజువారీ నగదు నిల్వ

123 రోజులపాటు రూ.37,457 కోట్ల ఓవర్‌డ్రాఫ్ట్

అప్పులపైనే నెట్టుకొస్తున్న ఆర్థిక నిర్వహణ

హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: రోజువారీ ఆర్థిక వ్యవహారాలు నడపడానికి తెలంగాణ ప్రభుత్వం అప్పులపై ఆధారపడుతోంది. చివరకు బ్యాంకుల్లో కూడా కనీస నగదు నిల్వ లేకపోవడంతో రాష్ట్ర ఖజానాకు ఓవర్ డ్రాఫ్ట్, అడ్వాన్సులపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఉత్పన్న మవుతోంది. ఆర్థిక శాఖ, కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ నివేదికలు వెల్లడించిన వివరాలు చూస్తే రాష్ట్ర ప్రభుత్వం రోజు వారీ నగదు నిల్వలను సైతం నిర్వహించలేకపోతుందనేది వెల్లడవుతోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం కేవలం రెండు రోజులు మాత్రమే కనీస రోజువారీ నగదు నిల్వను నిర్వహించింది. ఆ ఆర్థిక సంవత్సరం మొత్తంలో కేవలం రెండు రోజులు మాత్రమే తప్పనిసరి కనీస రోజువారీ నగదు నిల్వను నిర్వహించింది.

ఓవర్‌డ్రాఫ్ట్, వేస్ అండ్ మీన్స్ అడ్వాన్స్‌లపై ఎక్కువగా ఆధారపడటంతో తీవ్రమైన ద్రవ్య కొరతను సూచిస్తోంది. 2024 ఏప్రిల్ 1 నుండి 2025 మార్చి 31 వరకూ రెండు రోజుల పాటు, రాష్ట్ర ప్రభుత్వం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుండి స్పెషల్ డ్రాయింగ్ ఫెసిలిటీ, వేస్ అండ్ మీన్స్ అడ్వాన్స్ మరియు ఓవర్‌డ్రాఫ్ట్‌లను ఆశ్రయించకుండా బ్యాంకులో కనీస నగదు నిల్వను నిర్వహించింది. రిజర్వ్ బ్యాంక్‌తో కుదిరిన ఒప్పందం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకులో కనీసం రోజువారీగా రూ.1.38 కోట్ల నగదు నిల్వను నిర్వహించాల్సి ఉంటుంది. ఏ రోజైనా ఈ నిల్వ అంగీకరించిన కనీస స్థాయి కంటే తక్కువగా ఉంటే, ఆ లోటును ఎప్పటికప్పుడు స్పెషల్ డ్రాయింగ్ ఫెసిలిటీ (గతంలో స్పెషల్ వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సెస్ అని పిలిచేవారు), వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సెస్, లేదా ఓవర్‌డ్రాఫ్ట్ ద్వారా భర్తీ చేస్తారు. 2024-25లో రాష్ట్ర ప్రభుత్వం రూ.27,730 కోట్ల స్పెషల్ డ్రాయింగ్ ఫెసిలిటీని 363 రోజులకు, మరో రూ.64,188 కోట్ల వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సులను 298 రోజులకు వినియోగించుకుందని అధికారవర్గాలు తెలిపాయి.

ఈ నేపధ్యంలో సంవత్సరాంతానికి వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సుల కింద చెల్లించని మొత్తం రూ. 5,842 కోట్లుగా ఉంది. వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సెస్, స్పెషల్ డ్రాయింగ్ ఫెసిలిటీని వినియోగించుకున్నప్పటికీ, నగదు నిల్వ నిర్దేశిత పరిమితి అయిన రూ.1.38 కోట్ల కంటే తక్కువకు పడిపోయినప్పుడు రిజర్వ్ బ్యాంక్ నుండి ఓవర్‌డ్రాఫ్ట్ తీసుకునే అవకాశం ఉంటుంది. ఈ విధంగా 2024-25లో రాష్ట్ర ప్రభుత్వం 123 రోజుల పాటు రూ.37,457 కోట్ల ఓవర్‌డ్రాఫ్ట్‌ను వినియోగించుకుంది.

31 మార్చి 2025 నాటికి రాష్ట్రానికి రూ.9,420 కోట్ల రెవెన్యూ లోటు, రూ.48,922 కోట్ల ద్రవ్య లోటు ఉందని, దీనిని ప్రభుత్వ రుణం రూ. 46,370 కోట్లు, ఆకస్మిక నిధి రూ.1 కోటి, ప్రభుత్వ ఖాతా రూ.2,558 కోట్లు మరియు నగదు నిల్వ రూ. 7 కోట్లుతో సహా అప్పులు మరియు బాధ్యతల ద్వారా భర్తీ చేశారనేది నివేదికల్లో పేర్కొంది. రెవెన్యూ వసూళ్ల రూ.1,67,804 కోట్లులో సుమారు 45 శాతాన్ని జీతాలు గా రూ.30,277 కోట్లు, వడ్డీ చెల్లింపులు రూ.27,803 కోట్లు, పెన్షన్లు రూ.16,942 కోట్లు వంటి నిర్ధారిత వ్యయాలపై వెచ్చించింది.

నేడు ఎప్‌సెట్ ఇంజినీరింగ్ హాల్‌టికెట్లు జారీ

హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే ఈఏపి(ఎ్) సెట్-2026కి సంబంధించి ఇప్పటి వరకు 3,01,203 దరఖాస్తులు వచ్చాయి. అపరాధ రుసుం రూ. 10వేలతో మే 2 వరకు అవకాశం ఉంది. ఈ నెల 23 నుంచి అగ్రికల్చర్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల హాల్ టికెట్స్‌ను జారీ చేయగా.. నేటి(సోమవారం) మధ్యాహ్నం 3 గంటల నుంచి ఇంజనీరింగ్ హాల్ టికెట్లను జారీ చేయనున్నారు. గురువారం సాయంత్రం వరకు 3 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటి వరకు 3,01,203 దరఖాస్తులు రాగా అందులో ఇంజనీరింగ్‌కి 2,10,318 దరఖాస్తులు రాగా, అగ్రికల్చర్, ఫార్మసీకి 90,569 దరఖాస్తులు వచ్చాయి. రెండింటికి కలిపి 317 దరఖాస్తులు వచ్చాయి. రూ. 5000 అపరాధ రుసుంతో ఈ నెల 24 వరకు స్వీకరించగా. అపరాధ రుసుం రూ. 10వేలతో మే 2 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. అగ్రికల్చర్ పరీక్షలను మే 4, 5 తేదిల్లో నిర్వహించనుండగా.. వారికి సంబంధించిన హాల్ టికెట్లను ఈ నెల 23న జారీ చేశారు. అగ్రికల్చర్ పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 106 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మే 9 నుంచి 11 వరకు జరిగే ఇంజనీరింగ్ పరీక్షల హాల్ టికెట్లను నేడు(సోమవారం) జారీ చేయనున్నారు. ఇంజనీరింగ్ పరీక్షల కోసం 115 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

కేంద్రం, ఎరువుల కంపెనీల వైఖరికి నిరసనగా

నేడు ఎరువుల షాప్‌లు బంద్

హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: రాష్ట్రంలో సోమవారం ఎరువుల షాపులు బంద్ కానున్నాయి. కేంద్ర ప్రభుత్వం, ఎరువుల ఉత్పత్తి సంస్థలు అనుసరిస్తున్న మొండి వైఖరిని నిరసిస్తూ రాష్ట్ర ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ బంద్‌కు పిలుపునిచ్చింది. డీలర్ల సమస్యలను పరిష్కరించడంలో కంపెనీలు నిరక్ష ్యం వహిస్తున్నందునే బంద్ పాటిస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వేలాది దుకాణాలను స్వచ్ఛందంగా మూసివేసి నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎరువుల సరఫరాలో కంపెనీలు అనుసరిస్తున్న లింక్ ప్రొడక్ట్ విధానంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు అవసరమైన యూరియా, డిఏపి వంటి ప్రధాన ఎరువులను సరఫరా చేసే సమయంలో వాటితో పాటు రైతులకు అవసరం లేని ఇతర ఖరీదైన ఉత్పత్తులను (లింక్ ప్రొడక్ట్స్) కూడా బలవంతంగా అంటగడుతున్నాయని ఆరోపించారు. దీనివల్ల డీలర్లపై ఆర్థిక భారం పడుతుందని, రైతులు కూడా అనవసరమైన మందులు కొనాల్సి వస్తుందని ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే లింక్ ప్రొడక్ట్ లేకుండా ఎరు వులు అందించాలని, ఎరువుల సరఫరాలో ఎఫ్‌పిఒ (ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్) విధానాన్ని పటిష్టంగా అమలు చేయాలని డీలర్లు డిమాండ్ చేస్తున్నారు.

రైతు ముంగిట్లోకి శాస్త్రవేత్తలు

నేటి నుండి మే 23 వరకు ప్రత్యేక కార్యక్రమం

శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, విద్యార్థులతో ప్రత్యేక బృందాలు

వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

సూచించిన వరి వంగడాలనే సాగు చేయాలని రైతులకు పిలుపు

హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: సోమవారం(ఈ నెల 27) నుండి మే 23 వరకు రాష్ట్ర వ్యాప్తంగా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయని తెలిపారు. విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు, విద్యార్థులు కలిపి 200 బృందాలుగా ఏర్పడి ప్రతీ వారం 400 గ్రామాల్లో రైతులతో నేరుగా సమావేశాలు నిర్వహిస్తారని చెప్పారు. యూరియా వినియోగం తగ్గింపు, సమతుల్య ఎరువుల వినియోగం, పంట మార్పిడి, మార్కెట్లో డిమాండ్ ఉన్న వరి రకాల సాగు, సాగునీటి ఆదా, సేంద్రీయ వ్యవసాయం వంటి అంశాలపై సుమారు 2.45 లక్షల మంది రైతులకు అవగాహన కల్పించ నున్నారని వివరించారు. రైతుల ఆదాయం పెంపు దిశగా మార్కెట్లో డిమాం డ్ ఉన్న వరి రకాల సాగుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, సివిల్ సప్లై అధికారులు, మిల్లర్లతో సమావేశాల అనంతరం రాష్ట్రానికి అనువైన, అధిక దిగుబడి ఇచ్చే ఎనిమిది సన్న రకాలను గుర్తించారని తెలిపారు. బిపిటి 5204, తెలంగాణ సోన (ఆర్ఎన్ఆర్ 15048), హెచ్ఎంటి 1638, జైశ్రీరాం, డబ్ల్యుజిఎల్ 962, డబ్ల్యుజిఎల్ 44, టిజిసి 1798 వరి రకాలను సాగు చేస్తే రైతులకు మార్కెట్లో మంచి ధర లభించే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ప్రభుత్వ సూచనలను పాటిస్తూ మేలైన వరి రకాలను సాగు చేయాలని రైతులను కోరారు. వానకాలానికి అనువైన ఈ రకాల విత్తనాలను జిల్లాల వారీగా ముందుగానే అందుబాటులో ఉంచాలని, అధికారులను మంత్రి ఆదేశించారు. అదేవిధంగా రైతులు పంట మార్పిడిని అవలంబించి పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు, ఆయిల్ పామ్ వంటి పంటలను సాగు చేయడం ద్వారా రాష్ట్ర అవసరాలను తీర్చడమే కాకుండా అధిక లాభాలు పొందవచ్చన్నారు. ఈ యేడాది రాష్ట్రం ఎల్ నినో ప్రభావానికి లోనయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. రైతులు అప్రమత్తంగా ఉండి వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలను అనుసరించి వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు చేపడితే ఎలాంటి నష్టాలు లేకుండా సాగు సాగుతుందని తెలిపారు.

మంత్రి సన్నిహితుడనని నమ్మించి రూ. 1.70 కోట్ల మోసం

హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఏప్రిల్ 26, ప్రభాతవార్త: మంత్రి సన్నిహితుడినని నమ్మించి ఓ సంస్థ డైరెక్టర్‌ను రూ. 1.70 కోట్ల మోసానికి పాల్పడిన సం ఘటన జూబ్లీహిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. జూబ్లీహిల్స్ పోలీ సుల కథనం ప్రకారం.. బంగారు యాదవ్ పురిమెట్ల అనే వ్యక్తి తాను మంత్రికి సన్నిహితుడినని, తనకు ప్రభుత్వ అధికారుల వద్ద మంచి పలుక బడి ఉందని గ్రీన్ మెట్రో ఇన్‌ఫ్రాటెక్ అండ్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ బోద్దు అశోక్‌ను నమ్మించాడు.

సంస్థకు సంబంధించిన ప్రభుత్వ అనుమతులు ఇప్పిస్తానని నమ్మించి అతని వద్ద నుంచి దశలవారీగా రూ. 1.70 కోట్లు తీసుకున్నాడు. దీనికితోడు ఒక ఖరీదైన ఐఫోన్, కంపెనీ వాహనం సైతం తీసుకొన్నాడు. ఏడాదిన్నర గడిచినా ఎన్ఓసీ ఇవ్వక పోవడంతో ప్రశ్నించడంతో బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో సుధాకర్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు బంగారు యాదవ్ పురిమెట్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూల్చివేతలన్నీ హైడ్రాకు ఆపాదించడం తగదు

సోషల్ మీడియా దుష్ప్రచారానికి ఖండన

హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: ఎక్కడ కూల్చివేతలు జరిగినా హైడ్రా చేసినట్టు చూపించి దుష్ప్రచారం చేయడాన్ని హైడ్రా ఖండించింది. ఈ విషయాన్ని సోషల్ మీడియా ప్రతినిధులు గుర్తించాలని హైడ్రా కోరింది. అవగాహన లేకుండా సోషల్ మీడియా ప్రసారం చేస్తున్న వార్తలు, వీడియోలను, కబ్జాలు, ఆక్రమణలకు పాల్పడుతున్నవారు హైడ్రాపై దుష్ప్రచారానికి వాడుతున్నారు. పద్ధతి ప్రకారం హైడ్రాపై దుష్ప్రచారం చేస్తున్నారు. నగరంలో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను హైడ్రా తొలగించడంలేదు. హైకోర్టు ఆదేశాల మేరకు నగరంలో ఫుట్ పాత్ ఆక్రమణల తొలగింపును మూడు మున్సిపల్ (జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీ) కార్పొరేషన్లు పెద్దయెత్తున చేపట్టాయి. ఈ క్రమంలోనే పాతబస్తీతో పాటు.. నగరంలో అనేక ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను ఆయా మున్సిపల్ కార్పొరేషన్లు తొలగిస్తున్నాయి. ఈ విషయాన్ని అందరూ గ్రహించాలని హైడ్రా సూచించింది. హైడ్రా భారీ ఆపరేషన్లు చేస్తుంది. బడాబాబులు, కబ్జాదారుల ఆటకట్టించి వారి ఆక్రమణలను హైడ్రా తొలగి స్తుంది. ఇలా వందలు, వేల ఎకరాల ప్రభుత్వ భూముల(ప్రజల ఆస్తిని)ను హైడ్రా కాపాడింది. చెరువులు, నాలాలు, రహదారులు, పార్కుల ఆక్రమణల తొలగింపును హైడ్రా చేపడుతుంది. రెవెన్యూ అధికారుల అభ్యర్థన మేరకు ప్రభుత్వ భూముల ఆక్రమణలను హైడ్రా తొలగిస్తుంది. నగరంలో గొలుసు కట్టు చెరువులను పునరుద్ధ రించే పనిలో హైడ్రా నిమగ్నమై ఉంది.

ఫిరాయింపు ఎంపిలపై వేటు

రాజ్యసభ ఛైర్మన్‌కు ఆప్ వినతిపత్రం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: పార్టీ ఫిరాయింపులకు పాల్పడి బీజేపీలో చేరిన ఏడుగురు రాజ్యసభ ఎంపీలను అనర్హులుగా ప్రకటించాలని రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌ను ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కోరింది. ఈ మేరకు సీపీ రాధాకృష్ణన్‌కు ఆప్ సీనియర్ నేత సంజయ్‌సింగ్ వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఎంపీల చర్యలు పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టంలోని నిబంధనలకు విరుద్ధమని అన్నారు. ఎంపీల ఫిరాయింపులు ప్రజా తీర్పునకు ద్రోహం చేయడమే కాకుండా రాజ్యాంగ విరుద్ధమని సంజయ్ సింగ్ తెలిపారు.

ముఖ్యంగా ఫిరాయింపులకు పాల్ప డిన వారిలో ఆరుగురు పంజాబ్ నుంచి ఆప్ టిక్కెట్టుపై ఎన్నికయ్యారని చెప్పారు. ఇప్పుడు పార్టీ ఫిరాయించి బీజేపీలో చేరడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆక్షేపణ తెలిపారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేందుకు వారి సభ్యత్వాన్ని రద్దు చేయాల్సిందిగా రాజ్యసభ ఛైర్మన్‌ను కోరినట్టు చెప్పారు. ఆమ్ ఆద్మీ పార్టీకి మూడురోజులక్రితం గట్టి దెబ్బ తగిలింది. పార్టీకి చెందిన ఏడుగురు రాజ్య సభ సభ్యులు బీజేపీలోకి ఫిరాయించారు. రాఘవ్ చద్దా, అశోక్ మిట్టల్, సందీప్ పాఠక్, హర్భజన్ సింగ్, రాజేంద్ర గుప్తా, విక్రమ్ సాహ్నీ, స్వాతి మలివాల్‌లు బీజేపీలో విలీనమైనట్టు ప్రకటించారు. కేజ్రీవాల్ పార్టీ ఏ సిద్ధాంతాలతో మొదలైందో ఆ సిద్ధాంతాలకు తిలోదకాలు ఇచ్చిందని వారు ఆరోపించారు.

తమ విలీనాన్ని సమర్ధించుకుంటా మూడింట రెండు వంతుల మంది మరో సంస్థలో విలీనమయ్యేందుకు రాజ్యాంగ నిబంధన అనుమతిస్తుందని రాఘవ్ చద్దా చెప్పారు. రాజ్యసభలో ఆమ్ ఆద్మీ పార్టీకి 10 మంది సభ్యులుండగా అవసరమైన దానికంటే ఎక్కువ మంది సభ్యు లు తమ గ్రూప్‌లో ఉన్నట్టు తెలిపారు. అయితే ఈ వాదనను సంజయ్ సింగ్ తోసిపుచ్చారు. సీనియర్ అడ్వకేట్ కపిల్ సిబల్, లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్ సహా పలువురు రాజ్యాంగ నిపుణులను తాము సంప్రదిం చామని, చట్టప్రకారం ఆప్ నుంచి ఫిరాయించిన ఎంపీలు అనర్హతకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు.

నోవా గ్రూపు ఛైర్‌పర్సన్‌పై కేసు నమోదు

హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఏప్రిల్ 26, ప్రభాతవార్త: నోవా గ్రూపు ఛైర్ పర్సన్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్‌టీఐ కమిషనర్‌పై జూబ్లీహిల్స్ ఠాణాలో కేసు నమోదైంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. రాజేంద్ర నగర్‌లో నివసించే నోవా గ్రూపు ఛైర్‌పర్సన్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్‌టిఐ కమిషనర్ విజయ నిర్మల తన కుమార్తెకు పెండ్యాల కుటుంబంతో వివాహం కుదుర్చుకున్నారు. ఈ వ్యవహారంలో పెండ్యాల కుటుంబం ముందుగా కట్నం వద్దని చెప్పి, తర్వాత రూ.1 కోటి నగదు, బిఎండబ్ల్యు కారు, ఖరీదైన గిఫ్టులు, ఘనంగా వివాహ ఏర్పాట్లు కోరినట్లు ఆరోపిం చారు. వరుడి జీతం, భవిష్యత్ అవకాశాలపై తప్పుడు సమాచారం ఇచ్చి నమ్మబలికినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో నిశ్చితార్థం, వివాహ ఏర్పాట్లపై భారీ ఖర్చు చేసిన తర్వాత, ఏప్రిల్ 5న ఒక్కసారిగా వివాహాన్ని రద్దు చేసి డబ్బులు, బహుమతులు తిరిగి ఇవ్వలేదని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనతో తన కుమార్తె తీవ్ర మానసిక ఆందోళనకు గురైందని విజయనిర్మల తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పెళ్లి కుమార్తె అక్షయ పెండ్యాలతోపాటు ఆమె తల్లి ఉష పెండ్యాల, తండ్రి సుధాకర్ పెండ్యాల, సోదరి క్రితి పెండ్యాలపై వరకట్న వేధింపుల కింద కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా ఇంటి వద్ద దాడి, ఆస్తి ధ్వంసం ఆరోపణలతో ఇదే వివాదానికి సంబంధించి జూబ్లీహిల్స్‌లో నివసించే అక్షయ తండ్రి సుధాకర్ ప్రతిగా జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఏప్రిల్ 24న విజయ నిర్మల తన కుమారుడు సహా సుమారు 70 మంది వ్యక్తులతో కలిసి తమ ఇంటికి వచ్చి గేటు పగులగొట్టి లోపలికి ప్రవేశించి వాచ్‌మన్‌పై దాడి చేసి, ఇంటి సామగ్రి, సీసీ కెమెరాలను ధ్వంసం చేశారని ఆరోపించారు. కుటుంబ సభ్యులను హత్య చేస్తామని బెదిరించారని, ఆయుధాలతో భయాందోళన సృష్టించారని పేర్కొన్నారు. సుధాకర్ ఫిర్యాదు మేరకు విజయనిర్మల, సుమేధ్ తదితరులపై జూబ్లీహిల్స్ పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్ 324(4), 329(4) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డిజిటల్ మార్కెటింగ్ పేరిట మోసం.. కంపెనీ మేనేజర్ అరెస్ట్

నకిలీ మార్కెటింగ్, మనీ సర్క్యులేషన్ స్కీమ్‌లపై చాలా జాగ్రత్తగా ఉండాలి : డిసిపి కిరణ్‌ఖారే

హైదరాబాద్ (చార్మినార్), ఏప్రిల్ 26 ప్రభాతవార్త : డిజిటల్ మార్కెటింగ్ పేరుతో పాతబస్తీ మీర్‌చౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలోమల్టీ లెవెల్ మార్కెటింగ్ (ఎంఎల్ఎం),మనీ సర్క్యులేషన్ పేరుతో భారీ మోసానికి పాల్పడిన ఫరెవర్ లివింగ్ ఇంపోర్ట్స్ కంపెనీ కంట్రీ సేల్స్ మేనేజర్ హర్యానా రాష్ట్రం గురుగ్రామ్‌కు చెందిన హరీష్ కుమార్ సింగ్లా (61)ను మీర్‌చౌక్ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు.ఈ కేసుకు సంబంధించిన వివరాలను చార్మినార్ జోన్ డిసిపి కిరణ్ ఖారే ఆదివారం మీర్‌చౌక్ ఏసిపి శ్యామ్‌సుందర్, ఇన్‌స్పెక్టర్ కొండలరావుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు.హర్యానాకు చెందిన హరీష్‌కుమార్ సింగ్లా డిజిటల్ మార్కెటింగ్, ఫరెవర్ లివింగ్ ప్రొడక్టు పేరుతో అమాయక ప్రజలను మహి ళలను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నాడు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ శిక్షణ తరగతుల పేరుతో 199 రూపాయల నుంచి 249 రూపాయలు వరకు రిజిస్ట్రేషన్ ఫీజులు వసూళ్లు చేశాడు. స్లో ట్రాక్, మీడియం ట్రాక్ వంటి కాంబో ప్యాకేజీల పేరుతో భారీ మొత్తం డబ్బులు వసూలుచేయటం జరి గింది. ఉత్పత్తులు అమ్మకం కంటే కొత్త సభ్యు లను చేర్పించటం ద్వారానే డబ్బు వస్తుందని నమ్మించి మనీ సర్క్యులేషన్ స్కీమ్ నడపటం జరిగింది. ఇప్పటికే మీర్‌చౌక్ పోలీసులు ఈ కేసులో పాతబస్తీకి చెందిన ఏజెంట్లు మహ్మద్ అక్రమ్, మొహమ్మద్ నౌమాన్ రజా, మొహమ్మద్ అస్లాంలను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి మెర్సిడెస్ బెంజ్ కారు, ఒక మ్యాక్ బుక్, ఒక ఐప్యాడ్, మూడు స్మార్ట్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల ఖాతాలో ఉన్న దాదాపు మూడు కోట్ల రూపా యలను ఫ్రీజ్ చేశారు. కంపెనీ మేనేజర్ హరీష్ కుమార్ సింగ్లాను ఆదివారం పోలీసులు అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భం గా చార్మినార్ జోన్ డిసిపి కిరణ్ ఖారే మాట్లా డుతూ తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించ వచ్చనే మల్టీలెవెల్ మార్కెటింగ్, మనీ సర్క్యులేషన్ వంటి స్కీమ్‌ల పట్ల ప్రజలు చాలా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. మోస పూరిత ప్రకటలను నమ్మి డబ్బులు పోగొట్టు కోవద్దని, ఎవరైనా మిమ్మల్ని ఇటు వంటి స్కీమ్ లలో చేరమని ఒత్తిడి చేస్తే వెంటనే సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఆయన తెలియజేశారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న చార్మినార్ జోన్ డిసిపి కిరణ్ ఖారే

కెసిఆర్ లేకపోతే బిఆర్ఎస్ లేదు

బిఆర్ఎస్ లేకపోతే తెలంగాణ వచ్చేది కాదు: మాజీమంత్రి హరీశ్‌రావు

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 26: రాష్ట్ర ప్రజలకు హరీశ్‌రావు బీఆర్ఎస్ రజతోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ఏర్పడి 25 వసంతాలు పూర్తి చేసుకుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావంతోనే తెలంగాణ కల సాకారమైందని అన్నారు. కేసీఆర్ లేకపోతే బీఆర్ఎస్ లేదు.. బీఆర్ఎస్ లేకపోతే తెలంగాణ వచ్చేది కాదని అభిప్రాయ పడ్డారు. నాలుగు కోట్ల మంది ప్రజలకు ఏకతాటి మీదకు తెచ్చిన మహా నాయకుడు కేసీఆర్ అని హరీశ్‌రావు కొనియాడారు. బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటుతో దశాబ్దాల తెలంగాణ కల సాకారమైందని అన్నారు. ఇవాళ రాష్ట్ర ప్రజలు ఆత్మగౌరవంతో సంతోషంగా బతుకుతున్నారని తెలిపారు. బీఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర ప్రజల్లో గొప్ప ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించిందని పేర్కొన్నారు. రాష్ట్రం 33 జిల్లాలుగా ఏర్పడిందన్నా.. సిద్దిపేట జిల్లాగా మారిందన్నా కేసీఆర్ కృషే కారణమని స్పష్టం చేశారు. బీడువారిన భూములను సస్యశ్యామలంగా మార్చిన ఘనత కాళేశ్వరం ప్రాజెక్టుదే అని హరీశ్‌రావు అన్నారు.

వార్త

అందరిలోనూ శక్తిసామర్థ్యాలు ఎంతో కొంత ఉంటాయి. వాటిని వినియోగించుకోవడంలోనే అసలు సమస్య ఉంటుంది.

- రామకృష్ణ పరమహంస

ఆగని తుపాకి 'కల్చర్'

తన వాచాలతతో ఇంటా బయటా శత్రువులను పెంచుకున్న ట్రంప్‌కు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. మరోసారి ఆయనపై హత్యాయత్నం జరిగింది. అమెరికా రాజధాని వాషింగ్టన్ హిల్టన్‌హోటల్లో జరిగిన వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ డిన్నర్ కార్యక్రమంలో జరిగిన కాల్పుల ఘటన యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. శనివారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమానికి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రథమ మహిళ మెలానియా ట్రంప్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఇతర కీలక ఉన్నతాధికారులు హాజరయ్యారు. డొనాల్డ్ ట్రంప్ వేదికపై ప్రసంగించడానికి సిద్ధమవుతున్న తరుణంలో హోటల్ వెలుపల భద్రతా చెక్‌పాయింట్ వద్ద ఒక్కసారిగా తుపాకీ శబ్దాలు వినిపించాయి. దీంతో అప్రమత్తమైన సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు మెరుపు వేగంతో స్పందించి ట్రంప్ దంపతులను సురక్షిత ప్రాంతానికి తరలించారు. అమెరికా అధ్యక్ష పదవి అంటేనే అదొక ప్రమాదకరమైన వృత్తి అనే విషయం ముందే తెలిసి రెండోసారి ఎన్నికల బరిలోకి దిగిన ఆయనకు ఇదేమీ పూలబాట కాదని ముందే తెలుసు. అందుకే ఈ హఠాత్సంఘటనకు ఆయన అదరలేదు.బెదరలేదు. కాసేపటిలో తేరుకున్న ఆయన ఇరాన్‌పై యుద్ధంలో విజయం సాధించకుండా తనను ఇలాంటి సంఘటనలు ఏమాత్రం ఆపజాలవని ట్రంప్ స్పష్టం చేశారు. ఆయనపై దాడి ఇదే మొదటిసారి కాదు. మూడోసారి. రెండోసారి అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో ఇలాంటి సంఘటనే ఒకటి జరిగింది. 2024 జూలై 13న పెన్సిల్వేనియా ప్రచార ర్యాలీలో ట్రంప్‌పై హత్యాయత్నం జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో దుండగుడు జరిపిన కాల్పుల్లో ట్రంప్ చెవికి స్వల్ప గాయమైంది. అయినా ఆయన విజేతగా బయటకొచ్చాక ఆ విషయాలన్నీ మర్చిపోయారు. తాజా కాల్పుల ఘటనపై ట్రంప్ శ్వేతసౌధంలో మాట్లాడారు. దుండగుడు అనేక ఆయుధాలతో సెక్యూరిటీ చెక్‌పాయింట్ పైకి దూసుకొచ్చినట్లు తెలిపారు. ఈ కాల్పులు ఘటన వైట్‌హౌస్ బాల్ రూమ్ ఆవశ్యకతను తెలియజేస్తోందన్నారు. తనకు అసాధారణ భద్రత కావాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పుడు పశ్చిమాసియా యుద్ధంలో ట్రంప్ ఎంతో దూకుడుగా వ్యవహరిస్తున్నారు. ఏదైనా సమస్య వస్తే ఇరాన్ వైపు నుంచే వస్తుందని ఎంతో జాగ్రత్తగా ఉన్న ట్రంప్ అంతర్గతంగా కూడా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందని తాజా సంఘటన నిరూపిస్తోంది. అంతర్గతంగానే అమెరికన్‌ల నుంచే తనపై దాడి జరగడం అందరినీ విస్మయం గొలిపింది. ఇప్పటికే అమెరికా చరిత్రలో నలుగురు అమెరికా అధ్యక్షులు ఇలాంటి దాడుల్లోనే ప్రాణాలు కోల్పోయారు. శనివారం ట్రంప్‌పై దాడి జరిగిన హిల్టన్ హోటల్‌కు ఒక చారిత్రక ప్రాధాన్యత కూడా ఉంది. 1981 మార్చిలో అప్పటి అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్‌పై ఇదే హోటల్ బయట హత్యాయత్నం జరిగింది. ఈ దాడిలో ఆయన ఊపిరితిత్తులకు తీవ్ర గాయమైంది. మళ్ళీ అదే హోటల్ లో తాజా సంఘటన జరగటం కాకతాళీయమే. ఇలాంటి సంఘటనలకు 'తాను భయపడను గాక భయ పడను'. తన వార్ పాలసీలో తాను ఎన్నటికీ వెనక దుగు వేసేది లేదని ఆయన ఘంటాపదంగా చెబుతు న్నారు. తనపై దాడి చేసిన దుండగుడు డెమొక్రటిక్ పార్టీ అభిమాని అని కూడా చెప్ప చూసారు. ఇలాంటి దుశ్చర్యలను ఎవరైనా ఖండించాల్సిందే. ఈ ఘటనను ఖండిస్తూ, 'ప్రజాస్వామ్యంలో హింసకు స్థానం లేదని'భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. అధ్యక్షుడు ట్రంప్, ఆయన కుటుంబ సభ్యులు క్షేమంగా ఉన్నారన్న వార్త తనకు ఉపశమనం కలిగించిందని ప్రధాని పేర్కొన్నారు. ఈ ఘటనపై ప్రధాని మోదీ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించారు. సీక్రెట్ సర్వీస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం నిందితుడు బుల్లెట్‌ప్రూఫ్ వెస్ట్ ధరించి, అత్యాధునిక ఆయుధాలతో భద్రతా వలయాన్ని ఛేదించి లోపలికి ప్రవేశించేందుకు ప్రయత్నించాడు. భద్రతా సిబ్బంది అతడిని అడ్డుకునే ప్రయత్నం చేయగా, నిందితుడు కాల్పులకు తెగబడ్డాడు. ఈ క్రమంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక సీక్రెట్ సర్వీస్ అధికారికి ఛాతీపై బుల్లెట్ తగిలింది. అయితే అతను బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్ ధరించడంతో ప్రాణాపాయం నుంచి బయట పడ్డాడని అధికారులు తెలిపారు. దాడికి పాల్పడిన వ్యక్తిని కాలిఫోర్నియాలోని టోరెన్స్‌కు చెందిన కోల్ థామస్ అలెన్ (31)గా గుర్తించారు. ఇవన్నీ చూసాక అమెరికా అధ్యక్ష పదవిని చేపట్టడం కత్తిమీద సాములాంటిదని అర్థమవుతుంది. రాజకీయంగా తీవ్ర విభేదాలున్న దేశం కనుకనే ఎందరో అధ్యక్షులు ఇలాంటి దాడులను ఎదుర్కొన్నారు. వీరిలో నలుగురు ప్రాణాలు కూడా కోల్పోయారు. చరిత్రలో తొలిసారి హత్యకు గురైన అధ్యక్షుడు అబ్రహం లింకన్. బానిసత్వ నిర్మూలన కోసం అంతర్యుద్ధ పరిస్థితుల్లోనూ దేశాన్ని నడిపించారు. ఆయన, 1865 ఏప్రిల్ 18న వాషింగ్టన్లోని ఒక థియేటర్లో కాల్పులకు బలయ్యారు. ఆయన తర్వాత జేమ్స్ గారిఫీల్డ్ (1881), విలియం మెకిన్లీ (1901) కూడా హత్యకు గురయ్యారు. అధ్యక్ష పదవిలో ఉండి హత్యకు గురైన వారిలో జాన్ ఎఫ్. కెన్నడీ ఉదంతం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. 1963 నవంబర్ 22న డల్లాస్‌లో కారులో వెళ్తున్నప్పుడు బహిరంగంగా కాల్పులు జరిపి ఆయన్ను హత్య చేశాడు. మరో ఐదేళ్లకే కెన్నడీ సోదరుడు రాబర్ట్ కెన్నడీ కూడా అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ఉండగానే హత్యకు గురయ్యారు. అమెరికా చరిత్రను బట్టి చూస్తే అసలే దుందుడుకు స్వభావిగా పేరు పడిన ట్రంప్ మహాశయుడు చాలా అప్రమత్తంగా మెలగాల్సి ఉంది. ప్రమాదం నిరంతరం వెన్నాడుతూనే ఉంటుందని వేరే చెప్పనక్కర్లేదు.

విధి అంటూ ఎవరూ సృష్టించలేదు. మనకు మనమే సృష్టించుకున్నాం. మన మాట, ఆలోచన, ప్రవర్తన వల్ల మన జీవితానికి మనమే బాధ్యులం.

డబ్ల్యు ఎమర్సన్

శత్రువుని జయించినవాడు విజేతకాదు. శత్రుత్వాన్ని జయించినవాడే నిజమైన విజేత.

స్వామి వివేకానంద

ప్రజావాక్కు



క్వాంటం వ్యాలీ ఒక మైలురాయి

ఆంధ్రప్రదేశ్ రాజధానిఅమరావతిలో నిర్మిస్తున్న క్వాంటం వ్యాలీ ప్రాజెక్ట్ భారతదేశ సాంకేతిక చరిత్రలో ఒక మైలురాయి. తుళ్లూరు మండలంలో ఏర్పాటు చేస్తున్న ఈ సెంటర్,దేశంలోనే తొలి133క్యూబిట్ క్వాంటం కంప్యూటర్ (సిస్టమ్2) కు నిలయం కానుంది. ఐబీఎం, టీసీఎస్ వంటి దిగ్గజసంస్థలభాగస్వామ్యంతో రూపుదిద్దుకుంటున్న ఈ టెక్ పార్క్, పరిశోధకులు స్టార్టప్‌లకు అత్యాధునిక వనరులనుఅందుబాటులోకి తెస్తుంది. క్వాంటం కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో శిక్షణ ద్వారా దాదాపు లక్షఉద్యోగాల కల్పన ఈప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యం. క్వాంటం టెక్నాలజీ వల్ల ఫార్మా, మెటీరియల్ సైన్స్, క్లైమేట్ మాడలింగ్ వంటిరంగాల్లో పరిశోధనలు వేగవం తం అవుతాయి. ముఖ్యంగా 'క్వాంటం క్రిప్టోగ్రఫీ ద్వారా బ్యాంకింగ్, ప్రభుత్వ లావాదేవీలకు పటిష్టమైన సైబర్ సెక్యూరిటీ లభిస్తుంది. అమెరికా, చైనా వంటి దేశాలతో పోటీపడుతూ అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్ర ఉనికిని చాటడానికి ఇది గొప్ప అవకాశం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

నీటి నిల్వలను పెంచాలి

తెలంగాణలో కుంటలు చెరువులు ఎక్కువగా ఉంటాయి. అవి చారిత్రక వారసత్వంగా కాకతీయుల నుండి మనకు వచ్చాయి.వాటినిఆసఫ్‌జాహీలు,కూతుబ్‌షాహీలు కొనసాగించారు విస్తరించారు.అయితేతెలంగాణ వ్యవసాయం వర్షాధారితం. బోర్లు, చెరువులు కుంటల మీద ఆధారపడిఉంది.అయితే తెలంగాణలో వ్యవసాయం విధ్వంసం జరిగిన తరవాత ఇప్పుడు తెలంగాణలో పెరిగిన నీటి వసతి ఆధారంగా తెలంగాణలో ప్రతిగ్రామంలో కుంటలు ఉంటాయి. కాబట్టి వాటిని ఉపాధి హామీలో డిసెలటింగ్ చేస్తే ఆ సారవంతం అయినా మట్టి రైతుల పొలాలలో పోసుకోవడానికి ఉపయోగపడుతుంది.

- భారత అవినాష్, జనగామ

ఉద్యోగాల కోత

ఇప్పటి వరకు ఇంజనీరింగ్ విద్య చదివిన వారందరూ అధిక జీతాలకు ఆశపడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎగబడి దేశ విదేశాలలో ఉద్యోగాలు సంపాదించుకున్నారు. ఇంకా ఎంతో మంది ఎదురు చూస్తున్నారు.వీరందరికి ఉద్యోగాలు దొరకక ప్రయివేటు సంస్థలలోను చిన్నదో పెద్దదో ఎంతో కొంత జీతానికి పని చేస్తున్నారు.

- ఎం. నాగరాజు, కరీంనగర్‌జిల్లా

వేడిమి వైపరీత్యం

ఎల్‌నినో పుణ్యాన ఈ సంవత్సరం ఎండలు తీవ్రంగా ఉన్నాయి. రెండునెలలపాటు మండేలాఉన్నాయి.జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థఈవిషయమై హెచ్చరించింది. ఎప్పటికప్పుడు ప్రజల్ని అప్రమత్తం చేస్తూసూచనలు వస్తున్నాయి. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో గతంలో కన్నా వడదెబ్బల మరణాలు తక్కువగా నమోదవుతున్నాయి కానీ అనారోగ్య సమస్య మాత్రం తీవ్రంగానే ఉంది. ఉదయం నుండే ఎండ తీవ్రత పెరిగి ఏ రోజూ 40డిగ్రీల సెంటిగ్రేడ్ కన్నా తక్కువ ఉండడం లేదు సరికదా మునుపటి కన్నా ఎక్కువప్రాంతాలు ఈ దారిన పడ్డాయి. ఈపరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానికసంస్థలు కొన్ని అదనపు చర్యలు తీసుకోవాల్సి ఉంది.అందులో ముఖ్యంగా ఈ రెండునెలలపాటు పెన్షన్లు,ప్రజాపంపిణీ ద్వారా అందించే నిత్యావసర సరుకులు లబ్ధిదారుల ఇంటికే పంపించే ఏర్పాట్లు చెయ్యాలి.ఎక్కువ వడదెబ్బకు గురయ్యేది పేదలు,చిన్నచిన్న తోపుడు బళ్ళు, డెలివరీ బాయ్స్, కార్మికులు,ఈ తరహా వీధి వర్తకులు,ఉపాధి హామీ వినియోగించుకునే వాళ్లు,వ్యవసాయ కార్మికులు. సమగ్రమైన ప్రణాళిక, సమన్వయంతో కూడిన పనితీరుతోనే ఈ విపత్తును దాటగలం.

- డా. డి.వి.జి.శంకర రావు, విజయనగరం

అక్రమ కట్టడాలను తొలగించాలి

విశాఖపట్నం జిల్లా భీమునిపట్నం పరిధిలో అనుమతులు లేకుండా ఏపీటూరిజం శాఖ నిర్మించిన కాంక్రీట్ నిర్మాణాలను తొలగించాలని ఏపీహైకోర్టు నిన్నఆదేశించటం అభినందనీయం. అయితే రాష్ట్రంలో దొంగస్వాములు ప్రభుత్వ భూములను అక్రమించి ఆశ్రమాల పేరుతో మోసంచేస్తున్నారు.హైకోర్టు వారు ఈ ఆక్రమణలను కూడా సుమోటోగా స్వీకరించి కూల్చివేసేందుకు ఆదేశాలుఇవ్వాలి.దాదాపు 25 సంవత్సరాలుగా ఈ తంతు జరుగుతుంది.పేదవాడు ప్రభుత్వ భూమీలో గుడిసె వేసుకుంటే ఎందుకు కూల్చివేస్తారు? వాళ్ళకు కూడా ఏదోక రేటుకు అమ్మేస్తే సరిపోతుంది. గదా!

- వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

రోడ్డు రవాణా సంస్థ పనితీరు

గతంలో ఉన్న ప్రభుత్వం ఓట్ బ్యాంకు రాజకీయం కోసం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసింది.వారికి ఓట్లు పడలేదు. వారి కంటే ఒక అడుగు ముందుకు వేసి వారి కంటే ఎక్కువే ప్రజాధనాన్ని ఉచిత పథకాలకు నేటి ప్రభుత్వం అందిస్తూ ఉన్నది.ఏపీఎస్ఆర్టీసీల్లోమహిళలకు ఉచితప్రయాణంతోపాటు, దివ్యాంగులు కూడా ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించినది.

-వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

నారీ శక్తి ముసుగులో డీలిమిటేషన్ కుట్ర!

కాంగ్రెస్ నుంచి ద్రవిడ, తెలుగు పార్టీల వరకు అందరూ ఒకే మాట 'మహిళా రిజర్వేషన్ కావాలి, కానీ దక్షిణ రాష్ట్రాలను బలిపీఠం చేసే డీలిమిటేషన్ కాదు.' ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి రాష్ట్రాలు జనాభా నియంత్రణలో జాతీయ నమూనాగా నిలిచాయి. వాటి సీట్లు తగ్గితే సమాఖ్య సమతుల్యం దెబ్బతింటుంది. ఇది కేవలం రాజకీయ లాభం కోసం రాష్ట్రాల మధ్య వైరం రెచ్చగొట్టడం. కేంద్రం ఇప్పుడు 'ప్రతిపక్షాలు మహిళల వ్యతి రేకులు' అని దేశవ్యాప్తంగా ప్రచారం చేస్తోంది. కానీ నిజం ఏమిటి? ప్రభుత్వం సొంత వ్యూహంవల్లే బిల్లు వీగిపోయింది. మహిళా సాధికారతను నిజంగా కావాలంటే 2023 బిల్లును వేరుగా అమలు చేసి, డీలిమిటేషన్‌ను సమగ్ర చర్చతో ముందుకు తీసుకెళ్లాలి. ఈ ఓటమి కేంద్రానికి మాత్రమే కాదు. దేశ రాజకీయ వ్యవస్థకు పాఠం. సమాఖ్య ధర్మం ఇంకా బలంగా ఉంది. దక్షిణ రాష్ట్రాలు తమ హక్కులను కాపాడుకున్నాయి. మహిళల సాధికారత నిజమైన మార్గంలో ముందుకు సాగాలంటే ప్రభుత్వం ఇకపై ముసుగులు వేయకుండా, నిజాయితీతో చర్చించాలి.

కాలగిరి శ్రీనివాస్ రెడ్డి

భారత రాజకీయ వేదికపై ఒక కీలక మలుపు తిరిగిన క్షణం ఇది. మహిళా సాధికారత అనే పవిత్రమైన లక్ష్యాన్ని ముందుంచుకుని వచ్చిన ఒక చట్టం.కానీ దాని వెనుక దాగి ఉన్న రాజకీయ వ్యూహాలు, ప్రాంతీయసమతుల్యంపై పడే ప్రభావం దేశవ్యాప్తంగా చర్చకు దారితీ శాయి. 'నారీ శక్తి అనే ఆకర్షణీయ నినాదం కింద డీలిమిటేషన్ వంటి సున్నితమైన అంశాన్ని కలిపి ప్రవేశ పెట్టినప్పుడు, అది కేవలం ఒక శాసన ప్రక్రియగా మిగల లేదు.సమాఖ్య వ్యవస్థ, రాష్ట్రాల హక్కులు,రాజకీయ నైతికత అన్నీ ఒకే వేదికపై పరీక్షించబడిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో లోక్‌సభలో జరిగిన ఓటింగ్ కేవలం సంఖ్యల పోటీకాదు. అది కేంద్రరాష్ట్ర సంబంధాల భవిష్యత్తును నిర్ణయించే ఘట్టంగా మారింది. ఒకవైపు మహిళా రిజర్వేషన్‌కు మద్దతు అనే నైతిక బాధ్యత, మరోవైపు రాష్ట్రాల న్యాయమైన వాటాను కాపాడాల్సిన అవసరం, ఈ రెండింటి మధ్య జరిగిన ఈ పోరు భారత రాజకీయాల్లో అరుదైన ఉదాహరణగా నిలిచింది. ఇదే సంఘటన 'నారీ శక్తి ముసుగులో రాజకీయ ప్రయోజనాలా? లేక సమాఖ్య ధర్మానికి రక్షణగా నిలిచిన ప్రజాస్వామ్యమా? అనే ప్రశ్నను దేశం ముందుంచింది. ఈ నేపథ్యంతో లోక్‌సభలో జరిగిన పరిణామాలు ఎలా మలుపుతిప్పాయో చూద్దాం. లోక్‌సభలో ఏప్రిల్ 17, 2026న జరిగిన ఓటింగ్‌లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు వీగిపోవడం ఒక సాధారణ శాసన వైఫల్యం కాదు. అది కేంద్ర ప్రభుత్వ వ్యూహాత్మక రాజకీయాలకు స్పష్టమైన చెంపపెట్టు. మహిళా రిజర్వేషన్‌ను 'నారీ శక్తి పేరుతో రాజకీయ ఆయుధంగా మలచి, దానిని డీలిమి టేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) తో కలిపి ఒకే ప్యాకేజీగా తీసుకురావడం ద్వారా దక్షిణాది రాష్ట్రాల సమాఖ్య హక్కులను కుదించాలని చేసిన ప్రయత్నం పూర్తిగా విఫలమైంది. 298 ఓట్ల మద్దతు,230 వ్యతిరేక ఓట్లతో రెండింతల మెజారిటీ (352) సాధించలేకపోవడంతో బిల్లు కూలిపోయింది. దీంతో అనుబంధ డీలిమిటేషన్ బిల్లు, కేంద్రపాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులను ప్రభుత్వం స్వయంగా ఉపసంహరించుకోవాల్సి వచ్చింది. ఇది కేవలం ఓటు లెక్క కాదు.భారత రాజకీయ వ్యవస్థలో సమాఖ్య స్ఫూర్తి ఇంకా బలంగా ఉందని నిరూపించిన చారిత్రక క్షణం. 2023లో నారీ శక్తి వందన అధినియమం (106వ సవరణ) ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. మహిళలకు లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీల్లో 33 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని నిర్ణయం. కానీ అమలు? 2026 తర్వాత మొదటి జనాభా లెక్కలు (సెన్సస్) అనంతరం

డీలిమిటేషన్ పూర్తయ్యే వరకు వాయిదా. అంటే 2034 వరకు ఆశించాల్సిన పరిస్థితి. ఇప్పుడు 2026లో ప్రభుత్వం హడావుడిగా స్పెషల్ సెషన్ పిలిచి మూడు బిల్లులు తెచ్చింది. 131వ సవరణ ద్వారా 2011 జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్ చేసి 2029 ఎన్నికల నుంచే మహిళా కోటా అమలు చేయాలని, లోక్‌సభ సీట్లు 543 నుంచి 850కి పెంచాలని, యూటీల్లో కూడా అమలు చేయాలని నిర్ణయించింది.ఉద్దేశ్యం ఒకటే మహిళా సాధికారతను ముసుగుగా ఉపయోగించి డీలిమిటేషన్‌ను త్వరగా ముగించడం. ఇది ఉత్తరాది రాష్ట్రాలకు (జనాభా ఎక్కువగా ఉన్నవి)మరిన్ని సీట్లు ఇచ్చి, దక్షిణాది రాష్ట్రాలు (జనాభా నియంత్రణలో సాధించిన విజయం కారణంగా) సీట్లు తగ్గించే వ్యూహం. దీనిని ప్రతిపక్షాలు (ఇండియా కూటమి) స్పష్టంగా చెప్పాయి. మహిళలకు రిజర్వేషన్ మద్దతు ఉంది, కానీ డీలిమిటేషన్ ద్వారా దక్షిణ రాష్ట్రాలను శిక్షించే ప్రయత్నం సహించేది కాదు. ఇక్కడే కేంద్ర వ్యూహం బయటపడింది. 2023లో బిల్లును వాయిదా వేసినప్పుడు ప్రభుత్వం సెన్సస్, డీలిమిటేషన్ తర్వాతే' అని చెప్పింది. ఇప్పుడు హడావుడిగా 2011 డేటాను ఉపయోగించి త్వరగా అమలు చేయాలనడం ఎందుకు? ఎందుకంటే 2026 సెన్సస్ పూర్తి కావాల్సి ఉంది. దాని ఆధారంగా డీలిమిటేషన్ జరిగితే దక్షిణ రాష్ట్రాల సమాఖ్య హక్కులు కాపాడబడతాయి. కేంద్రానికి అది అనుకూలం కాదు. ఉత్తర రాష్ట్రాల్లో తన బలం ఎక్కువగా ఉండటం వల్ల సీట్లు పెరిగితే ఎన్నికల లాభం. మహిళా రిజర్వేషన్‌ను ఇలా'ట్రోజన్ హార్స్'గా ఉపయోగించడం రాజకీయ నైతికతకు ముఖ్యమైన ప్రశ్న. మహిళల సాధికారత నిజమైనదైతే డీలిమిటేషన్‌ను వేరుగా చర్చించి, సమాఖ్య సంప్రదింపులతో ముందుకెళ్లాలి. కానీ ప్రభుత్వం ఒకే ప్యాకేజీలో కట్టి, 'మహిళల వ్యతిరేకులు'అని లేబుల్ వేసి వ్యతిరేకతను అణచివేయాలని చూసింది. ఇది కేంద్ర ప్రభుత్వ రాజకీయ శైలి -జనాభా, మతం, ప్రాంతాలు వంటి వాటిని ఉపయోగించి అధికారాన్ని కాపాడుకోవడం.ప్రతిపక్షాలఐక్యత ఈ ఆటను ఆపేసింది. కాంగ్రెస్ నుంచి ద్రవిడ, తెలుగు పార్టీల వరకు అందరూ ఒకే మాట 'మహిళా రిజర్వేషన్ కావాలి, కానీ దక్షిణ రాష్ట్రాలను బలిపీఠం చేసే డీలిమిటేషన్ కాదు.' ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి రాష్ట్రాలు జనాభా నియంత్రణలో జాతీయ నమూనాగా నిలిచాయి. వాటి సీట్లు తగ్గితే సమాఖ్య సమతుల్యం దెబ్బతింటుంది. ఇది కేవలం రాజకీయ లాభం కోసం రాష్ట్రాల మధ్య వైరం రెచ్చగొట్టడం. కేంద్రం ఇప్పుడు 'ప్రతిపక్షాలు మహిళల వ్యతిరేకులు' అని దేశవ్యాప్తంగా ప్రచారం చేస్తోంది. కానీ నిజం ఏమిటి?ప్రభుత్వం సొంత వ్యూహంవల్లే బిల్లు వీగిపోయింది. మహిళా సాధికారతను నిజంగా కావా లంటే 2023 బిల్లును వేరుగా అమలు చేసి, డీలిమిటేషన్ ను సమగ్ర చర్చతో ముందుకు తీసుకెళ్లాలి. ఈ ఓటమి కేంద్రానికి మాత్రమే కాదు. దేశ రాజకీయ వ్యవస్థకు పాఠం. సమాఖ్య ధర్మం ఇంకా బలంగా ఉంది. దక్షిణ రాష్ట్రాలు తమ హక్కులను కాపాడుకున్నాయి. మహిళల సాధికారత నిజమైన మార్గంలో ముందుకు సాగాలంటే ప్రభుత్వం ఇకపై ముసుగులు వేయకుండా, నిజాయితీతో చర్చించాలి. లేకపోతే ఇలాంటి చెంపపెట్టులు మరిన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. భారత దేశం ఒక దేశం కాదు - ఒక సమాఖ్య. దానిని గుర్తించకపోతే ఏ వ్యూహామూ ఫలించదు. •

గంటలో తిరుమలేశుని దర్శనం సాధ్యమేనా?

అప్పన్న గొనప

తిరుమలలో భక్తులకు దర్శనం అనేది కేవలం ఒక సేవ మాత్రమే కాదు, అది విశ్వాసం, ఆధ్యాత్మిక అనుభూతి, సామూహిక భావోద్వేగాల సమ్మేళనం.ఈ నేపథ్యంలో సామాన్య భక్తులకు వేగవంతమైన దర్శనం కల్పించాలనే ఆలోచన ఎప్పటికప్పుడు ముందుకు వస్తూనే ఉంది. ముఖ్యంగా రెండు మూడు సంవత్సరాల క్రితం తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తల మండలి సమావేశాల అనంతరం భక్తుల వేచి ఉండే సమయాన్ని గణనీయంగా తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామని, సర్వదర్శనం వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చాలని సంకల్పం వ్యక్తమైంది. ఆ సమయంలో 'ఒక గంటలో దర్శనం లక్ష్యం' అనే దిశగా వ్యాఖ్యానాలు వినిపించాయి. ఇవి ఖచ్చితమైన అమలు గడువుతో కూడిన అధికారిక హామీగా కాకుండా, భక్తులకు మెరుగైన సేవ అందించాలనే లక్ష్య ప్రకటనగా చూడాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం తిరుమలలో పరిస్థితి చూస్తే, సర్వదర్శనం కోసం భక్తులు ఇంకా గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. ముఖ్యంగా సెలవులు, పండుగలు, వేసవి కాలంలో ఈ రద్దీ మరింత పెరుగుతోంది. రోజుకు లక్షల సంఖ్యలో భక్తులు విచ్చేసే పరిస్థితుల్లో, దర్శన వ్యవస్థపై ఒత్తిడి సహజం. ఈ నేపథ్యంలో క్యూ లైన్లు తగ్గడం కంటే, రద్దీని సమర్థంగా నిర్వహించడం పెద్ద సవాలుగా మారింది. అయినప్పటికీ, భక్తుల అనుభవం సులభతరం కావాలంటే వేచిఉండే సమయాన్ని తగ్గించడం తప్పనిసరి. ఆన్‌లైన్ టికెట్ వ్యవస్థను ప్రవేశపెట్టడం ద్వారా ముందస్తు ప్రణాళికకు అవకాశం కల్పించినప్పటికీ, డిమాండ్ ఎక్కువగా ఉండటంతో టికెట్లు కొద్ది నిమిషాల్లోనే పూర్తవుతున్నాయి. టిటిడి ఆఫిషియల్ వెబ్‌సైట్‌లో విడుదలయ్యే దర్శనం టికెట్లు, వసతి గదులు సాధారణ భక్తులకు అందుబాటులోకి రావడం కష్టమవుతోంది. ఇది వ్యవస్థలో లోపం కంటే, భక్తుల అధిక ప్రవాహాన్ని సూచించే అంశంగా చూడవచ్చు. అయినప్పటికీ, అందరికీ సమాన అవకాశాలు కల్పించాలంటే విడుదల విధానంలో మరింత

పారదర్శకత, విస్తరణ అవసరం. ఇప్పటి పరిస్థితిని పరిశీలిస్తే, తిరుమల దర్శన వ్యవస్థలో కొన్ని మెరుగుదలలు కనిపిస్తున్నాయి. టైమ్ స్లాట్ దర్శనం, టోకెన్ వ్యవస్థ, డిజిటల్ సమాచారం వంటి అంశాలు అందులో భాగం. అయితే ఇవి భక్తుల సంఖ్యకు సరిపడా విస్తరించబడకపోవడం వల్ల, సాధారణ భక్తులకు ఇంకా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా సర్వదర్శనం క్యూలలో ఉండే అనిశ్చితి ఎంత సమయం పడుతుందో తెలియకపోవడం భక్తుల అసౌకర్యానికి కారణమవుతోంది. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, దర్శన వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చేందుకు కొన్ని స్పష్టమైన మార్పులు అవసరం. ముందుగా, సర్వదర్శనం క్యూలను పూర్తిగా డిజిటల్ ట్రాకింగ్‌లోకి తీసుకురావడం ద్వారా భక్తులకు రియల్‌టైమ్ సమాచారం అందించాలి. క్యూలో ప్రవేశించే సమయంలోనే అంచనా సమయాన్ని తెలియజేస్తే,భక్తులు తమసమయాన్ని సమర్థంగా వినియోగించుకోగలరు. అదేవిధంగా, రోజువారీ దర్శన స్లాట్లను సమతుల్యం చేసి, ప్రత్యేక దర్శనాల సంఖ్యను పునఃసమీక్షించడం ద్వారా సాధారణ దర్శనానికి మరింత ప్రాధాన్యం ఇవ్వవచ్చు. ఇంకా, ఆన్‌లైన్ టికెట్ విడుదల విధానాన్ని విస్తరించి, ఒకేసారి కాకుండా విడతల వారీగా విడుదల చేస్తే మరింత మందికి అవకాశం లభిస్తుంది. వసతి గదుల కేటాయింపులో పారదర్శకత పెంచడం, స్థానికంగా స్పాట్ బుకింగ్ అవకాశాలను పెంచడం కూడా అవసరం. భక్తుల రద్దీని నియంత్రించేందుకు, ముందస్తు నమోదు విధానాలను ప్రోత్సహించడం ద్వారా అనవసరంగా వచ్చే ఒత్తిడిని తగ్గించవచ్చు. మొత్తానికి, తిరు మలలో 'ఒక గంటలో దర్శనం' అనే భావన ఒక లక్ష్యంగా నిలుస్తూనే ఉంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితులు చూస్తే, అది పూర్తిగా అమలులోకి రాకపోయినా, దిశ మాత్రం సరై నదే. భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో, వ్యవస్థను నిరంతరం అభివృద్ధి చేయడం తప్పనిసరి. మాటలకంటే చర్యలు ముఖ్యమని గుర్తిస్తూ, పారదర్శకత, సమర్థత, సమానత్వం అనే మూడు సూత్రాలపై దృష్టి పెట్టితే, భవిష్యత్తులో తిరుమల దర్శన అనుభవం మరింత సులభతరం కావచ్చు. •

ప్రపంచ శాంతికి మతాలు ప్రతీకలేనా?

దాడిశెట్టి శ్యామ్ కుమార్

ప్రపంచంలో విభిన్న మతాలలోని ఆధ్యాత్మికత చింతన మానవ జీవన విధానాల్లో ప్రతిబింబిస్తూ ఉంటుంది. సమాజంలో జీవిత సత్యాలు భక్తి భావం, దైవం లాంటి అనేక అంశాలు మత విశ్వాసాలతో ప్రజల్లో ముడిపడిన అంశంగా పూర్వకాలం నుండి కొనసాగుతూ వస్తూనే ఉన్నాయి. అంతర్గతంగా మానసిక ఆలోచనా ధోరణులు మానవ జీవన విధానాలను ప్రభావితం చేస్తూ ఉంటాయి. మత భావజాలం, ఆధునిక పోకడలు మానవ సమాజం చుట్టూ పరిభ్రమిస్తూ ఉంటాయి. ఆధ్యాత్మిక చింతనతో కూడిన ధర్మ ప్రవచనాలు ఆయా మత విశ్వాసాలకు అనుగుణంగా తరచుగా మానవ సమూహాల్లో సమ్మిళితమై ఉంటాయని అనిపిస్తుంది. మతోన్మాదాన్ని హింసాత్మక సంఘటనలను మతాలు ప్రోత్సహించవు, సహించవు. మనుషుల మధ్య వైషమ్యాలు,విద్వేషాలను, కలహాలను మతాలు పెంపొందించవు. సమాజంలో మానవ జీవన విధానాల్లో విధ్వంసాలను సృష్టించవు. మతం అనేది సారూప్యత కలిగిన జీవన విధానాలకు మంచి వారధిగా మనుషుల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించి అత్యున్నతమైన మానవతా విలువలకు ఆదర్శవంతంగా నిలుస్తున్నాయి. అయితే కొంతమంది మతం పేరిట మారణహోమం సృష్టిస్తూ యథేచ్ఛగా హింస మార్గాన్ని అవలంబిస్తూ అనవసరంగా మానవ సమూహాల మధ్య చిచ్చుపెట్టే రీతిలో హింస వాదాన్ని తెరపైకి తీసుకొచ్చే ప్రయత్నం చేయడం విచారకరం. మతాన్ని అడ్డు పెట్టుకొని మతోన్మాదానికి పాల్పడుతున్న కొంతమంది చేస్తున్న అరాచకాలు మానవ తప్పిదాలుగానే భావించవలసి ఉంటుందేమో. మతాల పేరు చెప్పుకొని కొంతమంది చేసే వినాశకర కార్యకలాపాలు మానవ నాగరికత సమాజాన్ని అవహేళన చేస్తున్నట్టుగా అనిపిస్తుంది. అలాంటి ఉన్మాద కార్యకలాపాలను అడ్డుకోవాల్సిన ఆవశ్యకత నేడు ప్రపంచ స్థాయిలో అన్ని దేశాల్లోని ప్రజలకు ఉందని చెప్పడంలో సంశయం లేదు. మానవులు సహజంగా జీవిత ప్రమాణ కాలాన్ని పెంచుకునేందుకు జీవితాంతంఅనుకూల ప్రతికూల పరిస్థితుల మధ్య జీవన పోరాటం కొనసాగిస్తున్న విధానంలో చాలా వరకు ఆధునిక జీవన విధానాల్లో సైతం ఆధ్యాత్మికతతో కూడిన భక్తి విశ్వాసాలు సమాజంలో ఎక్కువగా గోచరిస్తూంటాయి. ప్రస్తుత ఆధునిక జీవన ప్రపంచంలో ఆకాశం అంతరిక్షంలోని విషయాలను ప్రత్యక్షంగా పరోక్షంగా వీక్షిస్తున్న మానవుని మేధాశక్తి మానవజాతి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఉపయోగకరమైన ఆచరణాత్మక ఆలోచన ధోరణి కలిగి ఉండాలి కానీ,మితిమీరిన చాందసవాదం బలోపేతం కాకుండా నవీన నాగరిక సమాజం పరిస్థితులకు అనుగుణంగా అన్నిమతాలను పరస్పరం గౌరవిస్తూ,సమైక్యవాదంతో మానవులంతా ఒకటే అనే భావం ముందు తరాలకు బలంగా పునాదులు వేసే విధంగా మతాల ఆధ్యాత్మిక బోధనలు సూటిగా చెప్పవలసిన ఆవశ్యకత మరింతగా గోచరిస్తుంది. అప్పుడే ప్రపంచ శాంతి సౌభాగ్యం మానవ

అభ్యున్నతికి సోపనాలుగా మిగిలిపోతాయి కావచ్చు. పురాతన కాలం నుండి మానవాళి ఏదో ఒక రూపంలో దైవత్వాన్ని కొలుస్తున్నారు. ఆది మానవుడు ప్రకృతి దేవతలను పూజించడం చరిత్ర చెబుతోంది. క్రమేపీ మతాలు మంచి మానసిక ఆలోచనాత్మక ధోరణికి, ఆత్మశక్తి కొరకై ఆధ్యాత్మిక భావనతో కూడిన జీవిత సత్యాలను విధానాలను విశ్లేషించే దిశగా ప్రజల్లోకి చొచ్చుకురావడంతో, ప్రపంచంలోని సనాతన ధర్మాలు నమ్మకాలు మత విశ్వాసాలకు ప్రాతిపదికన మానవత్వాన్ని చాటుకోవడానికి మనుషుల మధ్య పరస్పర సహకారం ఉండాలని కష్ట నష్టాల్లో సహకరించుకోవాలని, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం లాంటి అనేకమైనటువంటి జీవితసత్యాలు ఆత్మబలానికి సంబంధించిన వ్యాఖ్యానాలు మత గ్రంథాల్లో తరచుగా వినిపిస్తుంటాయి, అందుకే ప్రపంచంలో అనేక మతాలు కాలాలకు అనుగుణంగా ప్రజల ఆదరాభిమానాలను విపరీతంగా చూరగొంటున్నాయేమో. కొందరు ఆయా మత విశ్వాసాలకు ఆకర్షితులై మత విధానాలను అవలంబిస్తూ ఉన్నప్పటికీ, మతాలు ఆధ్యాత్మిక చింతనతో మానవత్వం పరిమళించే విధంగా మానవ సంబంధాల ఆవశ్యకత అనుబంధాల అవసరం శాంతి , సామరస్యం కోసం సమాజంలో మానవులు సమైక్య జీవన విధానాలను శాంతియుతంగా గడపడానికి మనిషి జీవన విధానాలకు ప్రేరణగా నిలుస్తూ ఉండడం విశేషం.మతాల సారం మానవ మనుగడకు జీవం పోసేవిధంగా ఉంటాయి. శాంతి అహింస, జాలి, దయా,కరుణ లాంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఏ మతమైనా మానవతా వాదాన్ని బోధిస్తుంది. కానీ కొంతమంది స్వార్థపూరిత ప్రయోజనాలకు మతాన్ని అడ్డం పెట్టుకొని చేసే దుర్మార్గమైన పనులను ఏ మతానికి చెందిన వారినైనా ఎక్కువగా తిరస్కరిస్తారు. అందుకే ప్రపంచంలో చివరికి నీతి నిజాయితీతో కూడిన వాస్తవికతనే ప్రజల్లో ఆలోచన విధానాలకు కారణమై ఉండవచ్చు. అందుకే మానవ జీవన విధానాలలో మత గ్రంథాలు మత విశ్వాసాలు అందులోని మంచి సారాంశం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయేమో అనిపిస్తుంటుంది.ఏది ఏమైనప్పటికీ ప్రపంచంలో ఎవరికి ఏదీ పూర్తిగా, శాశ్వతం కాదు అనే ధోరణి సమాజంలో లేకపోలేదు. ఈ క్రమంలో బ్రతికినంత కాలం జీవన విధానాల్లో సమ్మిళితమైన ఉత్తమ ఆధ్యాత్మిక మత విశ్వాసాలకు అనుగుణంగా సమస్త మానవాళి ఆధునిక భావనలతో ముందు తరాలకు ఆదర్శప్రాయంగా నిలవాల్సిన అవసరం మరింతగా ఉంటుందేమో. సూర్యుడి నుండి వచ్చే వెలుతురు, గాలి, నుండి లభించే ప్రాణవాయువు త్రాగడానికి కావలసిన నీరు ఇలాంటివి సర్వ మానవాళి మనుగడలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న వనరులు మతాలకు అతీతమైనవి. అలాంటి ప్రకృతి వనరులను సమానంగా ఆస్వాదిస్తున్న మానవుల మధ్య మత సామరస్యం అత్యంత కీలకమైనది. మతాలు అనేక రకాలుగా గోచరిస్తున్నా మానవులలో విభిన్న ఆలోచనలు భౌతికపరమైన మౌలిక అవసరాలు ఇంద్రియాలు జీవన ప్రక్రియలు అన్నీ సారూప్యత కలిగినవే. మతం అనేది ప్రపంచవ్యాప్తంగా మానవ జీవన విధానాలను ప్రభావితం చేస్తూనే ఉంది. మారుతున్న కాలంతో పాటు మానవుడు అధునాతన పరిజ్ఞానాన్ని మేధాశక్తిని గణనీయంగా పెంచుకుంటున్న తరుణంలో మతం అనేది ఆధ్యాత్మిక మానసిక వికాసానికి ప్రపంచ శాంతి సుస్థిరతకు ప్రతీకగా మరింతగా పురోగమించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంటుందేమో. •

భారత్-న్యూజిలాండ్ మధ్య స్వేచ్ఛావాణిజ్యం

నేడు ప్రధాని మోడీ సమక్షంలో ఒప్పందం

ఆగ్రాలో పీయూష్ గోయల్, న్యూజిలాండ్ మంత్రి కీలక భేటీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: భారత్- న్యూజిలాండ్ మధ్య ఏప్రిల్ 27 సోమవారం స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ) కుదరనుంది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ సమక్షంలో భారత్, న్యూజిలాండ్ దేశాలు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ)పై సంతకం చేయనున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం, న్యూజిలాండ్‌కు భారత్ చేసే 100శాతం ఎగుమతులపై సుంకాలను తొలగించడంతో పాటు, న్యూజిలాండ్ నుండి ప్రస్తుతం జరుగుతున్న 95శాతం దిగుమతులపై సుంకాలను గణనీయంగా తగ్గించడం లేదా పూర్తిగా తొలగించడం జరుగుతుంది. ఈ ఒప్పందం ద్వారా 100 శాతం సుంకాల విభాగాలపై భారతదేశానికి తక్షణమే సుంకరహిత ప్రవేశం లభిస్తుంది. భారతదేశం ఎగుమతి చేసే వస్త్రాలు,దుస్తుల ఉత్పత్తులు, తోలు వస్తువులు, శిరోభూషణాలు, సిరామిక్స్, తివాచీలు, ఆటో మొబైల్స్, ఆటో విడిభాగాలతో సహా సుమారు 450సుంకాల విభాగాలపై న్యూజిలాండ్ ప్రస్తుతం విధిస్తున్న 10 శాతం సుంకంతో పోలిస్తే ఇది చాలా తక్కువ. పాలు, మీగడ, మజ్జిగ, పెరుగు, జున్ను వంటి అన్ని పాల ఉత్పత్తులతో పాటు వ్యవసాయ ఉత్పత్తులతో సహా పలు వస్తువులను స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఏ) నుండి మినహాయించడంలో భారతదేశం విజయం సాధించింది. ఈ ఎఫ్‌టిఎలో న్యూజిలాండ్ 15 సంవత్సరాల కాలంలో భారతదేశంలో 20 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టే నిబంధన కూడా ఉంది. భారతదేశంతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ)లో యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ (ఇఎఫ్‌టిఎ) చేసిన 100 బిలియన్ డాలర్ల పెట్టుబడి 'నిబద్ధత' తరహాలోనే ఇది కూడా ఉంది. అంతేకాకుండా, ఈ ఎఫ్‌టిఎలో వృత్తి నిపుణులు,విద్యార్థుల రాకపోకలకు సంబంధించిన అనేక నిబంధనలు కూడా ఉన్నాయి. విద్యార్థుల రాకపోకలు, చదువు తర్వాత పని చేసే వీసాలపై న్యూజిలాండ్ మొట్టమొదటిసారిగా ఏ దేశంతోనైనా ఒకఅనుబంధ ఒప్పందంపై సంతకం చేసింది. దీని ప్రకారం, భారతీయ విద్యార్థులు న్యూజిలాండ్‌లో చదువుతున్నప్పుడు, పొడిగించిన చదువు తర్వాత పని చేసే వీసాలతో వారానికి 20 గంటల వరకు పని చేయవచ్చు. ఇంకా, ఈ ఒప్పందంలో నైపుణ్యం కలిగిన భారతీయుల కోసం 5,000 వీసాల కోటాను చేర్చారు. ఈ వీసాలు భారతదేశానికి ఆసక్తి ఉన్న రంగాలలో, అంటే ఆయుష్ వైద్యులు, యోగా శిక్షకులు,చెఫ్‌లు, సంగీత ఉపాధ్యాయులతో పాటు ఐటీ, ఇంజనీరింగ్, ఆరోగ్య సంరక్షణ, విద్య, నిర్మాణం వంటి ఇతర కీలక రంగాలలో, మూడు సంవత్సరాల వరకు ఉండేందుకు ఉద్దేశించబడ్డాయి. ఈ ఒప్పందంలో చేర్చబడిన వర్కింగ్ హాలిడే వీసా కార్యక్రమం కింద, ఏటా 1,000 మంది యువ భారతీయులు 12 నెలల కాలానికి న్యూజిలాండ్‌లోకి పలుమార్లు ప్రవేశించవచ్చు.

ఆగ్రాలో కీలక సమావేశం: కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి పీయూష్ గోయల్, న్యూజిలాండ్ వాణిజ్య, పెట్టుబడులశాఖ మంత్రి టాడ్ మెక్‌క్లే ఆదివారం ఆగ్రాలో తోలు, పాదరక్షలు, ఆయుష్, ఫార్మా, వైద్య పరికరాలు, తేలికపాటి ఇంజనీరింగ్, క్రీడా వస్తువుల రంగాల నాయకులతో సమావేశమయ్యారు. 'వ్యాపార నాయకులతో ఎంతో విజ్ఞానాన్ని అందించే సమావేశం జరిగింది. నా స్నేహితుడు, న్యూజిలాండ్ వాణిజ్య, పెట్టుబడుల శాఖ మంత్రి అయిన ఎంపీ టాడ్ మెక్‌క్లే కూడా నాతో పాటు పాల్గొన్నారు' అని గోయల్ ఎక్స్‌లో రాశారు. 'అంతే కాకుండా, మన కళాకారులు, మహిళా పారిశ్రామికవేత్తల నైపుణ్యాలను చాటిచెప్పే 'ఆగ్రా: వరల్డ్ క్యాపిటల్ ఆఫ్ ఫుట్‌వేర్' బ్రాండ్ ప్రచారాన్ని ప్రారంభించాము. ఇది ఆగ్రాను ప్రపంచవ్యాప్త సోర్సింగ్ గమ్యస్థానంగా, ఉపాధి కల్పన కేంద్రంగా, ఎగుమతుల శక్తి కేంద్రంగా నిలబెడుతుంది' అని మంత్రి తెలిపారు. భారత్ -న్యూజిలాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఏ) ఒక కీలకమైన మైలురాయి అని, ఇది మన రైతులు, మహిళలు, కళాకారులు, ఎంఎస్‌ఎంఈలు, వ్యాపారాలు, నైపుణ్యం కలిగిన నిపుణులకు కొత్త అవకాశాలను అందిస్తుందని గోయల్ ఇంకా పేర్కొన్నారు. "ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దార్శనికతకు అనుగుణంగా, ఈ ఒప్పందం మన రెండు దేశాల మధ్య మరింత లోతైన, సుస్థిరమైన, ప్రజల కేంద్రీకృత భాగస్వామ్యానికి ఒక ముఖ ద్వారం అవుతుంది" అని ఆయన అన్నారు. న్యూజిలాండ్‌కు భారతదేశం ఒక వ్యూహాత్మక ప్రాధాన్యత అని మెక్‌క్లే పునరుద్ఘాటించారు. భారతదేశంలో ఉమ్మడి వ్యాపారాలు, పెట్టుబడులను చురుకుగా చేపట్టాలని వ్యాపార సంస్థలను కోరారు.

ఎరువుల ప్లాంట్‌పై ఉక్రెయిన్ దాడి

ఎరువుల ప్లాంట్ (ఫైల్)

కీవ్, ఏప్రిల్ 26: వాయవ్య రష్యాలో కీలకమైన ఎరువుల ప్లాంట్ 'ఫోస్ అగ్రో'పై ఉక్రెయిన్ డ్రోన్‌తో దాడి చేసింది. ఏప్రిల్ నెలలో ఈ ప్లాంట్‌పై జరిగిన రెండో దాడి ఇది. రష్యా కీలక ఎగుమతి కేంద్రాలపై ఇటీవల కాలంలో ఉక్రెయిన్ దాడులు తీవ్రమయ్యాయి. ఈ ప్లాంట్‌లోని సల్ఫ్యూరిక్ యాసిడ్ పంప్ చేసే హై ప్రెజర్ పైప్‌లైన్లను ఈ డ్రోన్లు ధ్వంసం చేశాయి. ఈ విషయాన్ని వోలోగ్డా గవర్నర్ జార్జి ఫిలిమోనోవ్ ధ్రువీకరించారు. కాకపోతే ఎటువంటి మంటలు లేదా లీకేజీకి ఈ దాడి కారణం కాలేదని వెల్లడించారు. పైప్‌లైన్‌కు వెంటనే మరమ్మతులు నిర్వహించినట్లు తెలిపారు. దీంతో ప్రమాదకర గ్యాస్‌లు కూడా ఏమీ లీక్ కాలేదని చెప్పారు. 'ఫోస్ అగ్రో' ప్రతినిధి మాత్రం ఈ దాడిపై స్పందించేందుకు నిరాకరించారు. ప్రస్తుతం ఇరాన్ యుద్ధం తీవ్రస్థాయిలో ఉండటంతో నైట్రోజన్ ఫర్టిలైజర్స్ ధరలు గణనీయంగా పెరిగాయి. దీంతోపాటు రష్యా, చైనా దేశాలు వీటి ఎగుమతులపై ఆంక్షలు విధించాయి. రష్యా నుంచి ఫాస్ఫరస్ ఆధారిత ఎరువులను భారత్‌కు ఎగుమతి చేసే కంపెనీల్లో ఇది కూడా ఉంది.

విమానం ఇంజిన్‌లో పొగలు..టేకాఫ్ రద్దుచేసిన స్విస్ ఎయిర్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో పెను ప్రమాదం తృటిలో తప్పింది. ఢిల్లీ నుంచి జ్యూరిచ్ వెళ్లాల్సిన స్విస్ ఎయిర్‌లైన్స్ విమానం ఇంజిన్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో టేకాఫ్ రద్దు చేసుకుంది. ఈ క్రమంలో విమానాన్ని అత్యవసరంగా ఖాళీ చేయిస్తుండగా ఆరుగురు ప్రయాణికులు గాయపడ్డారు. ఆదివారం తెల్లవారుజామున 1:08 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. ఎల్ఎక్స్147 విమానం రన్‌వేపై టేకాఫ్ కోసం వేగంగా వెళ్తుండగా ఇంజిన్‌లో సమస్యను సిబ్బంది గుర్తించారు. దీంతో వెంటనే టేకాఫ్‌ను నిలిపివేసి, ముందుజాగ్రత్త చర్యగా విమానాన్ని ఖాళీ చేయాలని నిర్ణయించారు. విమానంలో 232 మంది ప్రయాణికులు, నలుగురు చిన్నారులతో పాటు సిబ్బంది ఉన్నారు. ప్రయాణికులను ఎమర్జెన్సీ స్లైడ్ల ద్వారా కిందకు దించారు. ఈ తరలింపు ప్రక్రియలో ఆరుగురు ప్రయాణికులు గాయపడగా, వారిని చికిత్స కోసం మేదాంత ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై స్విస్ ఎయిర్‌లైన్స్ ఒక ప్రకటన విడుదల చేసింది. ఘటనకు గల కారణాలను పూర్తిగా అర్థం చేసుకోవడానికి ఒక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపింది. విమానాన్ని పరిశీలించేందుకు ఢిల్లీకి తమ సాంకేతిక నిపుణుల బృందాన్ని పంపుతున్నామని ఎయిర్‌లైన్ పేర్కొంది. ప్రయాణికులందరికీ ప్రత్యామ్నాయ ప్రయాణ ఏర్పాట్లు, హోటల్ వసతి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించింది.

అధ్యక్షులపై కాల్పులు అమెరికాలో కొత్తేమీకాదు..



వాషింగ్టన్, ఏప్రిల్ 26: అధ్యక్షపదవి నిర్వహణ అనేది ఒక ప్రమాదకరమైన వృత్తి అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ వ్యాఖ్యానించారు. కాల్పులు ఘటనలు ఏవీ తనను బాధ్యతలనుంచి తప్పించలేవని, అమెరికన్లకోసం తాను ఎప్పటికీ కృషిచేస్తూనే ఉంటానన్నారు. శనివారం నాటి ఘటనతో కలిపి ట్రంప్‌పై ఇప్పటికి మూడుసార్లు హత్యాయత్నాలు జరిగాయి. అమెరికా చరిత్రను పరిశీలిస్తే, అధ్యక్ష పదవిని చేపట్టడం కత్తిమీద సాములాంటిదని అర్థమవుతుంది. ఎందరో అధ్యక్షులు ఇలాంటి దాడులను ఎదుర్కొన్నారు. వీరిలో నలుగురు ప్రాణాలు కూడా కోల్పోయారు. అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ఉన్న ట్రంప్‌ను ప్రమాదం నిరంతరం వెన్నాడుతూనే ఉంది. 2024 జులై 13న పెన్సిల్వేనియాలో జరిగిన ప్రచార సభలో ఆయన ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. వేదికపై ఉన్న స్క్రీన్‌పై చార్ట్‌ను చూసేందుకు ఆయన తల తిప్పిన క్షణంలో, ఒక తూటా ఆయన చెవిని తాకుతూ దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఆయన వెనుక నిలబడిన ఒక వ్యక్తి మరణించారు. సమీప భవనం నుంచి కాల్పులు జరిపిన దుండగుడిని సీక్రెట్ సర్వీస్ అధికారులు హతమార్చారు. ఈ భద్రతా లోపంపై అప్పట్లో పెద్ద దుమారమే రేగింది. ఈ ఘటన జరిగిన రెండు నెలలకే, సెప్టెంబర్ 15న ఫ్లోరిడాలోని ట్రంప్ గోల్ఫ్ కోర్స్ సమీపంలోని పొదల్లో రైఫిల్‌తో నక్కి ఉన్న ఒక వ్యక్తిని గుర్తించారు. సీక్రెట్ సర్వీస్ ఏజెంట్ కాల్పులు జరపడంతో అతను పారిపోయినా, తర్వాత పట్టుబడ్డాడు. విచారణ అనంతరం కోర్టు అతనికి జీవిత ఖైదు విధించింది. శనివారం ట్రంప్‌పై దాడి జరిగిన హిల్టన్ హోటల్‌కు కూడా ఒక చారిత్రక ప్రాధాన్యం ఉంది. 1981 మార్చిలో అప్పటి అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్‌పై ఇదే హోటల్ బయట హత్యాయత్నం జరిగింది. ఈ దాడిలో ఆయన ఊపిరితిత్తులకు తీవ్ర గాయమైంది. జోడీ ఫోస్టర్ అనే నటిని ఆకట్టుకోవడానికే రీగన్‌ను చంపాలనుకున్నానని నిందితుడు జాన్ హింక్లీ చెప్పడం అప్పట్లో సంచలనం సృష్టించింది. మానసిక స్థితి సరిగా లేదని నిర్ధారణ కావడంతో అతనికి శిక్ష పడలేదు. అధ్యక్ష పదవిలో ఉండి హత్యకు గురైన వారిలో జాన్ ఎఫ్. కెన్నడీ ఉదంతం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. 1963 నవంబర్ 22న డల్లాస్‌లో ఓపెన్ కారులో వెళ్తుండగా, లీ హార్వే ఓస్వాల్డ్ అనే వ్యక్తి భవనంపై నుంచి కాల్పులు జరిపి ఆయన్ను హత్య చేశాడు. ఆ తర్వాత ఓస్వాల్డ్‌ను జాక్ రూబీ అనే వ్యక్తి కాల్చి చంపడం జరిగింది. మరో ఐదేళ్లకే కెన్నడీ సోదరుడు రాబర్ట్ కెన్నడీ కూడా అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ఉండగానే హత్యకు గురయ్యారు. చరిత్రలో తొలిసారి హత్యకు గురైన అధ్యక్షుడు అబ్రహం లింకన్. బానిసత్వ నిర్మూలన కోసం అంతర్యుద్ధంలో దేశాన్ని నడిపించిన ఆయన, 1865 ఏప్రిల్ 18న వాషింగ్టన్‌లోని ఒక థియేటర్‌లో కాల్పులకుబలయ్యారు. ఆయన తర్వాత 1881లో జేమ్స్ గారిఫీల్డ్ , 1901లో విలియం మెకిన్లీ కూడా హత్యకు గురయ్యారు. ఇటీవలి కాలంలో 2023 మేలో సాయి వర్షిత్ కందుల అనే భారత సంతతి వ్యక్తి, అధ్యక్షుడు జో బైడెన్‌ను చంపి దేశాన్ని స్వాధీనం చేసుకుంటానని చెబుతూ వైట్‌హౌస్ బారియర్లను ట్రక్కుతో ఢీకొట్టాడు. అతనికి కోర్టు ఎనిమిదేళ్ల జైలు శిక్ష విధించింది. ఈ ఘటనలన్నీ అమెరికా అధ్యక్ష పదవి ఎంతటి ప్రమాదకరమో స్పష్టం చేస్తున్నాయి.

హిల్టన్ హోటల్‌వద్దనే మాజీ అధ్యక్షుడు రీగన్‌పై కాల్పులు: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌పై హత్యాయత్నం జరిగిన వాషింగ్టన్ హిల్టన్ హోటల్‌వద్దనే గతంలో అధ్యక్షుడు రొనాల్డ్ రీగన్‌పైనా కాల్పులుజరిపిన సంఘటనలున్నాయి. హిల్టన్ హోటల్‌కు హింక్లే హిల్టన్ అన్న పేరు కూడా ఉన్నది. 1981 మార్చి 30వ తేదీన ఈ హోటల్ వద్దే అప్పటి దేశాధ్యక్షుడు రోనాల్డ్ రీగన్‌పై హత్యాయత్నం జరిగింది. జాన్ హింక్లే జూనియర్ అనే వ్యక్తి ఆనాటి దేశాధ్యక్షుడు రోనాల్డ్ రీగన్‌పై కాల్పులు జరిపాడు. కొన్ని సెకన్ల వ్యవధిలోనే అతను రీగన్‌పై ఆరు రౌండ్లు ఫైర్ చేశాడు. డిన్నర్‌లో మాట్లాడి బయటకు వస్తున్న రీగన్‌పై షూట్ చేశారు. ప్రెసిడెంట్ రీగన్‌కు చెందిన లిమోసిన్ కారు నుంచి బుల్లెట్లు దూసుకెళ్లాయి. ఆ బుల్లెట్లు రీగన్ ఛాతిలో దిగాయి. ఆ కాల్పుల ఘటనలో రీగన్ తీవ్రంగా గాయపడ్డారు. ఆ ఘటనలో మరో ముగ్గురు కూడా తీవ్రంగా గాయపడ్డారు. అప్పటి ప్రెస్ సెక్రటరీ జేమ్స్ బ్రాడీ కూడా ఆగాయపడ్డ బృందంలో ఉన్నాడు. ఆయనతోపాటు ఓ పోలీసు ఆఫీసర్, సీక్రెట్ సర్వీస్ ఏజెంట్ కూడా గాయపడ్డారు. సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు అధ్యక్షుడు రీగన్‌ను తమ కారులో జార్జ్ వాషింగ్టన్ యూనివర్సిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఆయనకు సర్జరీ చేశారు. ప్రాణాపాయం తప్పించారు. కాల్పుల ఘటన జరిగిన ప్రదేశం నుంచి హింక్లేను కస్టడీలోకి తీసుకున్నారు.

క్షణాల్లో కాల్పుల ప్రాంతం అధీనంలోకి తీసుకున్న సీక్రెట్ సర్వీస్: కాల్పులఘటనతో వెనువెంటనే అప్రమత్తమైన సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు, ట్రంప్ దంపతులను వెంటనే తమ భద్రతా వలయంలోకి తీసుకుని అక్కడి నుంచి సురక్షిత ప్రాంతానికి తరలించారు. కిందకు వంగండి, కిందకు వంగండ అంటూ అరుపులు వినిపించాయి. వందలాది మంది జర్నలిస్టులు, ప్రముఖులు, రాజకీయ నాయకులు టేబుళ్ల కింద దాక్కున్నారు. కొద్ది క్షణాల్లోనే కంబాట్ గేర్‌తో సీక్రెట్ సర్వీస్ అధికారులు డైనింగ్ హాల్‌లోకి ప్రవేశించి పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. భద్రతా చర్యల్లో భాగంగా రాబర్ట్ ఎఫ్.కెన్నడీ జూనియర్, డగ్ బర్గమ్, మార్కో రూబియో వంటి పలువురు సీనియర్ అధికారులను కూడా సిబ్బంది నేలపైకి నెట్టారు. అనంతరం క్యాబినెట్ సభ్యులను ఒక్కొక్కరిగా బయటకు పంపించారు. ఈ ఘటనపై యూఎస్ సీక్రెట్ సర్వీస్ స్పందిస్తూ ట్రంప్, మెలనియా సురక్షితంగా ఉన్నారని ధ్రువీకరించింది.

శాంతిచర్చలను రద్దుచేసిన ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాల్గొన్న ఓ కార్యక్రమంలో కాల్పులు జరగడం, ఆ వెంటనే ఇరాన్‌తో కీలకమైన శాంతి చర్చలను ఆయన రద్దు చేయడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. వాషింగ్టన్‌లోని హిల్టన్ హోటల్‌లో శనివారం జరిగిన వైట్‌హౌస్ కరెస్పాండెంట్స్ అసోసియేషన్ వార్షిక విందులో ఈ కాల్పుల ఘటన చోటుచేసుకుంది. ఈ దాడి నుంచి ట్రంప్ సురక్షితంగా బయటపడ్డారు. 31 ఏళ్ల కోల్ థామస్ అలెన్ అనే వ్యక్తి ఈ దాడికి పాల్పడినట్లు గుర్తించారని, నిందితుడు పలు ఆయుధాలతో భద్రతా పాయింట్ వైపు దూసుకొచ్చాడని ట్రంప్ వివరించారు. ఒక సీక్రెట్ సర్వీస్ ఏజెంట్‌పై కాల్పులు జరపగా, బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్ అతడిని కాపాడిందని తెలిపారు. ఈ ఘటనతో విందును రద్దు చేశారు. మరోవైపు ఇరాన్‌తో శాంతి చర్చల కోసం పాకిస్థాన్‌కు వెళ్లాల్సిన తన రాయబారుల పర్యటనను కూడా ట్రంప్ రద్దు చేశారు. ఇరాన్ చర్చల కోసం పంపిన ప్రతిపాదన తనను సంతృప్తిపరచలేదని, అందుకే రద్దుచేసానన్నారు. "పర్యటనను నేను రద్దు చేసిన పది నిమిషాలకే, ఇరాన్ నుంచి మెరుగైన ప్రతిపాదన వచ్చింది. ప్రయోజనం లేని విషయాల గురించి మాట్లాడటానికి 18 గంటలు విమాన ప్రయాణం చేయాల్సిన అవసరం లేదని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ పరిణామాల తర్వాత ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్‌లో స్పందిస్తూ ఇరాన్ నాయకత్వంలో తీవ్రమైన గందరగోళం, అంతర్గత పోరు నడుస్తోందని పేర్కొన్నారు. అక్కడ ఎవరి చేతిలో అధికారం ఉందో వారికే తెలియదు. అన్ని కార్డులు మా దగ్గరే ఉన్నాయి. వారి దగ్గర ఏమీ లేవు. మాట్లాడాలనుకుంటే వాళ్లే మాకు కాల్ చేయాలని పోస్ట్ చేశారు. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఇరాన్‌పై దాడి చేయడంతో ఈ యుద్ధం ప్రారంభమైంది. ప్రస్తుతం కాల్పుల విరమణ అమల్లో ఉన్నప్పటికీ, తాజా పరిణామాలతో మళ్లీ ఉద్రిక్తతలు పెరిగాయి.

భవానీపూర్‌లో ఉద్రిక్తతలు

100 మీటర్లదూరంలోనే టిఎంసి,బిజెపి సభలు

అవమానించారంటూ వేదిక దిగి వెళ్లిపోయిన మమతా బెనర్జీ



భవానిపూర్, ఏప్రిల్ 26: రెండో విడత ఎన్నికల ప్రచారంలోభాగంగా తృణమూల్‌కాంగ్రెస్, బీజెపిలు కేవలం 100 మీటర్ల దూరంలోనే ఎన్నికల సభలు నిర్వహించడం, ఆపై బిజెపి నేతలు బిగ్గరగా మైకుల్లో మమతకు వ్యతిరేకంగా నినాదాలుచేయడంతో ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. ఎన్నికల ప్రచారంలో ఆదివారం తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కార్యకర్తల మధ్య ఘర్షణలు చెలరేగాయి. ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ తన ప్రసంగాన్ని మధ్యలోనే ఆపేసి వేదిక దిగివెళ్లడంతో ఈ గొడవలు ప్రారంభమయ్యాయి. మమతా బెనర్జీ ప్రసంగిస్తుండగా, సమీపంలోని బీజేపీ సభ నుంచి లౌడ్ స్పీకర్ల ద్వారా శబ్దాలు చేస్తూ తన సభకు ఉద్దేశపూర్వకంగా ఆటంకం కలిగిస్తున్నారని ఆమె ఆరోపించారు. ఈ ఘటన అవమానకరంగా ఉందని పేర్కొంటూ ప్రజలకు క్షమాపణలు చెప్పి ప్రసంగాన్ని ముగించకుండానే వేదిక నుంచి నిష్క్రమించారు. ముఖ్యమంత్రి వెళ్లిపోయిన వెంటనే ఆగ్రహానికి గురైన టీఎంసీ కార్యకర్తలు నిరసనగా బీజేపీ సభా ప్రాంగణం వైపు దూసుకెళ్లారు. దీంతో ఇరువర్గాల మధ్య నినాదాల పర్వం మొదలై, అది కాస్తా ఘర్షణకు దారితీసింది. పశ్చిమ బెంగాల్ రెండో దశ అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న వేళ రాష్ట్ర రాజకీయాలకు గుండెకాయ లాంటి భవనీపూర్ నియోజకవర్గంలో శనివారం బీజేపీ లౌడ్‌స్పీకర్ల గోల వల్ల తన మాటలు ప్రజలకు వినబడటం లేదని, ఇది కావాలని చేస్తున్న కుట్ర అని మమత ఆగ్రహం వ్యక్తం చేశారు.

అంబానీ ఇంట పాప్‌సింగర్ రిహానా సందడి

ముంబయి, ఏప్రిల్ 26: ప్రముఖ పాప్ సింగర్, గ్లోబల్ ఐకాన్ రిహానా ముంబైలోని అంబానీ నివాసంలో సందడి చేశారు. అంబానీ కుటుంబ సభ్యులు ఆమెకు ప్రత్యేక ఆతిథ్యం ఇచ్చి, మధ్యాహ్న విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భారతీయ కళ, సంస్కృతి, నృత్య రూపాల గురించి రిహానా ఆసక్తిగా తెలుసుకున్నారు. అనంత్ అంబానీ, రాధికా మర్చంట్, ఈషా అంబానీ, శ్లోకా మెహతా తదితరులు రిహానాకు సాదర స్వాగతం పలికారు. వారితో కలిసి రిహానా భోజనం చేస్తూ సరదాగా ముచ్చటించారు. ఈ విందు కార్యక్రమం కుటుంబ సభ్యుల మధ్య అత్యంత ఆత్మీయంగా జరిగింది. రిలయన్స్ రిటైల్ సంస్థ తన సౌందర్య ఉత్పత్తుల బ్రాండ్ ఫెంటి బ్యూటీ వేడుకల కోసం రిహానాను భారత్‌కు తీసుకువచ్చింది. ఈ బ్రాండ్ ఉత్పత్తులు భారత్‌లో ప్రత్యేకంగా టిరా, సెఫోరా స్టోర్లలో అందుబాటులో ఉన్నాయి. ఈ బిజినెస్ టూర్ లో భాగంగానే ఆమె అంబానీ కుటుంబాన్ని మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలుస్తోంది.

ఈసారి వర్షాలు అంతంత మాత్రమే

జూన్-సెప్టెంబర్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం

ఎల్‌నినో ప్రభావమే కారణం: ఐఎండి అంచనా



న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: ఈ ఏడాది భారతదేశంలో సాధారణం కంటే బలహీనమైన రుతుపవనాలు ఉండవచ్చని భారత వాతావరణ శాఖ (ఐఎండి) పేర్కొంది. ఇది వ్యవసాయం, నీటి సరఫరా, ఆర్థిక స్థిరత్వంపై ఆందోళనలను రేకెత్తిస్తోంది. వ్యవసాయ రంగానికి కీలకమైన జూన్- సెప్టెంబర్ నైరుతి రుతుపవన కాలంలో వర్షపాతం సాధారణ స్థాయిల కంటే తక్కువగా ఉండే అవకాశం ఉందని ఐఎండి తెలిపింది. "ఈ ఏడాది రుతుపవన వర్షపాతం దీర్ఘకాల సగటులో 92 శాతానికి చేరుకుంటుందని అంచనా" అని కేంద్ర భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఎం. రవిచంద్రన్ తెలిపారు. "2026 నైరుతి రుతుపవన కాలంలో (జూన్ నుండి సెప్టెంబర్ వరకు) దేశవ్యాప్తంగా కురిసే వర్షపాతం సాధారణం కంటే తక్కువగా (దీర్ఘకాలిక సగటు (ఎల్‌పిఎ)లో 95-90 శాతం) ఉండే అవకాశం ఉంది" అని ఆయన తెలిపారు. "ప్రస్తుతం, భూమధ్యరేఖ పసిఫిక్‌పై బలహీనమైన ఎల్‌నినో లాంటి పరిస్థితులు తటస్థ పరిస్థితులుగా మారుతున్నాయి. హిందూ మహాసముద్రంపై ప్రస్తుతం తటస్థ హిందూ మహాసముద్ర డయాపోల్ (ఐఓడి) పరిస్థితులు నెలకొని ఉన్నాయి. రుతుపవన కాలం ద్వితీయార్ధంలో ఐఓడి అనుకూలంగా అభివృద్ధి చెందుతుందని మేము అంచనా వేస్తున్నాము" అని రవిచంద్రన్ అన్నారు. "నైరుతి రుతుపవన కాలంలో ఎల్‌నినో పరిస్థితులు ఏర్పడతాయని మాన్‌సూన్ మిషన్ క్లైమేట్ ఫోర్‌కాస్ట్ సిస్టమ్ (ఎంఎంసిఎఫ్ఎస్) సూచిస్తోంది" అని భారత వాతావరణ శాఖ (ఐఎండి) తెలిపింది.

భూమధ్య రేఖకు సమీపంలోని పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు తీవ్రంగా, వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం తప్పదని ప్రపంచ వాతావరణ విభాగం (డబ్ల్యుఎంవో) సూచించింది. ఈ ఏడాది మే నుంచి జూలై నెల మధ్యలో భారత్‌లో ఎల్‌నినో ప్రభావం ఉంటుందని పేర్కొంది. దీంతో జులై నెలలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుందని తెలిపింది. ఈ ఏడాది ప్రారంభంలో కొంతకాలం తటస్థ వాతావరణ పరిస్థితులు ఉన్నప్పటికీ ఇప్పుడు మార్పు బలంగా కనిపిస్తున్నదని డబ్ల్యుఎంవో చీఫ్ విల్‌ఫ్రాన్ మోఫూమా చెప్పారు. ఎల్‌నినో ఏర్పడటం అవశ్యమని, ఆ తరువాత అది మరింత తీవ్రతరమవుతుందని హెచ్చరించారు.

కాల్పులఘటనతో సురక్షితప్రాంతానికి ట్రంప్ తరలింపు

వాషింగ్టన్, ఏప్రిల్ 26: వాషింగ్టన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కాల్పులు కలకలం రేపడంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను భద్రతా సిబ్బంది హుటాహుటిన సురక్షిత ప్రాంతానికి తరలించారు. ఈ క్రమంలో ఆయన అదుపుతప్పి కిందపడిపోయారు. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌ను సైతం భద్రతా సిబ్బంది జాకెట్ పట్టుకుని లాక్కెళ్లారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అమెరికా కాలమానం ప్రకారం, శనివారం రాత్రి వైట్ హౌస్ ప్రెస్ కరస్పాండెంట్ల అసోసియేషన్ వార్షిక విందు సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. అధ్యక్షుడు ట్రంప్, ప్రథమ మహిళ మెలానియా, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సహా పలువురు ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ట్రంప్ ప్రసంగం కోసం అందరూ ఎదురు చూస్తున్న వేళ, కోల్ అలెన్ అనే వ్యక్తి కాల్పులు జరిపాడు. అతని వద్ద షాట్‌గన్, హ్యాండ్‌గన్ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. కాల్పుల శబ్దాలు వినిపించగానే సీక్రెట్ సర్వీస్ అధికారులు వెంటనే రంగంలోకి దిగి ట్రంప్, వాన్స్‌లను సురక్షిత ప్రాంతానికి తరలించే ప్రయత్నం చేశారు. ఈ తొక్కిసలాటలోనే ట్రంప్ కిందపడిపోయినట్లు వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. నిందితుడిని సీక్రెట్ సర్వీస్ అధికారులు అరెస్టు చేశారు. ఈ ఘటనపై స్పందించిన ట్రంప్, తామంతా సురక్షితంగా ఉన్నామని తెలిపారు. ఒక భద్రతా అధికారికి గాయాలయ్యాయని, బుల్లెట్ ప్రూఫ్ వెస్ట్ కారణంగా ప్రాణాలతో బయటపడ్డారని చెప్పారు. కాల్పులకు పాల్పడిన వ్యక్తిని సిక్ పర్సన్ అని ఆయన అభివర్ణించారు. ప్రస్తుతం కాల్పుల ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

కాల్పులఘటనపై ప్రధాని మోడీ దిగ్భ్రాంతి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హాజరైన ఒక కార్యక్రమం వద్ద కాల్పుల ఘటన చోటుచేసుకోవడంపై భారత ప్రధాని నరేంద్ర మోడీ స్పందించి ఘటనను ఖండించారు. ప్రజాస్వామ్యంలో హింసకు స్థానం లేదని స్పష్టం చేశారు. అధ్యక్షుడు ట్రంప్, ఆయన కుటుంబ సభ్యులు క్షేమంగా ఉన్నారన్న వార్త తనకు ఉపశమనం కలిగించిందని ప్రధాని మోడీ పేర్కొన్నారు. ఈ ఘటనపై ప్రధాని మోడీ ఎక్స్ వేదికగా స్పందించారు. అధ్యక్షుడు ట్రంప్, ప్రథమ మహిళ, ఉపాధ్యక్షుడు క్షేమంగా, ఎలాంటి హాని జరగకుండా బయటపడ్డారని తెలిసి ఊరట చెందాను. వారి భద్రత, శ్రేయస్సు కోసం నా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ప్రజాస్వామ్యంలో హింసకు చోటు లేదు. దానిని నిస్సందేహంగా ఖండించాలని పోస్ట్ చేశారు. అటు ఈ ఘటనపై వైట్ హౌస్‌లో ట్రంప్ మీడియాతో మాట్లాడారు. పలు ఆయుధాలు ధరించిన ఓ వ్యక్తి సెక్యూరిటీ చెక్‌పాయింట్ వైపు దూసుకొచ్చాడని తెలిపారు. సీక్రెట్ సర్వీస్ సభ్యులు అతడిని అడ్డుకున్నారని చెప్పారు. ఆ దుండగుడు ఒక సీక్రెట్ సర్వీస్ ఏజెంట్‌పై కాల్పులు జరిపాడని, అయితే బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్ ధరించడం వల్ల అతను సురక్షితంగా ఉన్నాడని వివరించారు. ఆ ఏజెంట్ ప్రస్తుతం మంచి ఆరోగ్యంతో ఉన్నారని ట్రంప్ పేర్కొన్నారు. దాదాపు 50 గజాల దూరం నుంచి ఆ వ్యక్తి పరిగెత్తుకుంటూ వచ్చాడని ట్రంప్ తెలిపారు.

మంటల్లో పశ్చిమాసియా

ఆర్థిక ఒత్తిడిలో ఇరాన్..

ఓ కోడిగుడ్డు ధర రెండు లక్షల రియాల్స్



టెహ్రాన్, ఏప్రిల్ 26: యుద్ధంలో అమెరికాను గంభీరంగానే నిలువరిస్తున్నా అంతర్గతంగా మాత్రం ఆ దేశం అట్టుడుకుతోంది. ఆర్థికంగా తీవ్ర ఒత్తిళ్లను ఎదుర్కొంటోంది. అంతూపొంతూ లేని యుద్ధం, పెరుగుతున్న ధరలు, తరుగుతున్న ఆదాయం సామాన్యులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇరాన్‌లో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. బియ్యం, కోడిగుడ్లు తదితర ఆహార వస్తువుల ధరలు భారీగా పెరిగాయి. ఆహార ద్రవ్యోల్బణం 112 శాతానికి చేరుకుంది. వంటనూనెల ధరలైతే 200 శాతం పైగా పెరిగాయి. నిత్యావసరాలే కాదు, చివరికి అంత్యక్రియల ఖర్చులు కూడా 40 శాతం పెరిగాయి. అధికారిక లెక్కల ప్రకారం యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇరాన్‌లో 10 లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారు. అనధికారికంగా ఈ సంఖ్య 20 నుంచి 30 లక్షల వరకు ఉండొచ్చుని ఓ అంచనా. 1.5 కోట్ల మంది ప్రజలు ఎలాంటి ఆదాయం లేక అల్లాడుతున్నారు. ఉద్యోగాలు కోల్పోయిన వారికి ప్రభుత్వం ఇచ్చే నెలవారీ సబ్సిడీ, ఫుడ్ వోచర్లతో కనీసం 10 కిలోల బియ్యం కూడా రాని పరిస్థితి నెలకొంది. ఇరాన్ రియాల్ విలువ ఎన్నడూ లేని స్థాయిలో పడిపోయింది. ఒక డాలర్ విలువ 16 లక్షల రియాల్స్‌కు దగ్గరలో ఉంది. దీంతో పౌరుల పొదుపు ఆవిరవుతోంది. ప్రజల దగ్గర డబ్బులు లేకపోవడంతో అమ్మకాలు తగ్గి, రెస్టారెంట్లు, చిన్న వ్యాపారాలు నష్టాల్లో నడుస్తూ మూతపడుతున్నాయి. యుద్ధ సమయంలో ప్రభుత్వం పన్నులు తగ్గించడం లేదు సరికదా, రుణాలు కట్టడం ఆలస్యమైతే జరిమానాలు విధిస్తోంది. చెక్కులు బౌన్స్ అవుతున్నాయి. దీంతో బ్యాంక్‌లు చాలా ఖాతాలను మూసివేస్తున్నాయి.

ఆధునిక కరవు అంచున: ఇరాన్ మార్కెట్‌లో వస్తువులు ఉన్నాయి కానీ, వాటిని కొనే సామర్థ్యం సామాన్యుడికి లేదు. దీన్ని 'ఆధునిక కరవు'గా ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. ప్రస్తుత పరిస్థితి ఇలాగే కొనసాగితే యేడాదికి ద్రవ్యోల్బణం 80 శాతం నుంచి 500 శాతానికి పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. టెహ్రాన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ వరుసగా 8 వారాలపాటు మూతపడింది. ఇది ఆ దేశ చరిత్రలో మొదటిసారి. మార్కెట్ తెరిచినా, ప్రధాన రంగాలైన పెట్రో కెమికల్స్, స్టీల్ పరిశ్రమలు దెబ్బతినడంతో స్టాక్ ధరలు భారీగా పతనమయ్యే అవకాశం ఉంది.

జనగణనలో సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రారంభించిన మంత్రి పొన్నం

హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: జనగణనలో భాగంగా మినిస్టర్ క్వార్ట ర్స్‌లో ఆదివారం రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రారంభించారు. అధికారుల సమక్షంలో ప్రజలంతా సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. మంత్రి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా జాతీయ జనగణన ప్రారంభమైంద న్నారు. ఆదివారం తెలంగాణలోనూ ప్రారంభమైనందున ప్రతి పౌరుడు సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకోవడం వల్ల తమ కుటుంబ వివరాలు దేశజనాభా లెక్క ల్లో చూపెట్టాలన్నారు. ప్రజాస్వామ్య విధానంలో ఎవరు ఎంత ఏమిటి అన్న దానిపై జనాభా లెక్కలు 2027లో భాగంగా సెల్ఫ్ ఎన్యుమరేషన్ జాప్యం జరగకుండా తెలంగాణ దేశంలోనే పారదర్శకంగా నం.1గా ఉండేవిధంగా సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకోవాలని మంత్రి ప్రజలను కోరారు.

ఆర్టీసీ సమస్యలు పరిష్కరించినందుకు మంత్రి పొన్నంకు జెఎసి నేతల ధన్యవాదాలు

హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: రాష్ట్రంలో మూడురోజులపాటు కొనసాగిన ఆర్‌టీసీ కార్మికుల సమ్మెను పరిష్కరించిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కి ఆర్‌టీసీ జేఏసీ ధన్యావాదాలు తెలిపింది. ఆర్‌టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వం చర్చలు జరిపి చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ని సత్కరించిన జేఏసీ ధన్యవాదాలు తెలిపింది. ఆదివారం ఆర్‌టీసీ జేఏసీ నేతలు మంత్రి నివా సంలో కలిసి.. కార్మికుల చిరకాల స్వప్నం నెరవేర్చడంతో ఆర్‌టీసీని ప్రభు త్వంలో విలీనం చేయడం, కార్మికులకు గుర్తింపు సంఘాల ఎన్నికల నిర్వహణ, కార్మికులకు 11 శాతం పీఆర్‌సీ ప్రకటించడంతో హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి పొన్నం ప్రభాకర్‌కి జేఏసీ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఆర్‌టీసీ కార్మిక సంఘాల జేఏసీ నేతలు ఈదురు వెంకన్న, థామస్‌రెడ్డి, అశ్వద్ధామ రెడ్డి, హనుమంతు ముదిరాజ్‌తోపాటు ఇతర సంఘాల నేతలు మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయంతో ప్రజా రవాణాను మరింత బలపరిచేలా ఉత్సాహంతో కార్మికులు పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్‌టీసీ కార్మిక సంఘాల నేతలకు సూచించారు.

క్రీడా కోటా నిధులను పెంచండి

కేంద్రానికి మంత్రి వాకిటి శ్రీహరి వినతి

శ్రీనగర్‌లో ఖేలో ఇండియా చింతన్ శివిర్‌లో పాల్గొన్న మంత్రి

హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త : కేంద్రం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఖేలో ఇండియా కార్యక్రమం కింద తెలంగాణకు అధిక నిధులు కేటాయించాలని కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయను రాష్ట్ర క్రీడలశాఖ మంత్రి వాకిటి శ్రీహరి కోరారు. క్రీడల అభివృద్ధి కోసం కేంద్రం ఏ నిర్ణయం తీసుకున్న తెలంగాణ ప్రభుత్వం మద్దతుగా నిలుస్తుందని కేంద్రానికి తెలిపారు. ఈ మేరకు జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో మూడు రోజులపాటు జరిగిన ఖేలో ఇండియా చింతన్ శివిర్ కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఇప్పటికే క్రీడల అభివృద్ధి కోసం ప్రజా ప్రభుత్వం ప్రత్యేక పాలసీ తీసుకొచ్చి ముందుకు సాగుతుందని వివరించారు. కాగా..క్రీడల్లో భారత్‌ను ప్రపంచంలో అగ్రగామిగా నిలపాలని చింతన్ శివిర్ నిర్ణయించింది.క్రీడలకు సంబంధించి కీలక నిర్ణయాలను శివిర్‌లో తీసుకున్నారు. కేంద్ర, రాష్ట్రాల సమన్వయంతో క్రీడల అభివృద్ధికి కృషి చేయాలని సంకల్ప పత్రాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రితోపాటు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు ఏపీ జితేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ సోనీ బాలాదేవి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల భరతం పట్టేందుకు టిజిసిఎస్‌బి ఆపరేషన్ క్రాక్‌డౌన్-2

రాష్ట్రవ్యాప్తంగా వివరాల సేకరణ

హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: రాష్ట్రంలో సైబర్ నేరాలను పూర్తిగా నివారించే లక్ష్యంతో పనిచేస్తున్న తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) మరోసారి ఆపరేషన్ క్రాక్‌డౌన్ 2 పేరిట రాష్ట్ర వ్యాప్తంగా గతంలో అరెస్టయిన సైబర్ నేరగాళ్ల వివరాలను సేకరించింది. శనివారం ఉ దయం ఎనిమిది గంటల నుంచి మొదలైన ఈ ఆపరేషన్ క్రాక్‌డౌన్ 2లో టిజిసిఎస్‌బి అధికారులతో పాటు ఆయా ప్రాంతాలలోని శాంతి భద్రతల పోలీసులు పాల్గొన్నారు. రాత్రి బాగా పొద్దుపోయే వరకు సాగిన ఈ దాడుల్లో 2024 నుంచి 2025 వరకు రాష్ట్రంలో అరెస్టయిన 614 మంది గు రించి ఆరా తీశారు. వీరంతా ఇప్పుడు ఎక్కడ వున్నారు...? ఏం చేస్తున్నారు...? నేర ప్రవృత్తిని వీడారా...? లేదా అందులోనే కొనసాగుతున్నారా ...? వీరి ఆదాయ వనరులు ఏమిటీ...? కుటుంబాలను ఎలా పోషిస్తున్నారు...? ఏం ఉద్యోగాలు చేస్తున్నారు...? వీరి సహచరులు ఎవరైనా నేర ప్రవృత్తిలో వున్నారా...? అనే అంశాలపై పోలీసులు వివరాలు సేకరించారు. పోలీసుల సోదాల్లో 335 మంది నేరగాళ్ల వివరాలు మాత్రమే లభ్యమ య్యాయి.

వీరు తెలంగాణలో 480 కేసులు, దేశ వ్యాప్తంగా 1,233 కేసుల్లో నిందితులుగా వుండడంతో వీరిపై కఠిన నిఘా వుంచారు. వీరిలో 218 మంది ఎక్కడ వున్నారనేది పోలీసులు గుర్తించగా 115 మంది ఆచూకీ లభ్యం కాలేదు. వీరి కోసం గాలిస్తున్నారు. ముగ్గురు నేరగాళ్లుగానే వు న్నట్లు తేలింది. పోలీసుల తనిఖీలో ప్రసాద్ కుమార్ అనే నిందితుడు నేపాల్‌లో వుంటున్నట్లు తేలింది. గతంలో ఇతను సికింద్రాబాద్‌లో ఒక హో టల్లో పనిచేసేవాడు. కాగా 2024. 2025 మధ్య కాలంలో టిజిసిఎస్‌బి దేశ వ్యాప్తంగా 3567 మంది నేరగాళ్లను అరెస్టు చేయగా వీరిలో 614 మంది తెలంగాణకు చెందిన వారున్నారు. వీరిలో 269 మంది మ్యూల్ ఖాతాదారులు, 155 మంది ఏజెం ట్లు, 36 మంది సిఎస్‌ఎం నేరగాళ్లు. ఎనిమిది మంది సైబర్ స్లావరీ నేరగాళ్లు, ఆరుగురు నకిలీ పేర్లతో సిం కార్డులు సరఫరా చేసే డీలర్లు, ముగ్గురు కాల్ సెంటర్ ఉద్యోగులు, ముగ్గురు బ్యాంకు ఉద్యోగులు, నాన్ ఫైనాన్స్ కింద పట్టుబడ్డ వారు 134 మంది వున్నారు. సైబర్ నేరగాళ్లపై నిరంతర పర్యవేక్షణ వుంటుందని, వారిపై ఉ క్కుపాదం మోపుతూనే వుంటామని టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయల్ ఆదివారం నాడు మీడియాకు వెల్లడించారు.

దాదాసాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్‌కు తెలుగు షార్ట్‌ఫిల్మ్ ఎంపిక

హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త : తెలుగు షార్ట్ ఫిల్మ్ ది 3వ పేరు కలిగిన చిత్రం దాదాసాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్-2026కి ఎంపికైంది. ఈ ది 3వ అనే తెలుగు లఘు చిత్రం కేపీ ముని సురేష్ పిళ్ళై దర్శకత్వం వహించారు. ఈ చిత్రం న్యూటన్ మూడవ గమన నియమం నుండి ప్రేరణ పొందిన కథనం ద్వారా విద్యాపరమైన ఒత్తిడిని అన్వేషించడంలో కీలకంగా రూపుదిద్దుకుంది. తెలుగు లఘుచిత్రం ఈ నెల 30న న్యూఢిల్లీలో జరగనున్న 16వ దాదాసాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్ 2026లో అధికారికంగా ప్రదర్శన కోసం ఎంపిక అయింది. న్యూటన్ మూడవ గమన ప్రకారం ఈ చిత్రం, ర్యాంకులు మరియు పనితీరు కొలమానాల కోసం విద్యా సంస్థలు విద్యార్థులపై మోపే తీవ్రమైన విద్యా ఒత్తిడి గురించి ఆలోచింపజేసే కథనాన్ని అందిస్తుంది. ఆదర్శిని చిత్ర బ్యానర్‌పై భారతమ్మ నిర్మించిన ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్ ఆదర్శిని భారతికృష్ణ. నటీనటులు ఆదర్శిని శ్రీ, ఒబ్బు ప్రసాద్, ప్రొఫెసర్ సూరవజ్జుల రాము, పెమ్మరాజు విజయరామచంద్ర, డాక్టర్ కిరణ్ కుమార్, బాలమురళి తదితరులున్నారు. ముఖ్యంగా సురేష్ పిళ్ళై ఈ ప్రాజెక్ట్‌కు కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు, పాటలు, దర్శకత్వంతో సహా పలు సృజనాత్మక బాధ్యతలను చేపట్టారు. ఈ ప్రతిష్టాత్మక ఉత్సవానికి ది 3వ ఎంపిక కావడం, దాని బలమైన ఇతివృత్త ప్రాసంగికత, సినిమాటిక్ ఆకర్షణను నొక్కి చెబుతోందని సంస్థ ఒక పత్రికా ప్రకటనలో పేర్కొంది.

టైలరింగ్‌తో మహిళలకు ఉపాధి

ప్రతి నియోజకవర్గంలో 1,000 మందికి కుట్టుమిషన్లు 100 శాతం సబ్సిడీతో పంపిణీ

బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: రాష్ట్రంలో నైపుణ్యం కలిగిన బీసీ మహి ళలకు టైలరింగ్ ఆధారిత స్వయం ఉపాధి కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో 1000 మంది మహిళలకు 100 శాతం సబ్సిడీతో కుట్టుమిషన్లను ఇవ్వను న్నట్టు బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. టైలరింగ్ ద్వారా వారి ఉత్పాదకతను పెంచి, వారి వ్యాపార అవకా శాలను విస్తరించుకునేందుకు, స్వయం సమృద్ధిగల పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ఆటోమేటిక్ కుట్టు యంత్రాలను సరఫరా చేయాలని బీసీ సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పథకం అమలుపై బీసీ సంక్షేమ శాఖ సెక్రటరీ బాలమయాదేవి, బీసీ కార్పొరేషన్ ఎండీ మల్లయ్య బట్టుతోపాటు ఇతర అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బలహీన వర్గాల పక్షాన మహిళలకు స్వయం ఉపాధి కల్పించడానికి ప్రతి నియోజకవర్గానికి 1000 మంది మహిళలకు కుట్టు మిషన్లు 100 శాతం సబ్సిడీతో మంజూరు చేయాలని ప్రభు త్వం నిర్ణయిం చిందన్నారు. త్వరలోనే వాటికి అప్లికేషన్ తీసుకొని జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి సూచన మేరకు బలహీన వర్గాల మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగు పరచడానికి ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింద న్నారు. నియోజకవర్గానికి వెయ్యి మంది మహిళలు స్వయం ఉపాధి పెంచుకొని ఆర్థికంగా ఆసరాగా ఎదగడానికి ఉపయోగ పడుతుంద న్నారు. బలహీనవర్గాల శాఖ పక్షాన నిరుద్యో గులకు ఉపాధి అవకాశాలు పెంచడంతోపాటు, స్కిల్ డెవలప్‌మెంట్ వంటి కార్యక్రమాలు చేయడానికి శాఖ ప్రణాళికలు చేస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

ఆత్మగౌరవ పదం ఉచ్చరించడానికి కవిత అనర్హురాలు

అధికారం పోయాక బిఆర్ఎస్‌ను విమర్శించినా నమ్మరు

రాష్ట్ర మహిళా ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: మద్యం వ్యాపారంలో తలదూర్చిన కవిత ఆత్మగౌరం పదం ఉచ్చరించడానికి కూడా అనర్హురాలని పదేళ్ల బిఆర్ఎస్ పాలనలోని పాపాలను అప్పుడే ప్రశ్నించి ఉంటే కవితను తెలంగాణ ప్రజలు నమ్మేవారనీ తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. గాంధీభవన్‌లో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ దోపిడి పాలన చేసింది ఎవరో తెలంగాణ పల్లెల్లో ఎవరిని అడిగినా చెప్తారనీ ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి పాలనను రాక్షస పాలన అంటున్న కవితకు, ఎవరు రాక్షస పాలన చేశారో తెలియదా? దోచుకున్న డబ్బులో వాటా దొరక్కపోతే ఇప్పుడు వచ్చి తెలంగాణ సెంటిమెంట్ ను వాడుకుంటున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారనీ వ్యాఖ్యానించారు. పదేళ్లలో తెలంగాణను దోచుకుని సర్వనాశనం వారు చేసిన వాళ్లు, ఇప్పుడు ఆ పాపాలకు, కేసులు నమోదు అవుతుండడంతో మరోసారి ఆత్మగౌరవం, తెలంగాణ సెంటిమెంట్ వాడు కుంటు న్నారనీ ఆగ్రహం వ్యక్తంచేశారు. గతంలో మా నాన్న కంటే రేవంత్ రెడ్డి బాగా పాలన చేస్తున్నారని అన్న నీ నోటితోనే, మళ్లీ రేవంత్ రెడ్డి రాక్షస పాలన సాగిస్తున్నారని అనడం నీ విజ్ఞతకే వదిలేస్తున్నా అని అన్నారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని చెప్పే నువ్వు, తెలంగాణ ఆత్మగౌరవం గురించి మాట్లాడే హక్కు నీకు లేదు అని అన్నారు. ఇతర రాష్ట్రాల మద్యం వ్యాపా రాల్లో తలదూర్చిన మీకు ఆత్మగౌరవం ఉందా? అని ప్రశ్నించారు. ఉద్యమకారుల త్యాగాల మీద ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో, ఒకే కుటుంబానికి అన్ని పదవులు దక్కడం ఏ రకమైన సామాజిక న్యాయం? అని అడిగారు అధికారంలో ఉన్నప్పుడు నీకు సామాజిక న్యాయం గుర్తుకు రాలేదనీ విమర్శించారు.

రాష్ట్రంలో సాధారణ కార్యకర్తలకు రాని అవకాశాలు, కేవలం కల్వకుంట్ల అనే పేరున్నందుకే మీకు దక్కుతున్నాయన్నది నిజం కాదా? అని అడిగారు. ఇదేనా మీ సామాజిక న్యాయం? అని ఎద్దేవా చేశారు. మీ ప్రభుత్వం హయాంలో మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై స్పందించని నువ్వు, జాతీయ స్థాయిలో మహిళా హక్కుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందనీ అన్నారు. మీ మీద వచ్చే అవినీతి ఆరోపణలను తెలంగాణ సమాజంపై దాడిగా చిత్రీకరించడం ఆపండనీ చెప్పారు. ఆరోపణలు మీ వ్యక్తిగత వ్యాపారాలకు సంబంధిం చినవి, తెలంగాణ ప్రజలకు సంబంధించినవి కావని హితవు చెప్పారు.

కాంగ్రెస్ నేతలు హరిప్రసాద్, కృష్ణకిషోర్‌కు నోటీసులు

ఎమ్మెల్యే యశస్విని ఫిర్యాదుపై

రేవంత్‌ను విమర్శించే నైతికత కవితకు లేదు

ఆర్టీసీ కార్మికులకు అన్యాయం జరగనీయం : మల్లు రవి

ఆదివారం గాంధీభవన్‌లో మాట్లాడుతున్న పిసిసి క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి

హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: మున్సిపల్ ఎన్నికలలో పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన కాంగ్రెస్ నాయకులు హరిప్రసాద్, కృష్ణకిషోర్‌లకు నోటీ సులు జారీచేసినట్లు పిసిసి క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి తెలిపారు. ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి చేసిన ఫిర్యాదు మేరకు పిసిసి క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి ఆధ్వర్యంలో ఆదివారం గాంధీభవన్‌లో సమావేశమయ్యారు. మున్సిపల్ ఎన్నికల్లో పాలకుర్తి నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా హరిప్రసాద్, కృష్ణ కిశోర్ పని చేశారని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని, పార్టీ ఇన్‌చార్జి ఝాన్సీ రెడ్డి ఫిర్యాదు చేశారు. నోటీ సులు అందుకొన్న కృష్ణ కిషోర్ అమెరికాలో ఉన్నా నని చెప్పారనీ మల్లురవి వివరించారు, హరి ప్రసాద్ ఇంట్లో ఫంక్షన్ ఉందనీ అని లేక రాశాడనీ రవి చెప్పారు. హరి,కృష్ణ ఇద్దరు పది రోజుల్లో వివరణ ఇవ్వాలని మళ్లీ షోకాజ్ నోటీసులు ఇస్తా మనీ చెప్పారు. బాధ్యత గల పదవుల్లో ఉన్న వ్యక్తులు పార్టీకి ఇబ్బంది కలిగే విధంగా మీడియాలో మాట్లాడుతున్నారనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరికి వారే ఇష్టమొచ్చి నట్లు మాట్లాడితే పార్టీకి నష్టం జరుగుతుందని హితవు చెప్పారు. ఆ విషయాలపై సుమోటోగా చర్చించామనీ ఎవరికైనా ఇబ్బందులు కలిగితే పిసిసి అధ్యక్షుడు, ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్, ప్రభుత్వ పరంగా సిఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలనీ కోరారు.ఆర్టీసీ కార్మికుల డిమాండ్లు అన్ని పరిష్కరించాంప్రజా ప్రభుత్వంలో కార్మికులకు అన్యాయం జరగనీ యమనీ, కార్మికుడు చనిపోవడం దురదృష్ట కరమనీ ఆవేదన చెందారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కర్కోటకుడు, తెలంగాణలో హిట్లర్ పరిపాలన జరుగుతుందని కవిత అన్న వ్యాఖ్యలు ఖండిస్తు న్నామనీ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో రామరాజ్యం నడుస్తుంటే కవితకు ఏ రకంగా హిట్లర్ రాజ్యం కనిపిస్తుందనీ కవిత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై చేసిన మాటలను విత్ డ్రా చేసుకొని ప్రజల్లోకి పోవాలని హితవు చెప్పారు. కవిత మీటింగ్ కు వచ్చిన ప్రజలను అడిగితే తెలుస్తుంది కవిత పార్టీ పెట్టుకునే హక్కు ఆమెకు ఉంది. తండ్రీబిడ్డలు ఏమైనా మాట్లాడు కోవచ్చు కానీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని, కాంగ్రెస్‌ను విమర్శిం చే హక్కు కవితకు లేదన్నారు. బిఆర్ఎస్‌లో పదేళ్ళు కీలక పదవులు అనుభవిం చిందనీ, లిక్కర్ కేసులో అరెస్ట్ అయి జైలుకు పోయినప్పుడు బిఆర్ఎస్ వాళ్లు సరిగా స్పందించ లేదని, ఆమె బయటకు వచ్చిందనీ అన్నారు. పది సంవత్సరాలు అధికారం లో ఉండి మహిళలకు ఉచిత బస్ ప్రయాణం ఎందుకు కల్పించలేదనీ అడిగారు. మేము ఉచిత బస్ ప్రయాణం కల్పి స్తున్నామనీ, మీరు ముక్క బియ్యం ఇచ్చారనీ విమ ర్శించారు. మేము సన్న బియ్యం ఇస్తున్నామనీ మీ క్యాబినెట్ లో మహిళలకు ఎందుకు చోటు కల్పించలేదని మీ తండ్రిని ఎందుకు ప్రశ్నించలేదని అడి గారు. మీరు అధికారంలోకి వచ్చాక తెలంగాణను 50 యేళ్లు వెనక్కి తీసుకపోయారని ఆవేదన చెందారు.

తెలంగాణ సారస్వత పరిషత్తు సాహిత్య పురస్కారాలు

హైదరాబాద్ (నాంపల్లి), ఏప్రిల్ 26, ప్రభాతవార్త : ఉభయ తెలుగు రాష్ట్రాలల్లో బాలసాహిత్య వికాసానికి రచయితలుగా, ఉపాధ్యాయులుగా విశేషకృషిచేస్తున్న ఇరు రాష్ట్రాలకు చెందిన 20మందికి తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రతిష్ఠాత్మక బాలసాహిత్యమూర్తి, బాలసాహితీ మిత్ర పురస్కారాలు ప్రకటించింది.

బాలసాహితీ మూర్తి పురస్కారాలకు ఎంపికైన బాలసాహితీ వేత్తలు : డా. వి.ఆర్.శర్మ, యు.విజయ శేఖర్ రెడ్డి, ఎడ్ల లక్ష్మి, ఎం.కృష్ణకుమారి, జొన్నలగడ్డ శ్యామల, ఒట్ర ప్రకాశరావు, డా. కె.నారాయణ మూర్తి, డా. జి.సతీష్‌కుమార్, ఎస్. హనుమంత రావు; బాలసాహితీమిత్ర పురస్కారాలు : ఈ.రాఘవేంద్ర, డా. చిట్యాల దేవేంద్రప్ప, బైతి దుర్గయ్య, కోకిల నాగరాజు, ఉండ్రాళ్ల రాజేశం, డా. ఎన్. కిట్టన్న, గుండ్లరాజు, పెరుమాళ్ల ఆనంద్, డా. పొట్టబత్తుల రామకృష్ణ, పసుపులేని నీలిమ, సబ్బతి సుమిత్రాదేవిలు ఉన్నారు. బాలసాహిత్య కృషిని దృష్టిలో పెట్టుకుని ఈ ఎంపిక జరిగినట్లు, వచ్చే నెల 4న తెలంగాణ సారస్వత పరిషత్తులో ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగే సమ్మేళనంలో పద్మ భూషణ్ డా. కె.ఐ.వరప్రసాదరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని పురస్కారాలు, పురస్కారంకింద ఒక్కొక్కరికి 5వేల రూపాయల నగదు, జ్ఞాపిక, శాలువాతో ఘనంగా సత్కరిస్తారని పరిషత్తు కార్యదర్శి డా. జె.చెన్నయ్య ఈ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ సారస్వత పరిషత్తు కథలపోటీ ఫలితాలు : తెలంగాణ సారస్వత పరిషత్తు పెద్దలకోసం నిర్వహించిన పిల్లల కథల పోటీ ఫలితాలు ప్రకటించారు.

ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి 180 కథలు పోటీకి రాగా న్యాయనిర్ణేతలు వాటిని పరిశీలించి ఇరురాష్ట్రాలకు చెందినవారి 10 కథలను బహుమతి ఎంపిక చేసినట్లు పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జె.చెన్నయ్య తెలిపారు. బహుమతికి ఎంపికైన వారిలో : బి.వి.పట్నాయక్, తమ్మవరపు వెంకటసాయి సుచిత్ర, కోనే నాగవెంకట ఆంజనేయులు, కె.వి.లక్ష్మణరావు, జె.శ్యామల, అనిశెట్టి సతీష్‌కుమార్, జీ.వి. శ్రీనివాస్‌లు రాసిన కథలు ఉన్నాయి. విజేతలకు బహుమతి కింద వెయ్యిరూపాయల నగదు, ప్రశంసాపత్రం, కథ ప్రచురించిన పుస్తకం పంపిస్తామని వివరించారు. వీటితోపాటు మరో 60 కథలు సాధారణ ప్రచురణకు ఎంపిక య్యాయని, వాటినీ సంకలనంగా ప్రచురించి వచ్చేనెల నాలుగవ తేదీన జరిగే బాలసాహిత్య సమ్మేళనంలో బహుమతుల ప్రదానంతోపాటు ప్రచురణలు ఆవిష్కరింపచడం జరుగుతుందని చెన్నయ్య వెల్లడించారు.

ప్రజాచైతన్యస్ఫూర్తి కె.వి.రమణాచారి

ప్రముఖ సాహితీవేత్త డా. వల్లూరి శ్రీరామచంద్రమూర్తి ప్రశంస

రమణాచారికి నండూరి రామకృష్ణమాచార్య పురస్కారం ప్రదానం



నండూరి రామకృష్ణమాచార్య స్మారక పురస్కారంతో కె.వి.రమణాచారిని సత్కరిస్తున్న శ్రీరామచంద్రమూర్తి, ఫణీంద్ర, వి.విజయకుమార్, అనంతపద్మనాభరావు తదితరులు

హైదరాబాద్ (నాంపల్లి), ఏప్రిల్ 26, ప్రభాతవార్త : మచ్చలేని మహా వ్యక్తిత్వమున్న పరిపాలనాధికారి, మనసున్న ఐఏఎస్ అధికారి, సాహితీ సాంస్కృతికబంధు డా. కె.వి.రమణాచారి అని సుప్రసిద్ధ సాహితీవేత్త డా. వల్లూరి శ్రీరామచంద్రమూర్తి అన్నారు. ఐఏఎస్ అధికారిగా స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన అనంతరం కూడా ఒక క్యాంపు కార్యాలయాన్ని ఏర్పాటుచేసి ప్రజల్లో చైతన్యం తీసుకొస్తూ ఏకకాలంలో ప్రజల నుండి చైతన్యాన్ని పొందడం విశేషమని ప్రశంసించారు. నండూరి రామకృష్ణమాచార్య సాహిత్యపీఠం, నవ్య సాహితీ సమితి సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖకవి డా. ఆచార్య ఫణీంద్ర సభాధ్యక్షతన ఆదివారం రాత్రి శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయంలోని రావిచెట్టు రంగారావు కళావేదికలో మహాకవి డా. నండూరి రామకృష్ణమాచార్య 106వ జయంతి ఉత్సవం నేత్రపర్వంగా జరిగింది. సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్ సభకు స్వాగతం పలికి కార్యక్రమ నేపథ్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వల్లూరి శ్రీరామచంద్రమూర్తి గౌరవ అతిథులు దూరదర్శన్ పూర్వ అదనపు డైరెక్టర్ జనరల్ డా. రేవూరి అనంత పద్మనాభరావు, తెలంగాణ రాష్ట్ర ఖజానా, లెక్కలశాఖ డిప్యూటీ డైరెక్టర్ జి.వసుంధర, ఆత్మకూరి గాంధీ, ఆచార్య టి.గౌరీశంకర్, వి.విజయకుమార్ తదితరులతో కలిసి డా. నండూరి రామకృష్ణమాచార్య చిత్రపటానికి పూల మాలవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనం తరం డా. కె.వి. రమణాచారిని ఘనంగా సత్కరించి నండూరి రామకృష్ణమాచార్య స్మారక పురస్కారం ప్రదానంచేశారు. ఆంధ్ర సాహిత్యానికి మూలపురుషుడు, గొప్ప ప్రతిభామూర్తి, ఎవరికీ తలవంచని ధీశాలి, నండూరి రామచృష్ణమాచార్య అని కొనియాడారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారంపై చరిత్రాత్మక నిర్ణయం

మంత్రి వివేక్ వెంకటస్వామికి జెఎసి నేతల కృతజ్ఞతలు

హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: ఆర్‌టిసి కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటోందని గుర్తింపు కార్మిక సంఘం ఏర్పాటు కోసం త్వరలోనే ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర కార్మిక, ఉపాధి గనుల శాఖ మంత్రి డా. జి వివేక్ వెంకటస్వామి తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్న నేపథ్యంలో, ఆర్టీసీ జెఎసి నేతలు రాష్ట్ర కార్మిక, ఉపాధి గనుల శాఖ మంత్రి డా. జి వివేక్ వెంకట స్వామి ఆదివారం నివాసంలో కలిసి సత్కరించి తమ కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాల ద్వారా ప్రజా రవాణా వ్యవస్థ మరింత బలపడుతుందని, అదే ఉత్సాహంతో కార్మికులు సేవలు అందించాలని సూచించారు. ఆర్‌టిసిని ప్రభు త్వంలో విలీనం చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల చిరకాల స్వప్నాన్ని నెరవేర్చిందని అన్నారు. అలాగే గుర్తింపు సంఘాల ఎన్నికల నిర్వ హణ, ఆర్టీసీ కార్మికులకు 11 శాతం పిఆర్‌సి ప్రకటించడం వంటి కీలక నిర్ణయాలపై హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు వెంకన్న, థామస్‌రెడ్డి, అశ్వద్ధామ రెడ్డి, హనుమంతు ముదిరాజ్ తదితరులు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

మహిళలకు నాలుగు సోలార్ పవర్ ప్లాంట్లు

ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లో పైలట్ కార్యక్రమం

హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకం కింద సౌర విద్యుత్ ప్రాజెక్టులను ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని మహిళలు యూనిగా ఏర్పడి సూక్ష్మ పరిశ్రమల నుండి మెగావాట్ స్థాయి వెంచర్ల వైపు అడుగులు వేయడానికి సిద్ధమవుతున్నాయి. రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించిన పైలట్ కార్యక్రమం కింద, ఖమ్మం జిల్లాలోని ఎర్రపాలెం, కల్లూరు మండలాల్లోను, కొత్తగూడెం జిల్లాలోని మనుగూరు, సుజాతనగర్ మండలాల్లో ఒక్కొక్కటి 1 మెగావాట్ సామర్థ్యం గల నాలుగు సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నారు. ప్రతి ప్లాంటు కోసం నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి కేటాయించారు. ప్రతి 1 మెగావాట్ యూనిట్ రోజుకు సుమారు 4,500 యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తుందని అంచనా. ఈ విద్యుత్‌ను యూనిట్‌కు రూ.3.13 అందిస్తుండటంతో, రోజువారీ ఆదాయం రూ.14,095గా అంచనా వేయబడింది, దీని ద్వారా మహిళలకు నెలకు సుమారు రూ.1,00,020 ఆదాయం లభిస్తుందని అధికారవర్గాలు వెల్లడించాయి. ఆర్థిక నమూనా ప్రకారం, ప్రాజెక్ట్ వ్యయంలో 20 శాతం నిధులను బ్యాంకు రుణాల ద్వారా సమకూరుస్తారు. రుణాల చెల్లింపుల తర్వాత, ఈ మహిళలకు నెలకు సుమారుగా రూ.47,020 నికర ఆదాయాన్ని ఆర్జించగలవని అంచనా. 25 సంవత్సరాల ఒప్పంద కాలంలో 12 సంవత్సరాలలోపు రుణాలను తీర్చేయడం ద్వారా, మిగిలిన 13 సంవత్సరాల పాటు గ్రూపులు పూర్తి లాభాలను ఆర్జించగలవని విద్యుత్ శాఖ వర్గాలు భావిస్తున్నాయి. కాగా ఎర్రపాలెం మండలం, రాజాపాలెం గ్రామంలో మహిళల నిర్వహణలో ఒక ప్లాంటు నిర్మాణం పూర్తి కావస్తోంది. నాలుగు ఎకరాల్లో రూ.2.9 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ప్రాజెక్టుకు 90 శాతం బ్యాంకు రుణాలు, 10 శాతం బృందాల వాటాతో నిధులు సమకూర్చు తున్నారు. త్వరలోనే విద్యుత్ ఉత్పత్తి ప్రారంభమవుతుందని అధికారులు చెబుతున్నారు. ఇక కల్లూరు మండలం చిన్నకోరుకొండి గ్రామంలో పనులు కొనసాగుతున్నాయని, మణుగూరు, సుజాతనగర్ మండలాల్లో త్వరలో నిర్మాణాలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

దిగివస్తున్న చికెన్ ధరలు

హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: ఇటీవల భారీగా పెరిగిన చికెన్ ధరలు ప్రస్తుతం దిగివస్తున్నాయి. గత మార్చిలో ఏకంగా కిలో చికెన్ ధర 400 వరకు పెరగ్గా కొద్ది రోజులుగా తగ్గుముఖం పడుతున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో చికెన్ ధరలు భారీగా పడిపోయాయి. తెలంగాణలో ఆదివారం లైవ్ బర్డ్ ఫామ్ ధర కెజి రూ.105గా నమోదైంది. ఇక రిటైల్ ధర రూ.132కు పడిపోయింది. గత వారంతో పోలిస్తే చికెన్ ధర కిలోకు రూ.40 వరకు ధర తగ్గింది. కొంతకాలంగా మండిపోతున్న చికెన్ ధరలతో బెంబేలెత్తిన సామాన్యులు ధరలు తగ్గడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇక డ్రెస్సెడ్ చికెన్ ధర కిలోకు రూ. 191 నుంచి రూ. 220 మధ్యన ఉండగా..స్కిన్‌లెస్ చికెన్ ధర కిలోకు రూ. 218 నుంచి రూ. 230 వరకు ఉంది. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో కిలో చికెన్ ధర రూ. 260 నుంచి రూ. 280 వరకు పలుకుతోంది. అయితే చికెన్ ధరలు సామాన్యుడికి అందుబాటులోకి వచ్చినప్పటికీ, మటన్ ధర మాత్రం దిగిరావడం లేదు. ప్రాంతాన్ని బట్టి మార్కెట్‌లో కిలో మటన్ ధర రూ. 900 నుంచి రూ. 1000 వరకు పలుకుతోంది. ఇకపోతే రిటైల్ మార్కెట్‌లో డజను గుడ్ల ధర రూ. 72గా నమోదైంది. అయితే రాష్ట్రాల్లో ఎండల తీవ్రత అంతకంతకూ పెరుగుతున్న నేపథ్యంలో కోళ్ల పెంపకం, వినియోగంపై ఆ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోందని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా రాబోయే రోజుల్లోనూ చికెన్ ధరలు మున్ముందు కూడా తక్కువగానే, ఇదే తరహాలో కొనసాగే అవకాశం ఉందని కోళ్ల ఫామ్ వ్యాపార నిపుణులు అంచనా వేస్తున్నారు.

రేవంత్‌రెడ్డి హిట్లర్ కాదు.. హిస్టరీ మేకర్

మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేఖ

హైదరాబాద్ ఏప్రిల్ 26, ప్రభాతవార్త : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై టిఆర్ఎస్ నేత కల్వకుంట్ల కవిత చేసిన విమర్శలకు తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు డాక్టర్ రేఖ బోయలపల్లి ఘాటుగా స్పందించారు. రేవంత్‌రెడ్డి హిట్లర్ కాదని,స్థానిక ఎన్నికల్లో 42 బీసీ రిజర్వేషన్ ఇచ్చి ప్రజల కోసం పనిచేస్తున్న హిస్టరీ మేకర్ అని ఆమె పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్దపీట వేయడం జరిగిందన్నారు. వ్యవసాయానికి ఎకరాకు రూ.12వేల చొప్పున రూ.24వేల కోట్లకు పైగా రైతు భరోసా పథకానికి,మహాలక్ష్మి పథకానికి రూ.4,305 కోట్లు, మహిళా శక్తి మిషన్‌కు రూ.2,500 కోట్లు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌కు రూ.3,683 కోట్లు,విద్యా రంగానికి రూ.26,674 కోట్లు, మహిళా యూనివర్సిటీకి రూ.400 కోట్లు,సేఫ్ సిటీ ప్రాజెక్ట్‌కు రూ.100 కోట్లు కాంగ్రెస్ సర్కార్ కేటాయించిందని పేర్కొన్నారు.

రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.57,000 కోట్ల వడ్డీ లేని రుణాలు,ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ద్వారా నాణ్యమైన విద్య ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఇవి నియంతృత్వ పాలన లక్షణాలు కాదని,ప్రజా పాలనకు నిదర్శనం అని ఆమె పేర్కొన్నారు. తెలంగాణ సమాజం చైతన్యవంతమైందని, ప్రజలు మాటలు కాదని,మార్పు చూస్తున్నారని, సంక్షేమం-అభివృద్ధితో తెలంగాణ కొత్త దిశగా సాగుతోందని రేఖా గుర్తు చేశారు.

ఎస్సీ, ఎస్టీ యువతకు బ్యాంకు పరీక్షలకు శిక్షణ

దరఖాస్తులకు 28 చివరి తేదీ

హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త : సంక్షేమ వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతకు వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తున్న గిరిజన సంక్షేమ శాఖ ఇప్పుడు మరో గుడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్రంలోని బ్యాంకింగ్ రంగంలో స్థిరపడాలని ఆశించే సాంఘిక, గిరిజన వర్గాల యువతకు ఇన్స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ (ఐబీపీఎస్) పరీక్షలకు గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. దేశంలోని వివిధ బ్యాంకులు, ఆర్థిక సంస్థలలో సిబ్బందిని అంచనా వేయడానికి, ఎంపిక చేయడానికి, నియమించడానికి స్థాపించబడిన ఒక స్వయం ప్రతిపత్తి గల సంస్థ అయిన ఇన్స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ ప్రధానంగా పిఒ, క్లర్క్, స్పెషలిస్ట్ ఆఫీసర్ పదవుల కోసం పరీక్షలను నిర్వహిస్తుంది. ఈ నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ వర్గాల యువతకు బ్యాంకింగ్ రంగంలో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు దీనికి సంబంధించి గిరిజన సంక్షేమశాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం డిగ్రీలో మెరిట్ ఆధారంగా ఎస్టీలకు 75 శాతం, ఎస్సీలకు 15 శాతం, బీసీలకు 10 శాతం చొప్పున మొత్తం 100 మంది అభ్యర్థులను ఎంపిక చేసి శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపింది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 28వ తేదీలోగా వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని గిరిజన సంక్షేమ శాఖ పేర్కొంది

జనగణనను విజయవంతం చేయండి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు

హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: జనగణన-2027లో భాగంగా స్వీయ జనగణనలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తన వివరాలు నమోదు చేసుకున్నారు. ఆదివారం ఉదయం తన నివాసంలో ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా స్వీయ గణనను పూర్తి చేసిన రాష్ట్రంలో కొనసాగుతున్న సెన్సస్ ఆఫ్ ఇండియా-2027 కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతీ ఒక్కరు తమ వివరాలను నమోదు చేసుకుని జనగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్య దర్శి దాన కిషోర్, సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టర్ భారతి హోలికేరి, జీహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ ఆల ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన హరిచందన, ప్రియాంక

కార్మిక ఉపాధి, శిక్షణాశాఖ కార్యదర్శిగా దాసరి హరిచందన ఆదివారం సచివాలయంలోని తమ విభాగాల్లో బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర విపత్తులశాఖ కార్యదర్శిగా కూడా హరిచందన అదనపు భాధ్యతలను స్వీకరించారు. కాగా, హైదరాబాద్ కలెక్టర్‌గా ఆల ప్రియాంక బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం వారు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆస్పత్రిలో దుశర్ల సత్యనారాయణను పరామర్శించిన మంత్రి కొండా సురేఖ

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 26: ప్రముఖ పర్యావరణవేత్త, జలసాధన సమితి వ్యవస్థాపకుడు దుశర్ల సత్యనారాయణపై జరిగిన దాడిని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ తీవ్రంగా ఖండించారు. ఇది మానవత్వంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. దాడిలో తీవ్రంగా గాయపడి నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సత్యనారాయణను ఆమె పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, సత్యనారాయణ గాయపడిన శరీరం విధ్వంసానికి గురైన అడవిలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణకు, నీటి హక్కులకు జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తిపై దాడి చేయడం మానవ మనుగడపై దాడి చేయడంతో సమానమని అన్నారు. నల్గొండ జిల్లాలో ఫ్లోరోసిస్ సమస్యపై సత్యనారాయణ చేసిన పోరాటాన్ని మంత్రి గుర్తు చేసుకున్నారు. పాదయాత్రలతో ఢిల్లీ వరకు వెళ్లి, అప్పటి ప్రధాని వాజ్‌పేయికి సమస్య తీవ్రతను వివరించారని కొనియాడారు. దాడికి పాల్పడిన వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నల్గొండ ఎస్పీ నరసింహను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. సత్యనారాయణకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన సృష్టించిన 70 ఎకరాల అడవి పరిరక్షణకు వన మహోత్సవం నిధుల నుంచి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ సత్యనారాయణను స్ఫూర్తిగా తీసుకుని, ప్రత్యేక సందర్భాల్లో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు.

హోటల్‌లో మహిళ హత్య

హైదరాబాద్ (శేరిలింగంపల్లి), ఏప్రిల్ 26, ప్రభాతవార్త: చందానగర్‌లో దారుణం చోటుచేసుకుంది. ఓ హోటల్‌లో మహిళను హత్యచేసి ఓ దుండగుడు పరారయ్యాడు. ఈ ఘటనకు సంబందించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. చందానగర్‌లోని నైట్ ఐ హోటల్‌లో మహిళను ఓ గుర్తుతెలియని వ్యక్తి మహిళను హత్యచేసి పరారయ్యాడు. మృతురాలు సంగారెడ్డిజిల్లా ఇంద్రేశం గ్రామానికి చెందిన నరసమ్మగా పోలీసులు గుర్తించారు. కాగా అక్రమ సంబంధమే హత్యకు కారణమని పోలీసులు భావిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం రెండుగంటల సమయంలో హోటల్‌కు మహిళతో పాటు గుర్తుతెలియని వ్యక్తి చేరుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత ఆ వ్యక్తి హోటల్ నుంచి వెళ్లిపోయాడని సిబ్బంది చెబుతున్నారు. ఎంతసేపటికి మహిళ బయటికి రాకపోవడంతో అనుమానంతో గది తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా అక్కడ మహిళ నరసమ్మ విగత జీవిగా పడిఉందని సిబ్బంది తెలిపారు. మహిళను మెడ భాగంలో చున్నీతో బిగించి హత్యచేసి సాయంత్రం హోటల్ నుంచి దుండగుడు పరారయ్యాడని పోలీసులు తెలిపారు. హోటల్ సిబ్బంది సమాచారంతో సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సీసీటీవీ కెమారాల ఆధారంగా నిందితుడిని గుర్తించిన పోలీసులు అతడి ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నరసమ్మ (ఫైల్)

ఆహార భద్రతలో వెటర్నరీల పాత్ర అమూల్యం

ప్రపంచ వెటర్నరీ దినోత్సవంలో వక్తలు

హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: ప్రజారోగ్యం, ఆహార భద్రతను కాపాడడంలో వెటర్నరి వైద్యుల సేవలు వెలకట్టలేనివని ప్రముఖులు కొనియాడారు. రాజేంద్రనగర్‌లోని కాలెజ్ ఆఫ్ వెటర్నరి సైన్స్‌లో పౌల్ట్రీ సైన్స్ విభాగం, ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్మెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్-పౌల్ట్రీ ఇండియా ఆధ్వర్యంలో ప్రపంచ వెటర్నరీ దినోత్సవం 2026 వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. వెటర్నిరిలు - ఆహారం, ఆరోగ్య రక్షకులు అనే నినాదంతో నిర్వహించిన ఈ సదస్సులో విసి జ్ఞాన ప్రకాశ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజ ఆరోగ్య సంరక్షణలో పశువైద్యుల పాత్ర ముఖ్యమైనదన్నారు. డాక్టర్ ఎం. ఉదయ కుమార్ మాట్లాడుతూ... పెరుగుతున్న జనాభాకు పోషకాహార భద్రత కల్పించడంలో ఈ రంగం ముందంజలో ఉందన్నారు. పరిశ్రమ - విద్యాసంస్థల మధ్య సమన్వయం అవసరమన్నారు. పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్ సింగ్ బాయాస్ మాట్లాడుతూ... విద్యాసంస్థలు, పౌల్ట్రీ పరిశ్రమల మధ్య బంధం మరింత బలపడాలని ఆకాంక్షి ంచారు. పౌల్ట్రీ ఉత్పత్తులు, జీవనశైలి వ్యాధులు, అపోహలు వాస్తవాలు అనే అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం జరిగిన సాంకేతిక సదస్సులో డా. ముజీబ్ అతర్, డా. శ్రీనివాస్ రామరాజు వంటి నిపుణులు పౌల్ట్రీరంగంలో ఉన్న అపారమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలను వివ రించారు. డా. ఆర్.ఎం.వి. ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు, పరిశ్రమ నిపుణులు, పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

టీఎంసి హయాంలో మహిళకు రక్షణ లేదు

బెంగాల్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోడీ



బంగావ్(బెంగాల్), ఏప్రిల్ 26: తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నంతకాలం పశ్చిమబెంగాల్ లో మహిళలకు రక్షణ ఉండదని ప్రధాని నరేంద్ర మోడీ ఆరోపించారు. స్త్రీలను హింసించే గూండాలకు ఆ పార్టీ అండగా నిలుస్తోందని విమర్శించారు. అందుకే రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారని ప్రధాని వ్యాఖ్యానించారు. ఈసారి ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే మహా జంగిల్ రాజ్ నుంచి రక్షణ కల్పిస్తామని చెప్పారు. మహిళల రక్షణ గురించి తాము ఆలోచిస్తాం కాబట్టే ఆర్జీకర్ మృతురాలి తల్లికి తమ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల టికెట్ ఇచ్చామని చెప్పారు. బెంగాల్‌లో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలపై దారుణాలకు పాల్పడిన నిందితులను న్యాయస్థానం ముందు నిలబెడతామని అన్నారు. బంగావ్‌లో జరిగిన ఒక ఎన్నికల సభలో ప్రధాని వెల్లడించారు. రాష్ట్రంలో తరచుగా బాలికలు అదృశ్యమవుతున్నకేసులు నమోదు అవుతున్నాయని మోడీగుర్తుచేశారు. అయినా టీఎంసీ ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకుండా నిద్రపోతోందని మండిపడ్డారు. మహిళలతోపాటు రైతులు, కార్మికుల సంక్షేమం కోసం కేంద్రంలో బీజేపీ కృషి చేస్తోందని అన్నారు. గడిచిన 11 ఏళ్లలో జనపనార కనీస మద్దతు ధరలను రెట్టింపు చేసిందని అన్నారు. గోధుమలు, బియ్యం కోసం 100 శాతం జనపనార ప్యాకేజింగ్‌ను తప్పనిసరి చేశామని చెప్పారు. హుగ్లీ నది పరిసరాల్లో ఒకప్పుడు మిల్లులు, ఫ్యాక్టరీలు అధికంగా ఉండేవన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వాటన్నిటినీ మూసివేసిందని ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే వాటిని తిరిగి తెరిపిస్తామని చెప్పారు. చొరబాటుదారుల నుంచి బెంగాల్‌కు విముక్తి కల్పిస్తామని హామీ ఇచ్చారు. బెంగాల్ అభివృద్ధి చెందాలంటే తాము అధికారం చేపట్టాల్సిందేనని అన్నారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి పూర్తి అనుకూల పవనాలు వీస్తున్నాయని ప్రధానమంత్రి అన్నారు. తొలి విడత పోలింగ్‌లో భారీ ఓటింగ్‌తో టీఎంసీకి గట్టి దెబ్బ తగిలిందని, తుది విడత ముగిసేసరికి బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. తొలి విడత పోలింగ్‌లో టీఎంసీ అహంకారం ముక్కలైంది. రెండో దశలో బీజేపీకి కీలక విజయం దక్కనుందని చెప్పారు. టీఎంసీ హయాంలో చిన్నస్థాయి నేతలు, గూండాలు సైతం అధికారం తమదే అన్నట్టు వ్యవహరించడంతో పాలన గాడితప్పిందని, జవాబుదారీతనం లోపించిందని మోదీ విమర్శించారు. మా, మాటీ, మానుష్ నినాదంతో టీఎంసీ ఎంతోకాలం నమ్మించలేదని, ఈ మూడు విషయాల్లోనూ ప్రభుత్వం విఫలమైందన్నారు. తల్లులు అనేక బాధలకు గురయితే, భూములు దుర్వినియోగమయ్యాయని, ప్రజలు గత్యంతరం లేక వలసబాటలు పట్టారని విమర్శించారు. రైతుల సంక్షేమానికి బీజేపీ అధిక ప్రాధాన్యం ఇస్తోందని, రైతులు, కూలీల ఆందోళనలను తాము అర్థం చేసుకున్నామని చెప్పారు.

మన జనాభా.. మన లెక్కింపులో పాల్గొనండి

గవర్నర్ శివప్రతాప్ శుక్లా



ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 26: జనగణన-2027 కోసం స్వీయనమోదు కార్యక్రమం తెలంగాణలో ఆదివారం ప్రారంభమైంది. రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆన్‌లైన్ స్వీయ నమోదు ద్వారా తన వివరాలను నమోదు చేసి, తెలంగాణలో జనగణన-2027 కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. అనంతరం తెలంగాణ ప్రజలను ఉద్దేశించి గవర్నర్ మాట్లాడారు. జనాభా గణన అనేది ఒక కీలకమైన జాతీయ కార్యక్రమం. ఇది మన జనాభా , వారి సామాజిక ఆర్థిక స్థితిపై సమగ్రమైన చిత్రాన్ని అందిస్తుందని చెప్పారు. జనాభా గణన ప్రణాళిక, సుపరిపాలన, వనరుల సమాన పంపిణీకి పునాది. తద్వారా అభివృద్ధి ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరేలా నిర్ధారిస్తుందన్నారు. విద్య, ఆరోగ్యం, ఉపాధి, గృహనిర్మాణం, మౌలిక సదుపాయాలకు సంబంధించిన విధానాలను రూపొందించడంలో జనాభా గణన పోషించే కీలక పాత్రలో దాని ప్రాముఖ్యత ఇమిడి ఉందన్నారు. కచ్చితమైన సమాచారం, లక్షి త సంక్షేమ పథకాలను రూపొందించడానికి, జాతీయ పురోగతిని సమర్థవంతంగా అంచనా వేయడానికి ప్రభుత్వానికి వీలు కల్పిస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇదే మొదటి జనాభా గణన కావడం వల్ల ఇది ప్రత్యేకంగా ప్రాముఖ్యతను సంతరిం చుకుంది. రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధి , పురోగతికి కచ్చితమైన సమాచార సేకరణ చాలా కీలకం అని చెప్పారు. తెలంగాణలో స్వీయగణన దశ ఏప్రిల్ 26, 2026 నుండి మే 10, 2026 వరకు నిర్వహిస్తారని, దీని తరువాత, మే 11, 2026 నుండి జూన్ 9, 2026 వరకు గృహ జాబితా కార్యకలాపాలు నిర్వహిస్తారని తెలిపారు. ఇది భారతదేశపు మొట్టమొదటి పూర్తి డిజిటల్ జనాభా గణన అవుతుంది.

స్వీయ గణన అనేది ఒక నూతనమైన, ప్రగతిశీలమైన వ్యవస్థ. దీని ద్వారా కుటుంబాలు తమ వివరాలను డిజిటల్‌గా నమోదు చేసుకోవచ్చు అని చెప్పారు. ఈ ప్రక్రియ సరళమైనది, సౌకర్యవంతమైనది, వినియోగదా రులకు అనుకూలమైనది. ఇళ్ల జాబితా కూడా డిజిటల్‌గా నిర్వహించబడుతుంది, తద్వారా కచ్చితత్వం, పారదర్శకత, సమర్థతకు హామీ లభిస్తుందని చెప్పారు. నేను స్వయంగా స్వయం గణన ప్రక్రియను మొదటి రోజు పూర్తి చేశాను. ఈ ప్రక్రియ అత్యంత సరళంగా, సమర్థవంతంగా ఉందన్నారు. తెలంగాణ పౌరులందరూ ఈ ముఖ్యమైన కార్యక్రమంలో చురుకుగా పాల్గొని, కచ్చితమైన , స్పష్టమైన సమాచారాన్ని అందించడం ద్వారా జనగణన సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని కోరుతున్నాను. మీ భాగస్వామ్యం బలమైన, సమ్మిళితమైన, సువ్యవస్థితమైన తెలంగాణ, భారతదేశ నిర్మాణానికి గణనీయంగా దోహదపడుతుందని రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా తన సందేశాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సెన్సస్ డైరెక్టర్ శ్రీమతి భారతీ హోళికేరి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్, గవర్నర్ సంయుక్త కార్యదర్శి కె శశి కిరణా చారి తదితరులు పాల్గొన్నారు.

జనాభా లెక్కల నమోదులో మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 26: కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జనాభా లెక్కల నమోదు కార్యక్రమంలో రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ లోని తన నివాసానికి వచ్చిన అధికారులకు తన, కుటుంబ సభ్యుల వివరాలను ఆయన అందజేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వాన్, డిప్యూటీ కమిషనర్ ఎన్ శంకర్ తదితర అధికారుల బృందం గుత్తా సుఖేందర్ రెడ్డి వివరాలను, వారి కుటుంబ సభ్యుల వివరాలను ఆన్లైన్ లో నమోదు చేశారు. ఈ సందర్భంగా మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి పౌరుడు విధిగా జనాభా లెక్కల నమోదు కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

వివరాలను నమోదు చేయడం వలన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సహకరించిన వాళ్ళం అవుతామని తెలిపారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఆన్లైన్ ద్వారా నేరుగా తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని, అలాంటి అవకాశం లేని వారి ఇంటికి అధికారులు వచ్చి వివరాలు సేకరిస్తారని తెలిపారు. అధికారులు తమ కర్తవ్యాన్ని బాధ్యతయుతంగా నిర్వహించి, 2027 జనాభా లెక్కల నమోదు కార్యక్రమాన్ని సక్సెస్ చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మోహన్ రావు, శ్రీనివాస్, రవీందర్ బాబు, శ్రావణ్ కుమార్, రమేష్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

లోక కల్యాణస్ఫూర్తి వాసవీ మాత

ప్రభుత్వ నిర్వహణలో ఘనంగా జయంతి వేడుకలు

హైదరాబాద్ (రవీంద్రభారతి), ఏప్రిల్ 26, ప్రభాతవార్త : లోకకళ్యాణం కోసమే ఉద్భవించిన జగత్‌జనని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారని, పార్వతీదేవి వంశ అయిన అమ్మవారు కేవలం ఆర్యవైశ్యులకేకాదు విశ్వమంతటికీ తల్లేనని, అమ్మవారి ఆశీస్సులందరికీ ఉండాలని తెలంగాణ శాసనమండలి సభ్యుడు బొగ్గరపు దయానంద్ అన్నారు. ఆర్య వైశ్యుల సాంస్కృతిక వారసత్వం, భక్తుల భావాలను గౌరవిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శ్రీవాసవిమాత జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించినందుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ, తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ఆదివారం సాయంత్రం ప్రభుత్వపరంగా జరిగిన శ్రీవాసవీమాత జయంతి ఉత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బి.దయానంద్, సభాధ్యక్షురాలు ఆర్యవైశ్య కార్పొరేషన్ అధ్యక్షురాలు కాల్వ సుజాత, విశిష్ట అతిథులు ప్రభుత్వ ప్రత్యే క ప్రధాన కార్యదర్శి వాణిప్రసాద్, కాచం సత్యనారాయణ గుప్త, ఉప్పల శ్రీనివాస గుప్త, భాషా సాంస్కృతిక శాఖ సంచా లకుడు డా. ఏనుగు నర సింహారెడ్డి, గోపాలకృష్ణ, శివకుమార్ గుప్తా, శ్రీరామ్ గుప్తా తదితరులతో వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మ వారికి పూలమాల వేసి, జ్యోతిప్రకాసనం చేసి ఉత్స వాన్ని ప్రారంభించి ప్రభుత్వ చరిత్రాత్మక నిర్ణయానికి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం ఆర్యవైశ్య సమాజానికి గర్వకారణం మాత్రమే కాకుండా శ్రీ కన్యకాపరమేశ్వరిదేవి ప్రేరణతో వచ్చిన సంప్ర దాయ వారసత్వం, భక్తి విలువలు, సామాజిక సేవకు ప్రభుత్వమిచ్చిన గౌరవంగా నిలుస్తుందన్నారు.

శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి పూలమాలవేసి స్మరిస్తున్న దయానంద్, వాణిప్రసాద్, నరసింహారెడ్డి, సుజాత, శ్రీనివాస్‌గుప్త, కాచం శ్రీనివాసగుప్త తదితరులు

ఐ అండ్ పిఆర్ ప్రత్యేక కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ముకుందరెడ్డి

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఏప్రిల్26: సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్‌గా జీ. ముకుంద రెడ్డి ఆదివారం బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుత స్పెషల్ కమిషనర్‌గా ఉన్న సిహెచ్ ప్రియాంకను బదిలీ చేయడంతో జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ గా ఉన్న ముకుంద రెడ్డిని సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ తో పాటు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శిగా కూడా ముకుంద రెడ్డి బాధ్యతలను స్వీకరించారు.

సామాజిక న్యాయ రంగంలో కేంద్రం, రాష్ట్రాల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలి

ఛండీగఢ్ చింతన్ శివిర్‌లో మంత్రి అడ్లూరి లక్ష్మణ్

హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: సామాజిక న్యాయం రంగంలో కేంద్రం, రాష్ట్రాల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని తెలంగాణ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచించారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో చండీగఢ్‌లో ఆదివారం నిర్వహించిన చింతన్ శివిర్-2026 సదస్సులో మంత్రి పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్న ఈ సదస్సులో సామాజిక న్యాయం, సంక్షేమ పథకాల అమలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల అభివృద్ధి అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం సమానత్వం-సాధికారత-స్వాభిమాన జీవితం లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు. సోషల్ వెల్ఫేర్ శాఖను ఎస్సీ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌గా పునర్నామకరణం చేయడం దళితుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టికి నిదర్శనమన్నారు. పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్స్ కింద రూ.574.74 కోట్లు వెచ్చించి 3,39,731 మంది విద్యార్థులకు లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు. ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్స్ ద్వారా రూ.66.31 కోట్లు ఖర్చు చేసి 73,666 మంది విద్యార్థులకు సహాయం అందించినట్టు చెప్పారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి కింద రూ.103.49 కోట్లు వెచ్చించి 564 మంది విద్యార్థులకు విదేశీ విద్య అవకాశాలు కల్పించామన్నారు. టీజీ ఎస్సీ స్టడీ సర్కిల్స్ కోసం రూ.24.53 కోట్లు ఖర్చు చేసి 2,426 మంది విద్యార్థులకు సివిల్ సర్వీసెస్ కోచింగ్ అందిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ హాస్టల్స్ నిర్వహణకు రూ.628.42 కోట్లు వెచ్చించి 2,26,950 మంది విద్యార్థులకు ఉచిత వసతి, భోజనం, సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా 47,539 మంది లబ్ధిదారులకు రూ.476.15 కోట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. కులాంతర వివాహాల ప్రోత్సాహకంగా 1,723 జంటలకు రూ.43.06 కోట్లు అందించామన్నారు.

దేశ ప్రగతిలో అందరం భాగస్వామ్యం కావాలి

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: లోకల్ టు గ్లోబల్ అన్న ప్రధాని మోడీ మాటలు అక్షరసత్యాలని, ప్రధాని నేతృత్వంలో భారత్ ప్రతి రంగంలోనూ అగ్రగామిగా నిలుస్తుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. రాజకీయాల కంటే దేశ ప్రగతే ప్రాధాన్యంగా సాగుతున్న ఈ ప్రస్థానంలో మనమందరం భాగస్వాములం కావాలన్నారు. ఆదివారం సోమాజిగూడలోని జయ గార్డెన్స్‌లో బిజెపి కార్యకర్తలు, నాయకులతో కలిసి ప్రధాని నరేంద్ర మోడీ 133వ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షి ంచడం జరిగిందని తెలిపారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ జయంతి ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో సైతం పాల్గొన్నానని, ఈ సందర్భంగా ప్రధాని పంచుకున్న విశేషాలు మనందరిలో కొత్త స్ఫూర్తిని నింపాయన్నారు. తమిళనాడులోని కల్పకం ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ క్రిటికాలిటీ దశకు చేరుకోవడం మన దేశ చరిత్రలో ఒక మైలురాయి అన్నారు. స్వదేశీ టెక్నాలజీతో ఈ ఘనత సాధించడం మన సైంటిస్టుల పట్టుదలకు నిదర్శనమని, ఇది మన పరిశ్రమలకు, ఆరోగ్య రంగానికి ఎంతో మేలు చేస్తుందని అన్నారు. పవన శక్తిలో జోరు: కంటికి కనిపించని గాలి ద్వారా భారత్ ఇవాళ 56 గిగావాట్లకు పైగా విద్యుత్ ఉత్పత్తి చేస్తూ ప్రపంచంలోనే 4వ స్థానంలో నిలిచిందని, గ్రీన్ ఎనర్జీలో మోడీ విజన్ మన దేశాన్ని వెలుగుల బాటలో నడిపిస్తుందని, బుద్ధ పూర్ణిమ వేళ శాంతి సందేశాన్ని ఇస్తూనే గుజరాత్ కచ్‌లోని ఫ్లెమింగో పక్షులు, యూపీలోని ఏనుగుల సంరక్షణకు గజ మిత్ర లాంటి కార్యక్రమాలను ప్రధాని ప్రస్తావించడం హర్షించదగ్గ విషయం అన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా సమ్మర్ కోచింగ్ క్యాంప్స్

రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త: రాష్ట్ర వ్యాప్తంగా సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ వెల్లడించింది. స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌తో పాటు, రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో ఈ నెల 24 నుండి సమ్మర్ కోచింగ్ క్యాంపులను ప్రారంభించినట్లు ఆదివారం ఒక ప్రకటనలో ఆ సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి తెలిపారు. వీటిని జూన్ 6 వరకు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ క్యాంపులకు అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. హైదరాబాద్ లోని స్టేడియంలలో ఇప్పటికే 2 వేలకు మంది పైగా శిక్షణ పొందుతున్నారని చెప్పారు. సానియా మీర్జా, సైనా నెహ్వాల్, మిథాలీ రాజ్ వంటి ఎందరో క్రీడాకారులు అజారుద్దీన్, పుల్లెల గోపీచంద్ లాంటి వారికి ప్రాథమిక పాఠాలు తమ సంస్థ నేర్పిందని వివరించారు. ప్రైవేట్ కోచింగ్ తో పోలిస్తే అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన మైదానాల్లో అనుభవం కలిగిన కోచ్‌లు సామాన్యులకు కూడా అందుబాటులో ఉండే రుసుముతో మంచి ప్రమాణాలు కలిగిన క్రీడా శిక్షణ అందిస్తున్నామని పేర్కొన్నారు.

ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరాలలో పాల్గొన బోతున్న క్రీడాకారులు విద్యార్థులను ఆన్లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. వారి సమాచారాన్ని భవిష్యత్తులో క్రీడా అవసరాలకు వినియోగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ శిబిరాల్లో పాల్గొంటున్న క్రీడాకారుల సమాచారాన్ని నిక్షి ప్తం చేస్తున్నామని తెలిపారు.

ఉడుకుతున్న భారతం

మూడు రోజులు తీవ్రస్థాయి వడగాడ్పులు

కొన్ని ప్రాంతాలలో ఉష్ణోగ్రత 45 డిగ్రీలు దాటే ప్రమాదం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: ఉత్తర భారతావనితోపాటు దేశవ్యాప్తంగా పలు ప్రాంతాలలో రానున్న మూడు రోజులు సాధారణం కంటే గరిష్టస్థాయిలో పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని భారత వాతావరణ శాఖ (ఐఎమ్‌డి) అంచనా వేసింది. ఢిల్లీ, ఛత్తీస్‌గఢ్, హర్యానా, చండీగఢ్, మధ్యప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, విదర్భలోని కొన్ని ప్రాంతాలలో వడగాలుల పరిస్థితుల కోసం పసుపు హెచ్చరిక జారీ చేసింది.

అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మేఘాలయ, ఉపహిమాలయ, పశ్చిమ బెంగాల్, సిక్కింలో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఉత్తర అంతర్గత కర్ణాటకలో ఉరుములు, వడగళ్ల వానలు కురిసే అవకాశం ఉంది. వాతావరణ సంస్థ ప్రకారం, బీహార్, గంగానది పశ్చిమ బెంగాల్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ మరియు కాశ్మీర్, లడఖ్, జార్ఖండ్, కేరళ, మాహే, మరాఠ్వాడా, ఉత్తరాఖండ్, ఒడిశాలోని కొన్ని ప్రాంతాలలో కూడా ఉరుములు, మెరుపులు సంభవించే అవకాశం ఉంది.

బీహార్, కోస్తా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, గుజరాత్, గంగానది పశ్చిమ బెంగాల్, కేరళ, మాహే, కొంకణ్, గోవా, మణిపూర్‌లోని కొన్ని ప్రాంతాలలో వేడి, తేమతో కూడిన వాతావరణ పరిస్థితులు నెలకొని ఉంటాయి. ఐఎండి ప్రకారం, రాబోయే 2 రోజులలో ఢిల్లీ, హర్యానా, చండీగఢ్, పంజాబ్, ఉత్తర ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాలలో రాత్రిపూట వెచ్చని వాతావరణం ఉంటుంది. ఏప్రిల్ 27 నుండి 30 మధ్య వాయువ్య, తూర్పు, ఈశాన్య భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో ఉరుములతో కూడిన వర్షాలు కురుస్తాయని ఐఎండి అంచనా వేస్తోంది, ఇది వడగాలుల పరిస్థితులను తగ్గించగలదు.

అరేబియా సముద్రంపై బలపడుతున్న పశ్చిమ గాలుల సహాయంతో మే నెలాఖరు నాటికి కేరళ, తమిళనాడులో రుతుపవనాల తొలి సూచనలు కనిపిస్తాయని వాతావరణ శాస్త్రవేత్తలు కూడా పేర్కొంటున్నారు. సకాలంలో కురిసే వర్షాలు ఉష్ణోగ్రతలను చల్లబరు స్తాయి. విత్తనాలు నాటే కాలానికి వ్యవసాయ సన్నాహాలకు సహాయపడతాయి.

ప్రయాగ్‌రాజ్‌లో అత్యధికంగా 45.2 డిగ్రీలు నమోదు

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో దేశంలోనే అత్యధికంగా 45.2 ది ఉష్ణోగ్రత నమోదు కాగా, ఇతర నగరాల్లో 44 డిగ్రీలు దాటింది. వేడి సంబంధిత ఆరోగ్య ప్రమాదాల నుండి నివాసితులను రక్షి ంచడానికి అధికారులు సూచనలు, సహాయక చర్యలను ప్రకటించారు. ఢిల్లీలో, పాఠశాలల్లో 'వాటర్ బెల్స్', ప్రజల కోసం మట్టి కుండల నీటి కేంద్రాలు, ఆసుపత్రుల సన్నద్ధత వంటి చర్యలు అమలు చేస్తున్నారు. మధ్యాహ్నం తీవ్రమైన ఎండకు దూరంగా ఉండాలని, శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవాలని, తేలికపాటి దుస్తులు ధరించాలని ఐఎండి మార్గదర్శకాలు విడుదల చేసింది. ముందస్తు నివారణ చర్యలు వడదెబ్బ కేసులను తగ్గించగలవని నిపుణులు నొక్కి చెబుతున్నారు.

థామస్ ఉబెర్ బ్యాడ్మింటన్ కప్‌లో
భారత్ ఘన విజయం

న్యూఢిల్లీ: థామస్ ఉబెర్ మహిళల బ్యాడ్మింటన్ కప్-2026లో ఉక్రెయిన్‌పై భారత్ మహిళలు ఘన విజయం సాధించారు. యువ భారత మహిళల జట్టు ఆదివారం డెన్మార్క్‌లోని హార్సెన్స్‌లో జరిగిన గ్రూప్ ఎ రెండవ పోరులో యూరోపియన్ ఛాంపియన్‌షిప్స్ కాంస్య పతక విజేత ఉక్రెయిన్‌ను 4-1 తేడాతో ఓడించి, థామస్ ఉబెర్ కప్ లో తమ తొలి విజయాన్ని నమోదు చేసుకుంది. జట్టు సింగిల్స్‌లో మాజీ ప్రపంచ ఛాంపియన్ పీవీ సింధుకు విశ్రాంతినిచ్చి, మూడవ సింగిల్స్‌లో 2026 థాయ్‌లాండ్ మాస్టర్స్ ఛాంపియన్ దేవికా సిహాగ్ కు అవకాశం కల్పించింది. ఉన్నతి హుడా పోలినా బుహ్రోవాపై 21-19, 22-20 తేడాతో గెలిచి భారత్ తరపున శుభారంభం చేయగా, ఆ

తర్వాత జూనియర్ ప్రపంచ ఛాంపియన్ షిప్స్ రజత పతక విజేత తన్వి శర్మ యెవ్హెనియా కాంటెమిర్‌ను 21-12, 17-21, 21-10 తేడాతో ఓడించి ఆధిక్యాన్ని రెట్టింపు చేసింది. ఆ తర్వాత దేవిక, మరియా స్టోలియారెంకోను 23-21, 21-13 తేడాతో ఓడించి ఫలితాన్ని ఖరారు చేసింది. తొలి మహిళల డబుల్స్‌లో కవిప్రియ సెల్వం, సిమ్రాన్ సింఘీ జోడీ బుహ్రోవా, కాంటెమిర్ జోడీ చేతిలో 11-21, 17-21 తేడాతో ఓడిపోవడంతో భారత్‌కు ఏకైక ఎదురుదెబ్బ తగిలింది. ఆ తర్వాత స్టోలియారెంకో, సోఫియా లావ్రోవా జోడీపై సింధు, తనిషా క్రాస్టో జోడీ 21-18, 21-15 తేడాతో విజయం సాధించి స్కోరును పూర్తి చేసింది. భారత్ మహిళల జట్టు ఈ నెల 27న జరిగే తమ చివరి గ్రూప్ మ్యాచ్‌లో బలమైన చైనాతో తలపడనుంది. క్వార్టర్ ఫైనల్స్‌కు చేరాలంటే డిఫెండింగ్ ఛాంపియన్‌లను తప్పక ఓడించాల్సి ఉంటుంది.

ప్రో బాక్సింగ్ సర్క్యూట్‌లో..
నిశాంత్ ఆరో విజయం

న్యూఢిల్లీ: భారత బాక్సింగ్‌లో ఎదుగుతున్న ప్రొఫెషనల్ యువ క్రీడాకారుడు నిశాంత్ దేవ్, లాస్ వెగాస్‌లో జరిగిన పోరులో జువాన్ కార్లోస్ గెర్రా జూనియర్‌పై రెండో రౌండ్‌లోనే నాకౌట్ విజయం సాధించి, మరో సంచలన ప్రదర్శన కనబరిచాడు. నిశాంత్ వరుసగా ఆరో విజయాన్ని నమోదు చేసి, ప్రొఫెషనల్ సర్క్యూట్-2026లో తన విజయ పరంపరను కొనసాగించాడు. జారెల్ మిల్లర్ వర్సెస్ లెనియర్ పెరో ప్రధాన పోరాటానికి అనుబంధంగా లాస్ వెగాస్‌లో ఆదివారం జరిగిన ఎనిమిది రౌండ్ల సూపర్ వెల్టర్‌వెయిట్ బౌట్‌లో, నిశాంత్ రెండవ రౌండ్‌లోనే జువాన్ కార్లోస్ గెర్రాను నాకౌట్ చేశాడు. నిశాంత్ 2024 ఒలింపియన్ తన అజేయ ప్రొఫెషనల్ రికార్డును 6-0కి పొడిగించుకున్నాడు, అందులో నాలుగు విజయాలు నాకౌట్ ద్వారా సాధించాడు. అనుభవజ్ఞుడైన ప్రత్యర్థిపై దేవ్ సంయమనాన్ని పరీక్షిస్తుందని భావించిన ఈ బౌట్, దానికి బదులుగా ప్రొఫెషనల్ రంగంలో అతని వేగవంతమైన పురోగతిని హైలైట్ చేసింది. 6-3-1 రికార్డుతో, నికో అలీ వాల్ష్‌పై సాధించిన ఒక ముఖ్యమైన విజయంతో సహా, ఉన్నత స్థాయి ఫైటర్లను ఓడించడంలో ఖ్యాతి గడించిన గెర్రా, దేవ్ యొక్క నియంత్రిత దూకుడు మరియు సాంకేతిక కచ్చితత్వాన్ని తట్టుకోలేకపోయాడు. ఆరంభ బెల్ మోగినప్పటి నుంచే నిశాంత్ దేవ్ తన ఉద్దేశాన్ని స్పష్టం చేశాడు. సౌత్‌పా స్టాన్స్‌లో ఆడుతూ, అతను దూరాన్ని నియంత్రించడానికి మరియు గెర్రా లయను దెబ్బతీయడానికి తన జాబ్‌ను సమర్థవంతంగా ఉపయోగించాడు. ఈ భారత బాక్సర్ ఓర్పుతో పాటు ఒత్తిడిని మిళితం చేస్తూ, రక్షణాత్మక క్రమశిక్షణను పాటిస్తూ క్రమంగా దూరాన్ని తగ్గించి విజయం వైపు దూసుకెళ్లాడు.

కొత్త ఛాంపియన్స్

వరల్డ్ 10కెలో సంజీవని, హర్మన్‌జోత్ హ్యాట్రిక్ విజయాలు

న్యూఢిల్లీ: వరల్డ్ అథ్లెటిక్స్ గోల్డ్ లేబుల్ రేస్ అయిన 18వ వరల్డ్ 10కేలో అంతర్జాతీయ ఎలైట్ అథ్లెట్ల మధ్య భారత్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు కొత్త ఛాంపియన్లుగా ఆవిర్భవించారు. ఆదివారం జరిగిన వరల్డ్ 10కేలో హర్మన్‌జోత్ సింగ్, సంజీవని జాదవ్ భారత ప్రదర్శనలకు నాయకత్వం వహించారు, అద్భుతమైన పరుగులతో వారి వారి విభాగాలలో అగ్రస్థానాలను కైవసం చేసుకున్నారు. మహిళల రేసులో సంజీవని జాదవ్ ఈ ఈవెంట్‌లో తన నిలకడను మరోసారి చాటుకుంటూ, వరుసగా మూడవ టైటిల్‌ను కైవసం చేసుకుంది. సంజీవని ఈ ఈవెంట్‌లో తన అద్భుతమైన పరుగును కొనసాగిస్తూ, 35:01 సమయంతో వరుసగా మూడవ టైటిల్‌ను మరియు మొత్తంగా తన ఐదవ టైటిల్‌ను కైవసం చేసుకుంది. రెండవ స్థానం కోసం జరిగిన ఉత్కంఠభరితమైన పోటీలో, సోనియా (35:31) గత సంవత్సరం సాధించిన ఆరవ స్థానాన్ని మెరుగుపరుచుకుంటూ, భాగీరథి (35:32)ని స్వల్ప తేడాతో అధిగమించింది. పురుషుల విభాగంలో హర్మన్‌జోత్ 29:13 సమయంతో అత్యంత వేగవంతమైన భారతీయుడిగా నిలిచాడు. ఈవెంట్ రికార్డుకు కేవలం ఒక సెకను దూరంలో నిలిచి, అదనంగా లభించే లక్ష రూపాయల బోనస్‌ను త్రుటిలో కోల్పోయాడు. ఇంతలో, కర్ణాటకకు చెందిన శైలేష్ కుష్వాహ్ (29:21) మరియు దీపక్ భట్ (29:52) ఆ తర్వాతి స్థానాల్లో నిలిచారు.

టి20లో భారత్ హ్యాట్రిక్ విక్టరీ

దక్షిణాఫ్రికాపై 14 రన్స్ తేడాతో విజయం

న్యూఢిల్లీ: నాలుగో మహిళల టీ20లో భారత్ 14 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాపై విజయం నమోదు చేసింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆతిథ్య జట్టు 3-1తో తిరుగులేని ఆధిక్యంలో కొనసాగుతుండగా, భారత జట్టు వైట్‌వాష్‌ను తప్పించుకుంది. జోహన్నెస్‌బర్గ్‌లో ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదట బౌలింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా, ఎలిజ్‌మారి మార్క్స్ ద్వారా తొలి వికెట్లను కోల్పోయింది. ఆమె షఫాలీ వర్మను 9 పరుగులకే అవుట్ చేసింది. ఆ తర్వాత పవర్‌ప్లే చివరిలో తుమీ సెఖునే అనుష్క శర్మను (27) అవుట్ చేయడంతో, భారత్ 47/2 స్కోరుతో నిలిచింది. రోడ్రిగ్స్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (22) కలిసి 55 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి, 11వ ఓవర్‌లో భారత్‌ను 100 పరుగుల మార్కు దాటించారు. చివరకు కైలా రెనెక్ బౌలింగ్‌లో రోడ్రిగ్స్ (43) ఔటై ఈ భాగస్వామ్యం విచ్ఛిన్నమైంది. ఆ తర్వాత మార్క్స్, భారతి ఫుల్మాలిని 2 పరుగులకే ఎల్బీడబ్ల్యూగా పెవిలియన్ చేర్చగా, కొద్దిసేపటికే రేనెక్ కౌర్‌ను కూడా ఔట్ చేసింది. దీంతో 14 ఓవర్లలో భారత్ స్కోరు 122/5కు పడిపోయింది. అయితే, దీప్తి మరియు రిచా ఘోష్ (34) ఆరో వికెట్ కు అజేయంగా 65 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి, భారత్ ను 185/5 స్కోరుకు చేర్చి, ఇన్నింగ్స్‌కు బలమైన ముగింపునిచ్చారు. 186 పరుగుల లక్ష్యాన్ని ఛేదిస్తున్న దక్షిణాఫ్రికా, లారా వోల్వార్డ్ (18) మరియు సునే లూస్ (40)ల ద్వారా కేవలం మూడు ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 32 పరుగులు చేసింది. ప్రోటీస్ కెప్టెన్‌ను అవుట్ చేసి క్రాంతి గౌడ్ బ్రేక్‌త్రూ అందించడంతో, సందర్శక జట్టు ఊపిరి పీల్చుకుంది. తొమ్మిదో ఓవర్‌లో దీప్తి బౌలింగ్‌లో లూస్ అవుటవడానికి ముందు, లూస్, టాజ్మిన్ బ్రిట్స్ (30) రెండో వికెట్‌కు 44 పరుగులు జోడించారు. ఆ తర్వాత పరుగులు చేయడానికి

దక్షిణాఫ్రికా ఇబ్బంది పడటంతో, క్రమం తప్పకుండా వికెట్లు పడ్డాయి. దీప్తి బంతితో దూకుడుగా ఆడగా, శ్రీ చరణీ, కాష్వీ గౌతమ్, షఫాలీ తలా వికెట్ తీసి ఆతిథ్య జట్టును 171/9 పరుగులకే పరిమితం చేశారు. మార్క్స్ అజేయంగా చేసిన 21 పరుగులు చివరిలో కొంత ప్రతిఘటన చూపినా అది సరిపోకపోవడంతో భారత్ విజయాన్ని కైవసం చేసుకుంది.

ఐపిఎల్ నుండి ముంబయి, కోల్‌కత్తా ఔట్

ప్లే ఆఫ్స్ చేరే జట్లు ఫైనల్

న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌లో సగం లీగ్ మ్యాచ్‌లు పూర్తయ్యాయి. ప్రతీ జట్టు ఏడేసి మ్యాచ్‌లు ఆడాయి. సెకండాఫ్ టోర్నీలో మ్యాచ్‌లు హోరీహోరీగా ఉండబోతున్నాయి. లీగ్ ఫార్మాట్ ప్రకారం పాయింట్స్ టేబుల్‌లో టాప్4లో నిలిచిన జట్లు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి. ప్రతీ జట్టు ఏడేసి మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న తర్వాత పంజాబ్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ టాప్4లో కొనసాగుతున్నాయి. ఇందులో రాజస్థాన్, సన్‌రైజర్స్ హైదరాబాద్ 8 మ్యాచ్‌లు ఆడి 5 విజయాలు సాధించాయి. పంజాబ్ కింగ్స్ మాత్రం ఓటమెరుగని జట్టుగా టాప్‌లో కొనసాగుతోంది. 265 పరుగుల రికార్డు లక్ష్యాన్ని కూడా ఛేదించి ఆ జట్టు తమకు తిరుగులేదని చాటుకుంది. టాప్4లో చోటు దక్కాలంటే ప్రతీ జట్టు కనీసం 8 మ్యాచ్‌ల్లో గెలవాలి. 6 మ్యాచ్‌లు గెలిచి టాప్‌లో కొనసాగుతున్న పంజాబ్ చివరి 7 మ్యాచ్‌ల్లో రెండు గెలిస్తే ప్లే ఆఫ్స్ బెర్త్ ఖరారు కానుంది. డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్‌సీబీ, సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మరో మూడు మ్యాచ్‌లు గెలవాల్సి ఉంది. చెన్నై సూపర్ కింగ్స్ తమ చివరి 7 మ్యాచ్‌ల్లో 5 గెలవాలి. ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ టైటాన్స్ కూడా సీఎస్‌కే తరహాలో మరో 5 మ్యాచ్‌లు గెలవాలి. భారీ అంచనాలతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ పేలవ ప్రదర్శనతో అట్టడుగు స్థానంలో నిలిచింది. ముంబై ఇండియన్స్‌తో పాటు లక్నో సూపర్ జెయింట్స్ ప్లే ఆఫ్స్ చేరాలంటే చివరి 7 మ్యాచ్‌ల్లో 6 విజయాలు సాధించాలి. కోల్‌కతా నైట్‌రైడర్స్ అయితే ఏడు మ్యాచ్‌లకు ఏడు గెలవాలి. అద్భుతం జరిగితే తప్పా ఈ జట్లు ప్లే ఆఫ్స్ చేరే అవకాశాలు లేవు. టోర్నీ ఆరంభానికి ముందు ప్రతీ ఎక్స్‌పర్ట్, ఏఐ టూల్స్ ముంబై ఇండియన్స్ విజేతగా నిలుస్తాయని అంచనా వేసాయి. కానీ ఆ జట్టు చెత్త ఆటతో తీవ్రంగా నిరాశపర్చింది. 7 మ్యాచ్‌ల్లో కేవలం 2 మ్యాచ్‌ల్లోనే విజయం సాధించింది. ప్రస్తుత పరిస్థితి, టీమ్స్ ఫామ్ పరంగా పంజాబ్ కింగ్స్, ఆర్‌సీబీ, సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్‌కు ప్లే ఆఫ్స్ చేరే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. మిగతా జట్లు అద్వితీయమైన ప్రదర్శన చేస్తే తప్పా నాకౌట్ చేరే దాఖలాలు కనిపించడం లేదు.

పసిడి, వెండిపై అమ్మకాల ఒత్తిళ్లు!

ముంబయి, ఏప్రిల్ 26: బంగారం,వెండి ధరలు ఈ వారంలో కొంత అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొనే అవకాశం ఉంది. ట్రేడర్లు అమెరికా-ఇరాన్ శాంతి చర్చలు, క్రూడ్ ఆయిల్ ధరలు, మరియు ఫెడరల్ రిజర్వ్ మీట్ అంశాలపైనే ఫోకస్‌పెంచారు. రాబోయే వారంలో ప్రధానంగా అమెరికా-ఇరాన్ శాంతి చర్చల పురోగతి, మరియు వాటి ప్రభావం ఆయిల్, బంగారం మరియు ఇతర ఆర్థిక మార్కెట్లపై ఎలా ఉంటుందనే దానిపై దృష్టి ఉంటుందని జేఎం ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్‌లో కమోడిటీ కరెన్సీ రీసెర్చ్ విభాగం ఉపాధ్యక్షుడు ప్రణవ్ మోరే తెలిపారు. మ్యాక్రో ఆర్థిక అంశాల పరంగా, ట్రేడర్లు అమెరికా ఫెడరల్ రిజర్వ్, జపాన్ బ్యాంక్, ఇంగ్లాండ్ బ్యాంక్, మరియు యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్‌ల మానిటరీ పాలసీ నిర్ణయాలను గమనిస్తారు. అమెరికా హౌసింగ్ డేటా, వ్యక్తిగత వ్యయ వినియోగం, ద్రవ్యోల్బణం, వినియోగదారుల నమ్మకం, ప్రధాన ఆర్థిక వ్యవస్థల ఫ్యాక్టరీ కార్యకలాపాల గణాంకాలు మార్కెట్ ధోరణులను ప్రభావితం చేస్తాయి. ఈనెల 29న జరగనున్న ఫెడరల్ ఓపెన్ మార్కెట్

కమిటీ (ఎఫ్ఒఎంసి) సమావేశం జెరోమ్ పావెల్ అధ్యక్షతన చివరిదవుతుంది. ఆ సమావేశంవివరాలు బంగారం, వెండి ధరలకు ముఖ్యమైనవి అవుతాయి. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో, బంగారం ఫ్యూచర్స్ రూ.1,910 (1.23) తగ్గి వారాంతంలో 10 గ్రాములకు రూ.1.54 లక్షలకు ముగిసింది. వెండి రూ.12,506 (4.9) తగ్గి కిలోకు రూ.2.44 లక్షలకు చేరింది. దేశీయ మార్కెట్లో బంగారం ధరలు తగ్గినా, రూపాయి విలువ గత వారం సుమారు 1.4 పడిపోవడం వల్ల ఈ తగ్గుదల పరిమితమైంది. అంతర్జాతీయ మార్కెట్లో, బంగారం 138.7 (2.8) తగ్గి ఔన్స్‌కు 4,740.9కి ముగిసింది. వెండి 5.4 (6.6) తగ్గి 76.41కి చేరింది. గత నాలుగు వారాల్లో 10-12 పెరిగిన తర్వాత లాభాల స్వీకరణతో, ఔన్స్‌కు ఐదువేల డాలర్లకు దాటలేకపోవడంతో బంగారం ధరలు కొంత తగ్గాయని మోరే తెలిపారు. అమెరికా-ఇరాన్ మధ్య హోర్ముజ్ జలసంధి సమస్య కారణంగా క్రూడ్ ఆయిల్ ధరలు బ్యారెల్‌కు 100 దాటాయి. అమెరికా డాలర్ డిమాండ్, ట్రెజరీ బాండ్ యీల్డ్స్ బలంగా కొనసాగుతున్నాయి. అంచనాలకంటే మెరుగైన రిటైల్ సేల్స్, ఉద్యోగ గణాంకాలు, వినియోగదారుల భావోద్వేగం డేటా డాలర్‌ను బలపరచి, బంగారం మరియు వెండి ధరలపై ఒత్తిడిని కలిగించాయి. ప్రపంచ కేంద్ర బ్యాంకుల కొనుగోలు-అమ్మకాల కార్యకలాపాలు మిశ్రమంగా కొనసాగుతున్నాయి. అధిక ద్రవ్యోల్బణం నేపథ్యంలో భవిష్యత్తులో వడ్డీ రేట్ల పెంపు లేదా తగ్గింపు పై అనిశ్చితి ఉండటం వల్ల బంగారం ధరలు అస్థిరంగా ఉండే అవకాశం ఉంది. బంగారం ధరలు దిగువ స్థాయిల వద్ద మద్దతు పొందే అవకాశం ఉన్నప్పటికీ, డాలర్ బలంగా కొనసాగితే మరియు భౌగోళిక ఉద్రిక్తతలు తగ్గితే మరింత తగ్గుదల ఉండవచ్చు. వెండి మాత్రం ప్రెషస్ మెటల్ మరియు ఇండస్ట్రియల్ మెటల్‌అనే ద్వంద్వ పాత్ర కారణంగా ఎక్కువ మార్పులకు లోనవుతుంది. పశ్చిమ ఆసియాలో ఉద్రిక్తతలు పెరిగితే లేదా ప్రధాన కేంద్ర బ్యాంకులు సడలింపు సంకేతాలు ఇస్తే, బంగారం కొనుగోలు మళ్లీ పెరగవచ్చు అని మార్కెట్‌నిపుణుల అంచనా.

8 నగరాల్లో 23% క్షీణించిన ఇళ్ల అమ్మకాలు!

ముంబయి, ఏప్రిల్ 26: దేశవ్యాప్తంగా రూ.50 లక్షలలోపు ఉన్న అందుబాటులో పక్కాగృహాలు 23శాతం క్షీణించాయి. జనవరి మార్చి మధ్యకాలంలో టాప్ ఎనిమిది నగరాల్లో కేవలం 16,273యూనిట్లు మాత్రమే అమ్ముడయినట్లు నైట్‌ఫ్రాంక్ సంస్థ ప్రకటించింది. ఈధరల కేటగిరీలో సరఫరా తక్కువగా ఉండటమే ఇందుకుకారణం. కొవిడ్ మహమ్మారి తర్వాత లగ్జరీ నివాసాలకు డిమాండ్‌పెరిగింది. బిల్డర్లు కూడా తక్కువరేట్ల పక్కాగృహాల నిర్మాణాన్ని అత్యంత తక్కువగానే చేపడుతున్నారు. ఎందుకంటే ముడివనరుల ధరలు కొంతమేర వ్యయభరితం కావడమేనని నైట్‌ఫ్రాంక్ విశ్లేషించింది. అందువల్లనే ఈ తక్కువధరల పక్కాగృహాలు ఈత్రైమాసికంలో 23శాతం తగ్గినట్లు తేలింది. ప్రత్యేకించి ముంబయి, ఢిల్లీ, ఎన్‌సిఆర్, పూణె, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, అహ్మదాబాద్, కోల్‌కత్తా నగరాల్లోనే ఈపరిస్థితి నెలకొన్నట్లు కనిపిస్తోంది. ఇళ్లల్లో ఒకటినుంచి రెండుకోట్ల సెగ్మెంట్‌లో 10శాతంపెరిగి 24,657యూనిట్లకు

పెరిగాయి. రెండునుంచి ఐదుకోట్ల సెగ్మెంట్‌లో 17శాతంపెరిగి 16,075 యూనిట్లకు చేరాయి. ఇక ఐదునుంచి 10 కోట్ల ధరల్లో మూడుశాతం క్షీణించి 3338 యూనిట్లు మాత్రమే విక్రయాలుజరిగితే 10నుంచి 20 కోట్ల కేటగిరీలో 12శాతంపెరిగి 738 యూనిట్లు విక్రయించారు. అలాగే రూ.20-50 కోట్ల కేటగిరీలో 80శాతంపెరిగి 165యూనిట్లుకు చేరాయి. 50 కోట్లకుపైబడిన ఇళ్లు 93శాతం క్షీణించి కేవలం 12 యూనిట్లు మాత్రమే అమ్ముడయినట్లు తేలింది. అన్ని కేటగిరీల్లోను కలిపి ఇళ్ల అమ్మకాలు నాలుగుశాతం సగటున క్షీణించాయి. 84,827 కూనిట్లుగా ఉన్నాయి. దరలు పెరగడం, భౌగోళిక ఉద్రిక్తతలు వంటివికూడా ప్రభావంచూపించినట్లునైట్‌ఫ్రాంక్ విశ్లేషించింది.

నిమిషానికి రూ.1.36కోట్లు మస్క్ సంపాదన!



న్యూయార్కు, ఏప్రిల్ 26: ప్రపంచ కుబేరుడు ఎలాన్‌మస్క్ నికర ఆదాయం వింటే షాక్ అవ్వాల్సిందే. గత ఏడాది నవంబరు నాటికి మస్క్ నికర ఆస్తి విలువ సుమారుగా రూ.39.6 లక్షల కోట్లుగా ఆయన సంపద మొత్తం టర్నోవర్. కేవలం 2025లోనే మస్క్ సంపద సుమారుగా రూ.6.4 లక్షల కోట్లు పెరిగింది. ఎలాన్ మస్క్ టెస్లా షేర్లు, స్పేస్‌ఎక్స్ విలువ ఆధారిత పెట్టుబడులు, క్రిప్టో, ఇతర వ్యాపారాల ద్వారా డబ్బు సంపాదిస్తాడు. మస్క్ కేవలం టెస్లాకే పరిమితం కాదు. న్యూరాలింక్, ది బోరింగ్ కంపెనీ, ఏఐ, ఇతర టెక్ ప్రాజెక్టులు అన్నీ అతని నికర విలువకు దోహదం చేస్తాయి. టెస్లామస్క్‌గా విస్తృత ప్రాధాన్యం పొందిన ఎలాన్ మస్క్ నిమిషానికి సుమారు రూ.1.36 కోట్లు సంపాదిస్తాడు. మస్క్ గంటకు సుమారుగా రూ.816 మిలియన్లు సంపాదిస్తాడు. అంటే కేవలం ఒక గంటలోనే మిలియనీర్ అవ్వడమే కాకుండా, బిలియనీర్ అయ్యే దిశగా పయనిస్తున్నాడు. ఎలాన్ మస్క్ రోజుకు సుమారు రూ.1,960 కోట్లు సంపాదిస్తాడు. ఆ మొత్తంతో ఒక చిన్న పట్టణంలోని స్థిరాస్తి మొత్తాన్ని కొనుగోలు చేయవచ్చు. మస్క్ నెలసరి ఆదాయం సుమారుగా రూ.58,800 కోట్లు. వార్షిక ఆదాయం సుమారుగా రూ.7.15 లక్షల కోట్లుగా అంచనా వేశారు. ఇది స్థిరమైన ఆదాయం కాదు ఇది మస్క్ షేర్ల విలువను బట్టి మారుతూ ఉంటుంది.

వాణిజ్యం

ముడిచమురు ధరలపై
'హార్ముజ్' మంటలు!

యూనియన్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా విశ్లేషణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: హార్ముజ్ జలసంధి పూర్తిగా నిలిపివేతకారణంగా మళ్లీ చమురు మార్కెట్‌లో మంటలు మండుతున్నాయి. పశ్చిమాసియాలో మళ్లీ ఏక్షణంలో అయినా ట్రంప్ దాడులకు ఆదేశాలివ్వవచ్చన్న సంకేతాలు వెలువడుతుండటం, హార్ముజ్‌జలసంధిలో మళ్లీ ఉద్రిక్తతలు చెలరేగడం వంటివి ముడిచమురు బ్యారెల్ ధరలు 100 డాలర్లకుపైబడి పెంచుతాయని యూనియన్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా అంచనావేసింది. హార్ముజ్‌నుంచి రూపాయి అన్న శీర్షికతో వెలువరించిన ఈ రీసెర్చ్ నివేదికలో బ్యాంకు ముడిచమురుధరలు పెరుగక తప్పదని హెచ్చరించింది. దీనివల్ల ద్రవ్యోల్బణం పెరిగి రూపాయి మరింత క్షీణిస్తుందని, భారత కరెంటుఖాతాలోటు మరింతపెరుగుతుందని అంచనావేసింది. ప్రస్తుత ముడిచమురుధరలు పెరుగుదల ద్రవ్యోల్బణ సమస్యతోపాటు కేంద్ర బ్యాంకు రెపోరేట్ సడలింపులు, కరెంటుఖాతాపై ఒత్తిడితోపాటు ఆర్థిక పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారుతుందని, ఇంధనం దిగుమతిచేసుకునే దేశాలకు మరింతగా ధరల భారం పెరుగుతుందని అంచనావేసింది. భారత్‌వరకూ చూస్తే 85శాతం ముడిచమురు డిమాండ్ దిగుమతులుద్వారానే తీర్చుకోగలుగుతున్నది. హార్ముజ్‌ప్రభావం ఇప్పటికే మనకు స్పష్టంగా తెలిసింది. ఇరాన్ ఇజ్రాయెల్ వివాదాలు మరింతగాపెరిగితే చమురు ట్యాంకర్ల రాకకు గండికొడుతుందని అంచనావేసింది. హార్ముజ్ మార్గం పూర్తిస్థాయిలో తెరుచుకుంటేనే నౌకల రాకను సులభతరంచేయడంతోపాటు ధరలను కొంతమేర కట్టడిచేసే వీలుంటుంది. చమురుధరలు పెరుగుదలకారణం వల్ల ఆర్థికవ్యవస్థపై చమురుపన్ను (ఆయిల్‌ట్యాక్స్) పడుతుందని అంచనావేసింది. దీనితోపాటు డాలర్ చెల్లింపుల కారణంగా డాలరుతో రూపాయి మారకం విలువలు కూడా 95వరకూ వెళతాయని దిగుమతులపరంగా ద్రవ్యోల్బణం, కరెంటుఖాతా లోటును మరింతగా పెంచే అవకాశం ఉంటుందని అంచనావేసింది. అనిశ్చితి పెరుగుతుండటంతో ఆర్థిక మార్కెట్లను క్రమబద్ధీకరించేందుకు రిజర్వుబ్యాంకు చర్యలు తీసుకోవడం కొంత ఆర్థికవ్యవస్థకు మేలుచేసినట్లు యూనియన్‌బ్యాంకు ప్రకటించింది.

రికార్డుస్థాయిలో 90 బిలియన్ డాలర్ల ఎఫ్‌డిఐలు

ప్రధాన ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్

న్యూఢిల్లీ ఏప్రిల్ 26: విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఈఏడాది మొత్తంగా 90 బిలియన్ డాలర్లవరకూ ఉంటాయని ప్రధాన ఆర్థిక సలహాదారు వి అనంతనాగేశ్వరన్ అంచనావేసారు. ఏప్రిల్‌నుంచి ఫిబ్రవరి కాలానికి 88 బిలియన్ డాలర్లు అధిగమించాయని, మరికొద్దిరోజుల్లోనే ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున మొత్తంగా 90 బిలియన్ డాలర్లకు చేరుకోవచ్చని అంచనావేసారు. అంతకుముందు ఏడాది ఉన్న 70నుంచి 80 బిలియన్ డాలర్లను బ్రేక్‌చేయగలమని కూడా ఆయన చెప్పారు. 2025 కంటే ఈ ఏడాది 10శాతం అదనంగా ఎఫ్‌డిఐలు వస్తాయన్నారు. ఎఫ్‌డిఐలు మరిన్ని సాధించేందుకు భారత్‌కు ఉన్న సాధ్యాసాధ్యాలపై ప్రశ్నించేవారికి ఇదే సమాధానం అవుతుందని ఆయన పేర్కొన్నారు. మొట్టమొదటిసారిగా ఎఫ్‌డిఐలు పూర్తి ఆర్థికసంవత్సరానికి వచ్చే పెట్టుబడులు స్థూల దేశీయోత్పత్తిలో రెండుశాతం వరకూ ఉన్నాయని, ఇది శుభసూచకమని అన్నారు. ఇప్పటికే ఆర్బీఐ కూడా ఎఫ్‌డిఐలు మెరుగుపడినట్లుప్రకటించింది. గత ఏడాది కంటే ఈ ఏడాది ఇప్పటివరకూ ఎఫ్‌డిఐలు మరింతగా ఎక్కువ వచ్చాయని ఆర్బీఐ కూడా ధృవీకరించింది. ఈ ఏడాది ఏప్రిల్ ఫిబ్రవరి మధ్యకాలంలోనే 18.1శాతంపెరిగి 88.3 బిలియన్ డాలర్లు అందాయి. నికరంగా ఎఫ్‌డిఐలు 6.3బిలియన్ డాలర్లుపెరిగాయని అంచనావేసారు.

టాప్ 7 కంపెనీల్లో రూ.2 లక్షలకోట్ల ఎంక్యాప్ లాస్!



ముంబయి, ఏప్రిల్ 26: దేశంలోని టాప్ పది మార్కెట్ విలువలున్న కంపెనీల్లో ఏడు కంపెనీల మార్కెట్ విలువల్లో రెండు లక్షలకోట్లు పతనం అయ్యాయి. టిసిఎస్, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎక్కువ నష్టపోయాయి. ఈక్విటీ మార్కెట్లలో నెలకొన్న ప్రతికూలతలు, పశ్చిమాసియా యుద్ధప్రభావాలు కూడా ఇందుకు తోడయినట్లు తెలుస్తోంది. ఏడు కంపెనీలలో మొత్తం రూ.2,05,343.06 కోట్లు ఆవిరి అయ్యాయి. టిసిఎస్ విలువలు 66,699.44 కోట్లు క్షీణించి రూ.8,67,364.12కోట్లకు చేరితే రిలయన్స్ 50,67న0.12కోట్లు క్షీణించి రూ.17,96,647.50 కోట్లకు చేరింది. ఇక హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 23,090.05 కోట్లు క్షీణించి రూ.12,08,22.48 కోట్లకు చేరితే ప్రభుత్వ రంగంలోన ఎల్‌ఐసి 19,670.75 కోట్లు క్షీణించి రూ.5,13,020.56కోట్లకు చేరింది. భారతి ఎయిర్‌టెల్ ఎంక్యాప్ 19,406.59 కోట్లు క్షీణించి రూ.11,05,718.62 కోట్లకు చేరింది. ఐసిఐసిఐబ్యాంకు ఎంక్యాప్ రూ.14,663.27 కోట్లు క్షీణించి రూ.9,50,345.40 కోట్లకు చేరితే ఎల్అండ్ కూడా రూ.11,142.64 కోట్లు తగ్గి రూ.5,52,171.88 కోట్లుగా ఉంది. అయితే స్టేట్‌బ్యాంకు ఎంక్యాప్ మాత్రం రూ.19,522.76 కోట్లు పెరిగి రూ.10,16,752.53 కోట్లకు చేరింది. బజాజ్‌ఫైనాన్స్ రూ.8253.64 కోట్లు పెరిగి రూ.5,73,690.81 కోట్లకు చేరింది. ర్యాంకింగ్‌లో వరుసగా రిలయన్స్ టాప్‌లో ఉంటే హెచ్‌డిఎఫ్‌సి, భారతి ఎయిర్‌టెల్, ఎస్‌బిఐ, ఐసిఐసిఐబ్యాంకు, టిసిఎస్ బజాజ్‌ఫైనాన్స్, ఎల్అండ్‌టి, హిందూస్థాన్ యూనిలీవర్, ఎల్‌ఐసిలు తర్వాత స్థానాల్లో నిలిచాయి. గతవారంలో బిఎస్ఇ సెన్సెక్స్ 1829.33.ఆయింట్లు క్షీణిస్తే ఎన్ఎస్ఇ నిఫ్టీకూడా 455.6 పాయింట్లు క్షీణించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.